RNI No.TELTEL/2005/16755
# ప్రజాబలం
PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక
Website: prajabalam.in




04 డిసెంబర్ 2024 బుధవారం | హైదరాబాద్ | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:20 | సంచిక:157

# హైదరాబాద్‌ను టోక్యో, న్యూయార్క్ నగరాలతో పోటీ పడేలా చేస్తాం: రేవంత్ రెడ్డి

**హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్న సీఎం**
**ఇబ్రహీంపట్నంలో అంతర్జాతీయ పండ్ల మార్కెట్ నిర్మిస్తున్నామని వెల్లడి**
**కాంగ్రెస్ వచ్చాక రియల్ ఎస్టేట్ వ్యాపారం 29 శాతం పెరిగిందన్న సీఎం**



లక్షన్నర కోట్ల రూపాయలు ఖర్చు చేస్తే హైదరాబాద్ అద్భుత నగరం అవుతుందని, టోక్యో, న్యూయార్క్ నగరాలతో పోటీ పడేలా చేస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా హైదరాబాద్‌లో నిర్వహించిన రైజింగ్ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ... హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రూ.7 వేల కోట్లతో నగరంలో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. మురుగునీటి శుద్ధి ప్లాంట్లు, ఫ్లైఓవర్లు, నాలాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ప్రజాపాలన కోసం తెలంగాణ ప్రజలు ఏడాది క్రితం తీర్పునిచ్చారని, తాము ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామన్నారు. మెట్రో రైలును హైదరాబాద్ తీసుకు వచ్చిందే కాంగ్రెస్ ప్రభుత్వమని వెల్లడించారు. రూ.35 వేల కోట్లతో 360 కిలోమీటర్ల రీజినల్ రింగ్ రోడ్డుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. ఇబ్రహీంపట్నంలో అంతర్జాతీయ పండ్ల మార్కెట్‌ను నిర్మించబోతున్నామన్నారు.

మాజీ సీఎం కేసీఆర్ అబద్ధాలతో పదేళ్లు గడిపేశారని ఆరోపించారు. హైదరాబాద్ నగర అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిందేమీ లేదని విమర్శించారు. ఢిల్లీ, ముంబై, చెన్నై, బెంగళూరు నగరాల్లో కాలుష్యం, ట్రాఫిక్ జాం తదితర సమస్యలతో నివసించడానికి ఇబ్బందికరంగా మారిందన్నారు. అందుకే హైదరాబాద్‌పై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు.

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రియల్ ఎస్టేట్ వ్యాపారం 29 శాతం పెరిగిందన్నారు. హైడ్రా కేవలం అక్రమ నిర్మాణాలను మాత్రమే కూల్చుతోందని స్పష్టం చేశారు. మూసీ పునరుజ్జీవం ముందుకు వెళ్లకుండా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అడ్డుపడుతున్నారని ఆరోపించారు. కిషన్ రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే తెలంగాణకు, హైదరాబాద్‌కు నిధులు తీసుకురావాలని సవాల్ చేశారు.

మెట్రోకు రూ.35 వేల కోట్లు, రీజినల్ రింగ్ రోడ్డుకు రూ.35 వేల కోట్లు ఖర్చవుతాయని, కేంద్రం నుంచి కిషన్ రెడ్డి ఎంత మేరకు నిధులు తీసుకువస్తారో చెప్పాలన్నారు. ప్రధాని మోదీ గుజరాత్‌కు నిధులు తీసుకెళుతుంటే కిషన్ రెడ్డి చూస్తూ ఉన్నారని ఎద్దేవా చేశారు. అభివృద్ధి చేస్తే కాంగ్రెస్‌కు పేరొస్తుందని బీఆర్ఎస్ ఆందోళన చెందుతోందని విమర్శించారు.

# వాయిదా నోటీసులు తిరస్కరించిన రాజ్యసభ చైర్మన్ ధన్‌ఖడ్

**రాజ్యసభలో మంగళవారం మామూలుగా కార్యకలాపాలు**
**జీరో అవర్‌లో ఎస్‌పి వాకౌట్**



న్యూఢిల్లీ డిసెంబర్ 3 రోజుల పాటు సభా కార్యకలాపాలు తుడిచిపెట్టుకుపోయిన తరువాత రాజ్యసభ మంగళవారం మామూలుగా పని చేసింది. ప్రజా ప్రాధాన్యం ఉన్న అంశాలను సభ్యులు ప్రస్తావించారు. సభ నిర్ణీత జీరో అవర్‌ను ముందు చేపట్టింది. ఆ తరువాత ప్రశ్నోత్తరాల సమయం సాగింది. అదానీ గ్రూప్‌పై అవినీతి ఆరోపణలు, యుపి సంభాల్‌లో హింసాకాండ సహా పలు సమస్యలపై ప్రతిపక్ష సభ్యులు రభస సృష్టిస్తుండడంతో నవంబర్ 25న శీతాకాల సెషన్ ప్రారంభమైనప్పటి నుంచి రాజ్యసభ ఎటువంటి కార్యకలాపాన్నీ నిర్వహించలేకపోయింది. కాగా, మంగళవారం జీరో అవర్ (ఉదయం సెషన్)లో సమాజ్‌వాది పార్టీ (ఎస్‌పి) సభలో నుంచి వాకౌట్ చేసింది. టిఎంసి సభ్యులు కూడా కొద్ది సేపు వాకౌట్ చేశారు. 267 నిబంధన కింద తనకు 42 వాయిదా నోటీసులు అందాయని, రాజ్యాంగాన్ని ఆమోదించిన శతాబ్ది చివరి త్రైమాసికంలో ఇంత వరకు ఇవే అధికమని చైర్మన్ జగ్దీప్ ధన్‌ఖడ్ అంతకుముందు చెప్పారు. తాను నోటీసుల్లో దేనినీ అంగీకరించలేదని ఆయన తెలిపారు. ఎంపి ఒకరు 267 నిబంధన కింద ఒకటికి మించి నోటీసులు ఇచ్చారని, ఆ సభ్యునికి వాటి ప్రస్తావనకు అవకాశం ఇవ్వడం ఏమాత్రం సాధ్యం కాదని ధన్‌ఖడ్ స్పష్టం చేశారు. 267 కింద నోటీస్‌ను పరిశీలించే ముందే బహిరంగపరచడం పట్ల ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అది 'నిబంధనలను బేఖాతరు చేయడమే' అని, అది మరీ తీవ్రమైన విషయమని చైర్మన్ అభివర్ణించారు. వివిధ పార్టీల నేతల దృష్టికి దీనిని తీసుకువెళ్లనున్నట్లు ఆయన చెప్పారు. అత్యున్నత నైతిక ప్రమాణాలు పాటించవలసిందిగా సభ్యులకు ఆయన విజ్ఞప్తి చేశారు. ఆ తరువాత సభ జీరో అవర్ ప్రస్తావనలతో సాగింది. చైర్మన్ ముందస్తు అనుమతితో ఆ సమయంలో అంశాలను సభ్యులు ప్రస్తావించారు. తమిళనాడులో ఫెంగల్ తుపాను సృష్టించిన సమస్యలను ఎం మొహమద్ అబ్దుల్లా (డిఎంకె), వైకో (ఎండిఎంకె) సభ దృష్టికి తీసుకువచ్చారు. ఒడిశా పూరిలో ప్రతిపాదిత అంతర్జాతీయ విమానాశ్రయాన్ని పూర్తి చేసి, పని చేయించాలని సుభాశీశ్ ఖుంతియా (బిజెడి) కోరారు. రామ గోపాల్ యాదవ్ (ఎస్‌పి) సంభాల్‌లో ఇటీవలి హింసాకాండ అంశాన్ని లేవదీశారు. కాంగ్రెస్ ఎంపి ప్రమోద్ తివారి కూడా ఆ అంశంపై మాట్లాడారు

# సభా కార్యకలాపాలకు అంతరాయం కలిగిస్తే శని, ఆదివారం కూడా సభ పెడ్తా

**లోక్‌సభలోసభ్యులనుహెచ్చరించినస్పీకర్ ఓమ్ బిర్లా**



న్యూఢిల్లీ డిసెంబర్ 3 వాయిదాల కారణంగా సభా కార్యకలాపాలకు మరింత అంతరాయం వాటిల్లిన పక్షంలో ఆ సమయం నష్టాన్ని భర్తీ చేయడానికి వారాంతాల్లో తాను సభా కార్యక్రమాలను నిర్వహించవలసి వస్తుందని లోక్‌సభ స్పీకర్ ఓమ్ బిర్లా మంగళవారం సభ్యులను హెచ్చరించారు. పార్లమెంట్‌లో వారం రోజులుగా సాగుతున్న ప్రతిష్టంభనను అంతం చేయడానికి ప్రభుత్వం, ప్రతిపక్షాలు సోమవారం ఒక ఒప్పందానికి వచ్చిన విషయం విదితమే. రాజ్యాంగాన్ని ఆమోదించిన 75వ వార్షికోత్సవం సందర్భంగా లోక్‌సభ, రాజ్యసభలలో రాజ్యాంగంపై చర్చకు తేదీలను ప్రకటించడమైంది. రాజ్యాంగంపై దిగువ సభలో ఈ నెల 13, 14 తేదీల్లోను, ఎగువ సభలో 16, 17 తేదీల్లోను చర్చ చేపడతారు.మంగళవారం ప్రశ్నోత్తరాల సమయం ముగిసిన వెంటనే స్పీకర్ బిర్లా మాట్లాడుతూ.. 'సభ 14 ఉదయం 11 గంటలకు సమావేశం అవుతుంది. మీరు వాయిదాలు కొనసాగించినట్లయితే వాయిదా పడిన రోజులకు సంబంధించి మీరు శని, ఆదివారాల్లో కూడా సభా కార్యకలాపాలకు హాజరు కావలసి ఉంటుంది' అని స్పష్టం చేశారు. మంగళవారం ఎటువంటి వాయిదా నోటీసుల వర్తమానాన్నీ తాను అనుమతించలేదని కూడా బిర్లా చెప్పారు. అదానీ వివాదం, ఉత్తర ప్రదేశ్ సంభాల్‌లో ఇటీవలి హింసాకాండ, తదితర సమస్యలపై ప్రతిపక్ష సభ్యుల నిరసనల కారణంగా క్రితం వారం లోక్‌సభ కార్యకలాపాలు తుడిచిపెట్టుకుపోయాయి.




ప్రజాబలం

04 డిసెంబర్ 2024 బుధవారం

# నష్టాల మినహాయింపుపై మోడీ ప్రభుత్వ టోకరా

అదాని విద్యుత్‌ను రాజస్థాన్ నుండి సెకి ద్వారా కొనుగోలు చేసే ఒప్పందాన్ని, ధరను సమర్ధించుకునేందుకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం, డిస్కాంలు, ఎపిఈఆర్‌సి చేసిన వాదనలలో రాజస్థాన్ నుండి ఆంధ్రప్రదేశ్ సరిహద్దు వరకు జరిగే సరఫరాకు పిజిసిఐఎల్‌కు చెల్లించాల్సిన అంతర్ రాష్ట్ర ప్రసార చార్జీలను (ఐఎస్‌టిఎస్) చెల్లించనవసరం లేకుండా కేంద్ర ప్రభుత్వం మినహాయింపు ఇచ్చిందనేది ఒకటి. అదేవిధంగా, ఆ క్రమంలో వాటిల్లే ప్రసార నష్టాల నుండి కూడా మినహాయింపు ఇచ్చిందనేది మరో వాదన. అంటే, ప్రసార నష్టాలను తగ్గించకుండా రాష్ట్రానికి పూర్తిగా అదాని విద్యుత్ సరఫరా జరుగుతుందని దీని అర్ధం. అందువల్ల అదాని విద్యుత్ కొనుగోలు లాభదాయకమని వాదించారు. కేంద్ర ప్రభుత్వం కొన్ని షరతులతో పేర్కొన్న గడువులో నెలకొల్పే సౌర, పవన, మరికొన్ని ప్రాజెక్టులకు ఇలాంటి మినహాయింపులను ఇస్తూ ఉత్తర్వులను జారీ చేసింది. 25 ఏళ్ళ పాటు ఈ మినహాయింపు ఉంటుందని ఉత్తర్వులలో పేర్కొన్నారు. అయితే, ఆ ఉత్తర్వులలో ఈ ప్రసార చార్జీలు, నష్టాలకయ్యే వ్యయాన్ని ఎవరు భరించాలనేది స్పష్టం చేయలేదు. మోడి ప్రభుత్వం అలాంటి వ్యయాన్ని పిజిసిఐఎల్‌కు సర్దుబాటు చేయటం లేదు. పిజిసిఐఎల్‌కు చెల్లించాల్సిన చార్జీలను కేంద్ర విద్యుత్ నియంత్రణ కమిషన్ (సిఇఆర్‌సి) నిర్ణయిస్తుంది. ఆ యా రాష్ట్రాలలోని డిస్కాంలు ఇతర రాష్ట్రాలలోని విద్యుత్ ప్రాజెక్టుల నుండి కొనుగోలు చేసే విద్యుత్‌ను ప్రసారం చేసేందుకు అవసరమైన ప్రసార సామర్ధ్యానికి పిజిసిఐఎల్‌తో కాంట్రాక్టు చేసుకుంటాయి. ఆ సామర్ధ్యం మేరకే అవి సిఇఆర్‌సి నిర్ణయించిన ఐఎస్‌టిఎస్ చార్జీలను చెల్లిస్తాయి. అయితే, సిఇఆర్‌సి ఈ విధానాన్ని మార్చి, ఒక ప్రసార ప్రాజెక్టును నెలకొల్పిన ప్రాంతంలోని రాష్ట్రాల డిస్కాములు అవి పిజిసిఐఎల్‌తో కాంట్రాక్టు చేసుకున్న ప్రసార సామర్ధ్యానికే గాకుండా, ఆ ప్రాంతంలోని ప్రసార ప్రాజెక్టు సామర్ధ్యానికి అవసరమైన ఐఎస్‌టిఎస్ చార్జీలను చెల్లించాలని రెగ్యులేషన్ తెచ్చింది. గత సంవత్సరాలలో సంబంధిత డిస్కాం ఎక్చేంజిల ద్వారా, మార్కెట్‌లో కొనుగోలు చేసిన విద్యుత్‌ను కూడా పరిగణనలోకి తీసుకుని ఐఎస్‌టిఎస్ చార్జీలను నిర్ణయించే జనరల్ నెట్‌వర్క్ యాక్సెస్ (జిఎన్ఎ) రెగ్యులేషన్ జారీ చేసి, దాని ప్రకారం చార్జీలను నిర్ణయిస్తున్నది. అయితే, మోడి ప్రభుత్వం పైన పేర్కొన్న ఐఎస్‌టిఎస్ చార్జీలు, ప్రసార నష్టాల మినహాయింపులను ఎలా సర్దుబాటు చేయాలనే అంశాన్ని రెగ్యులేషన్‌లో, తన చార్జీల ఉత్తర్వులలో సిఇఆర్‌సి దాటవేసింది. వాటికయ్యే వ్యయాన్ని కేంద్ర ప్రభుత్వం భరించాలని ఎక్కడా పేర్కొనలేదు. సిఇఆర్‌సి అడ్డగోలు విధానాన్ని సవాలు చేస్తూ పలు రాష్ట్రాల డిస్కాంలు దాఖలు చేసిన పిటిషన్లపై న్యాయపరమైన వివాదాలు నడుస్తున్నాయి. మోడి ప్రభుత్వం, సిఇఆర్‌సి ఇలాంటి మోసపూరిత వైఖరులతో వ్యవహరించటం వల్ల, ప్రకటించిన ఐఎస్‌టిఎస్ చార్జీల, ప్రసార నష్టాల మినహాయింపుల ప్రయోజనాలు వినియోగదారులకు దక్కకుండా పోతున్నాయి. ఆ మినహాయింపులకయ్యే వ్యయం కూడా సిఇఆర్‌సి కనీసపాటి నిజాయితీ లేకుండా అనుసరిస్తున్న అడ్డగోలు విధానంతో విద్యుత్ వినియోగదారులపై పడుతున్నది. అంటే, మోడి ప్రభుత్వం ప్రకటించిన మినహాయింపులు మిధ్యగా మారాయి. ఇలాంటి మినహాయింపులను ఇస్తున్నట్లు ప్రకటించిన మోడి ప్రభుత్వం అవి అమలు జరగకుండా చేసి వినియోగదారులకు ప్రయోజనం కల్పించినట్లు ప్రచారం చేసుకుంటూ టోకరా వేస్తున్నది. అదాని ప్రాజెక్టుల, అలాంటి ఇతర ప్రాజెక్టుల సౌర విద్యుత్ చార్జీలు ఇలాంటి మినహాయింపులతో చవకగా ఉంటాయని మభ్యపెట్టడానికి మోడి ప్రభుత్వం మోసపూరితంగా వ్యవహరిస్తున్నది. అదాని సౌర విద్యుత్ ప్రసారానికి ఐఎస్‌టిఎస్ చార్జీలు, ప్రసార నష్టాలకు యూనిట్‌కు కనీసం రూ.2.20 అవుతుందని కన్సల్టెంట్లు, ఇంజనీర్ల అంచనా. దాని ఆధారంగానే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గత జులై తొమ్మిదిన రాష్ట్రంలో విద్యుత్ రంగ పరిస్థితిపై విడుదల చేసిన శ్వేత పత్రంలో సెకి ద్వారా కొనే సౌర విద్యుత్‌కు జిఎన్ఎ (ఐఎస్‌టిఎస్) చార్జీల నిమిత్తం ఏడాదికి రూ.3000–3500 కోట్ల మేరకు అదనపు భారం పడుతుందని అంచనా చూపారు. అంటే, 25 ఏళ్ళలో ఈ అదనపు భారం రూ.75,000–87,500 కోట్ల మేరకు ఉంటుంది. ఇదిగాక, అదాని సౌర విద్యుత్ కొనుగోలు వల్ల, అధిక రేటు, సెకి కమిషన్, థర్మల్ విద్యుత్ బ్యాకింగ్ డౌన్‌కు చెల్లించాల్సిన స్థిర చార్జీలు, మార్కెట్లో విద్యుత్ కొనుగోలుకు అయ్యే అదనపు వ్యయం, రాష్ట్ర సరిహద్దు నుండి రాష్ట్రమంతటా ఆ విద్యుత్ సరఫరాకు అదనంగా అయ్యే ప్రసార, పంపిణీ నష్టాలు, తదితరాలను కలుపుకుంటే, 25 ఏళ్ళలో అదనపు భారం ఇంకా చాలా అధికంగా ఉంటుంది. మోడి ప్రభుత్వం ప్రకటించిన మినహాయింపులు అమలు కావు గనకే చంద్రబాబు నాయుడు ఈ అదనపు భారాల అంచనాలను శ్వేత పత్రంలో చూపారు. అదాని సౌర విద్యుత్ కొనుగోలుకు ప్రత్యక్షంగా గాని, పరోక్షంగా గాని యూనిట్‌కు రూ.5కు పైగా భారం వినియోగదారులపై పడుతుంది. గతంలో చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ప్రకటించిన పునరుత్పత్తి అయ్యే విద్యుత్ విధానంలో సౌర, పవన విద్యుత్ ఉత్పత్తిదారులకు అనేక రాయితీలను, మినహాయింపులను, ప్రోత్సాహకాలను ప్రకటించారు. అయితే, వాటికయ్యే వ్యయాన్ని ఎవరు భరించాలనేది పేర్కొనకుండా దాటవేశారు. అప్పటి ఎపిఈఆర్‌సి కూడా వాటికి సంబంధించి జారీ చేసిన రెగ్యులేషన్‌లలో ఆ వ్యయాన్ని ఎవరు భరించాలనేది పేర్కొనకుండా దాటవేసింది. ఆచరణలో ఆ భారాలన్నిటిని వినియోగదారులపై మోపుతూ వస్తున్నారు. ఆవిధంగా మోడి, చంద్రబాబు ఒక తానులోని ముక్కలే. శ్వేత పత్రంలోను, దానిని విడుదల చేస్తూ మీడియాతో మాట్లాడినపుడు చంద్రబాబు అదాని పేరును, మోడి ప్రభుత్వ టోకరాను ప్రస్తావించకపోవటం గమనార్హం.

# చేతకాకపోతే కేంద్ర హోం మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలి

## చేయాలని ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ డిమాండ్



న్యూఢిల్లీ డిసెంబర్ 3 : దేశ రాజధానిలో అస్తవ్యస్తమైన శాంతిభద్రతలను పరిరక్షించడం చేతకాకపోతే కేంద్ర హోం మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ డిమాండ్ చేశారు.అంతటా గందరగోళంగా ఉంది, పెరుగుతున్న నేరాల కారణంగా ప్రజలు తమ ఇళ్ల నుండి బయటకు రావడానికి భయపడుతున్నారు. పితంపుర స్లమ్ క్లస్టర్‌లో తన ఇంటి వెలుపల కత్తితో పొడిచి చంపబడిన యువకుడి బంధువులను కలిసిన తర్వాత కేజ్రీవాల్ ఈ ఆరోపణలు చేశారు. “ఇద్దరు యువకులపై ఏడెనిమిది మంది స్థానిక యువకులు దాడిచేశారు. మనీశ్ అనే యువకుడిని అనేకమార్లు పొడిచి చంపారు. అతడిని సకాలంలో ఆసుపత్రికి చేర్చకపోవడం వల్ల చనిపోయాడు. హిమాంశు అనే మరో యువకుడిని రక్షించగలిగారు. అయితే సాక్షి వాంగ్మూలాన్ని పోలీసులు రికార్డు చేయలేదు” అని కేజ్రీవాల్ తెలిపారు.“ఒకవేళ అమిత్ షా ఢిల్లీలో శాంతిభద్రతల పరిస్థితిని పరిరక్షించలేకపోతే, కేవలం దేశంలో రాజకీయ పర్యటనలకే పరిమితమైతే ఆయన రాజీనామా చేయాలి” అని మాజీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ అన్నారు. పోలీసులు బాధితులనే బెదిరిస్తున్నారే తప్ప చర్యలు చేపట్టడం లేదని అన్నారు. దీనిపై ఢిల్లీ పోలీసుల ప్రతిస్పందన కరువయింది. కారణం కేంద్ర హోం మంత్రిత్వ శాఖ అదుపు వారిపై ఉందని కేజ్రీవాల్ ఆరోపించారు. మాదక ద్రవ్యాల దుర్వినియోగం, గొలుసు దొంగతనాలు, ఇతర నేరాలు ఢిల్లీలో పెరిగిపోతున్నాయని, తనకు అనేక ఫోన్ కాల్స్ వస్తున్నాయని, తమ ప్రాంతానికి వచ్చిపొమ్మని కోరుతున్నారని తెలిపారు. తాను ప్రజల సమస్యలను లేవనెత్తుతానని అన్నారు. ఇదిలావుండగా కేజ్రీవాల్ ఢిల్లీలో పాలిస్తున్న ఆప్ ప్రభుత్వ అవినీతి నుంచి దృష్టి మళ్లించడానికే ఇలా శాంతిభద్రతల అంశాన్ని లేవనెత్తుతున్నారని బిజెపి ఆరోపించింది.

# దేశంలో తగ్గిన బంగారం ధరలు..



హైదరాబాద్ డిసెంబర్ 3 దేశంలోని ప్రజలందరూ పండగలు, పెళ్ళిళ్ళు అంటూ అనేక సంధర్భాల్లో బంగారం కొనుగోలు చేస్తూనే ఉంటారు. ధర ఎంత అయినా ఉందని సందర్భాన్ని బట్టి కొనుగోలు చేస్తారు. అయితే బంగారం ధరలు స్థిరంగా అసలు ఉండవు. ధరలు రోజురోజుకి పెరుగుతూనే ఉంటాయి. ఒకసారి ధరలు పెరుగుతే మరోసారి తగ్గుతాయి. ఈ క్రమంలో బంగారం కొనడానికి ప్రజలు వెనకడుతారు. ఈరోజు అనగా డిసెంబర్ 3వ తేదీ మంగళవారం నాడు దేశ వ్యాప్తంగా అన్ని ప్రధాన నగరాల్లో, తెలుగు రాష్ట్రాల్లో బంగారం తాజా ధరలు:ఢిల్లీ..22 క్యారెట్ల పసిడి ధర రూ.71,040..24 క్యారెట్ల ధర రూ.77,490,..ముంబై..22 క్యారెట్ల ధర రూ.70,890..24 క్యారెట్ల ధర రూ.77,340,..చెన్నై...22 క్యారెట్ల రేట్ రూ.70,890,..24 క్యారెట్లు రూ.77,340,...బెంగళూరు..22 క్యారెట్ల ధర రూ.70,890...24 క్యారెట్ల ధర రూ.77,340,..తెలుగు రాష్ట్రాల్లో ...హైదరాబాద్..22 క్యారెట్ల ధర రూ.70,890,..24 క్యారెట్ల ధర రూ.77,340,..విశాఖపట్నం...22 క్యారెట్ల ధర రూ.70,890,..24 క్యారెట్ల ధర రూ.77,340,..విజయవాడ;..22 క్యారెట్ల ధర రూ.70,89024 క్యారెట్ల ధర రూ.77,340.

# మానవత్వం చాటుకున్న రాచకొండ పోలీసులు

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని ప్రాణాలకు భరోసా కల్పిస్తూ రాచకొండబిపోలీసులు ఆదర్శంగా నిలిచారు. స్వయంగా తన పోలీసు వాహనంలో బాధితుడిని హాస్పిటల్‌కు తరలించి మానవత్వాన్ని చాటుకున్న హయత్ నగర్ ఇన్స్పెక్టర్ నాగరాజు గౌడ్. తేదీ : 02.12.2024 రోజు రాత్రి ఇబ్రహీంపట్నం చెరువు కట్టపై జరిగిన ప్రమాదంలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనగా, ఒక వ్యక్తి తీవ్ర గాయాలతో స్పృహ తప్పి రోడ్డుపై పడిపోయాడు. ఆ దృశ్యాన్ని గమనించిన ఐఅఖ వనస్థలిపురం కాశీ రెడ్డి మరియు హయత్ నగర్ ఇన్స్పెక్టర్ నాగరాజు గౌడ్, ఆలస్యం చేయకుండా బాధితుడిని తమ పోలీసు వాహనంలో లిమ్స్ హాస్పిటల్, ఇబ్రహీంపట్నం కు చేరవేశారు.సకాలంలో ఆసుపత్రికి చేరడంతో బాధితుడి ప్రాణాలు కాపాడగలిగారు. ఈ ఘటన హయత్ నగర్ పోలీసుల బాధ్యతాయుతమైన విధి నిర్వహణను, మానవత్వాన్ని ప్రతిబింబిస్తుంది.

## వైద్యులు సమయ పాలన పాటించాలి

# జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్

మెట్ పల్లి, వైద్యులు సమయ పాలన పాటించి,వైద్య సేవలను మెరుగు పరచాలని, జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ ఆదేశించారుమంగళవారం మెటపల్లి పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఓపీ సేవలు, ఆన్ లైన్ రిజిస్టర్లను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఆసుపత్రిలో ప్రసూతి సేవలను, వైద్య సేవలను మెరుగు పరచాలని, డాక్టర్లు సమయ పాలన పాటించాలని కలెక్టర్ ఆదేశించారు. రోజుకు ఎన్ని ఓ.పి.లను చూస్తున్నారు, ఎంతమంది డెలివరీలు అయ్యారని, ప్రభుత్వ ఆసుపత్రిలో నార్మల్ డెలివరీలను పెంచుటకు గర్భిణులను ప్రోత్సహించాలని డాక్టర్లకు సూచించారు. ఆసుపత్రిలో పేషెంట్లకు నాణ్యమైన ఆహారాన్ని, త్రాగునీరు అందిస్తున్నారా లేదా లేని యెడల వెంటనే పేషెంట్లకు అందించుటకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆసుపత్రిలో శుభ్రమైన త్రాగునీరు సరఫరా చేసే విధంగా వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. పేషెంట్ లను కలిసి వారి ఆరోగ్య వివరాలు మరియు హాస్పిటల్ సిబ్బంది వ్యవహరించే తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రి భవనానికి కలర్స్ మరమ్మత్తులు చేయించాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో మెటపల్లి ఆర్డీఓ శ్రీనివాస్, ఎమ్మార్వో, ఆర్ఎంవో రామకృష్ణ, ఆసుపత్రి సూపరిండెంటెండ్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.


## నందిగామటెక్నాలజీ ఉపయోగించి వేలిముద్రల ఆధారంగా 48 గంటల్లో దొంగను పట్టుకున్న నందిగామ పోలీసులు

### ఈనెల 30వ తారీకు రుద్రవరం గ్రామంలో పట్టపగలే ఇంటి తాళం పగలగొట్టి బంగారం డబ్బు దోచుకెళ్లిన దొంగ




దొంగతనం జరిగిందని ఫిర్యాదు అందిన వెంటనే ఏసీపీ తిలక్ ఆదేశాల మేరకు సిఐవైవి ఎల్ నాయుడు స్పెషల్ టీం ఏర్పాటు చేసి 48 గంటల్లో దొంగను పట్టుకొని బంగారం నగదు స్వాధీనం చేసుకున్నారుఏసిపి ఏబీజీ తిలక్ మీడియాతో మాట్లాడుతూ ఈనెల 30వ తారీకు రుద్రవరం గ్రామంలో దొంగతనం జరిగిందని 30–11–24 వ తేదిన మధ్యహ్నం సుమారు 12.30 గంటల సమయంలో నందిగామ రుద్రవరం గ్రామానికి చెందిన పసుపులేటి లక్ష్మి నందిగామ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసిందితను ఇంటిలో లేని సమయంలో ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు ఇంటికి వేసిన తాళం పగుల కొట్టి ఇంటిలో లోకి ప్రవేశించి , ఇనుప బీరువా ను పగుల కొట్టి దానిలో లాకర్ లో ఉన్న కొంత డబ్బులను, బంగారపు వస్తువులను తీసుకోని వెళ్లాడు అని ఫిర్యాదు మేరకు సీఐ వైవి ఎల్ నాయుడు ఎస్సై అభిమన్యుతో స్పెషల్ టీం ఏర్పాటు చేసి 48 గంటల్లో దొంగను పట్టుకొని బంగారం నగదు స్వాధీనం చేసుకున్నారుసాంకేతిక టెక్నాలజీ ఉపయోగించి వేలిముద్రల ఆధారంగా దొంగను పట్టుకున్నామని ఇతను గతంలో కూడా కొన్ని దొంగతనాలు చేశాడని ఏసిపి తెలిపారు దొంగతనం చేసిన వ్యక్తి చింతల గోపాల రావు, తండ్రి లేటు కృష్ణ, వయసు 30 సంవత్సరములు, కులము వడ్డెర, పోలంపల్లి గ్రామం, వత్సవాయి మండలం, ఔఖీ జిల్లా. ప్రస్తుతము:– కోదాడ టౌన్, తెలంగాణా రాష్ట్రం నివసిస్తున్నాడు ముద్దాయి వద్ద నుండి ఒక బంగారపు నానుత్రాడు షుమారు 16 గ్రాములు ఒక చిన్న ఉంగరము షుమారు 2 గ్రాములు,38,500/– నగదును సిజ్ చేయడం చేసామని ఏసిపి తెలిపారు

# ఏసీబీ వలలో తాహశీల్దార్



నెల్లూరు ముత్తుకూరు తాసిల్దార్ కార్యాలయంపై ఏసీబీ అధికారులు దాడులు రైతు వద్ద నుండి 20,000 లంచం తీసుకుంటున్న తాసిల్దార్ బాలకృష్ణను ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. ఏసీబీ డిఎస్పి శిరీష తెలిపిన వివరాల మేరకు ముత్తుకూరు మండలానికి చెందిన వెంకటరమణయ్య అనే రైతు తన తల్లి కాంతమ్మ కి సంబంధించిన పొలానికి అడంగల్ లో సవరణలు చేసేందుకు ముత్తుకూరు తాహసిల్దార్ కార్యాలయాన్ని సంప్రదించగా అడంగల్ లో తప్పుగా పడిన నోషనల్ నంబర్ను తీసి ఖాతా నంబర్ గా అప్డేట్ చేసేందుకు పాస్ బుక్కులు మంజూరుకు ముత్తుకూరు తాహసిల్దార్ బాలకృష్ణ 25 వేలు లంచం డిమాండ్ చేయగా రైతు రమణయ్య ఎసిబి అధికారులకు సమాచారం ఇచ్చి ఈరోజు 25,000 రూపాయలు నగదు తాసిల్దార్ బాలకృష్ణకు లంచం ఇస్తూ ఉండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు,, నెల్లూరు జిల్లాలో ఎవరైనా లంచం అడిగితే 9440440057 అనే ఫోన్ నెంబర్ కు ఫోన్ చేసి అవినీతి నిరోధక శాఖ అధికారులను సంప్రదించాలని డిఎస్పి శిరీష తెలియజేశారు...

# అజరామరం ఆ గానం

భారతావనిలో ఎందరో గాయకులు ఉద్భవించారు. ఎందరో అవార్డులు, రివార్డులు అందుకున్నారు. కాని సంగీత ప్రియుల హృదయాలలో సుస్థిర స్థానాన్ని పొందిన ఘనత ఘంటసాల మాస్టారుకే దక్కుతుంది. ప్రముఖ గాయకులుగా, తెలుగు సినీ సంగీత దర్శకులుగా, జైలు కెళ్ళిన స్వాతంత్ర్య సమర యోధులుగా ఎనలేని కీర్తినార్జించిన గాన గంధర్వుడు తెలుగువాడు కావడం గర్వకారణం. 1922 డిసెంబర్ 4న గుడివాడ సమీప చౌటపల్లి గ్రామంలో ఘంటసాల సూర్యనారాయణ, రత్నమ్మలకు జన్మించిన వేంకటేశ్వరరావు నామాంకితుడైన ఘంటసాల, బాల్యం నుండే సంగీతం పట్ల మక్కువ కలిగి ఉన్నారు. కచేరీలలో తండ్రి మృదంగం సహకారం అందించడానికి వెళుతూ, కుమారుడిని భుజంపై ఎత్తుకుని పాటలు పాడుకుంటూ తీసుకెళ్ళేవారు. కచేరీలలో నాట్యం చేస్తూ, బాల భరతుడు అనిపించు కున్నారు, తాము గొప్ప సంగీత విద్వాంసుడు కావాలనే తమ 11వ ఏట మరణించిన తండ్రి ఆకాంక్షను సాకారం చేయ దృఢ సంకల్పులై, ఒకసారి ఒక సంగీత కచేరీలో పోటీపడి ఓటమి చెందగా, పట్టుదల మరింత పెరిగి, గురుకులాలలో చేరి, కట్టుబాట్లకు తట్టుకోలేక తిరిగి వచ్చేసారు. కొందరు విద్వాంసుల ఇళ్ళల్లో బట్టలుతికి, వంటచేసి, సంగీతా భ్యాసం చేసి, తర్వాత తమ దగ్గరున్న నలభై రూపాయల విలువైన బంగారు ఉంగరాన్ని కేవలం ఎనిమిది రూపాయలకే విక్ర యించి, ఆంధ్రరాష్ట్రంలోని ఏకైక సంగీత కళాశాల ఉన్న విజయ నగరానికి చేరుకున్నారు. రోజుకో ఇంటిలో భోజనం చేస్తూ, జోలెకట్టి అడుక్కుంటూ, ఎల్లమ్మ గుడిలో తల దాచుకున్న ఘంటసాలను పట్రాయని సీతారామశాస్త్రి యాదృచ్ఛికంగా చూడడం, తన ఇంట ఉచితంగా శిక్షణ నివ్వడానికి శాస్త్రి అంగీకరించడం ఘంటసాల జీవితాన్ని మలుపు తిప్పిన సంఘటన. పేదవాడైన శాస్త్రి, ఘంటసాలకు మధూకర (ఉంఛ వృత్తి) నేర్పించారు. తర్వాత కళాశాలలో చేరి, 4ఏళ్ళ కోర్సును రెండేళ్లకే పూర్తి చేశారు. కొన్నాళ్ళు విజయ నగరంలో కచేరీలు చేసి స్వగ్రామం చౌటపల్లికి చేరుకుని, ఉత్సవాలలో, వివాహ తదితర సందర్భాలలో గాన కచేరీలు చేసి, పాఠాలు నేర్పారు. 1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని, రెండేళ్ళు అలీపూర్ జైల్లో కఠిన కారాగార శిక్ష అనుభవించారు. 1944 మార్చి 4న తమ మేనకోడలు సావిత్రిని పరిణయమాడారు. తమ వివాహ సందర్భంలో స్వయంగా సంగీత కచేరీ చేశారు. అత్తవారి ఊరిలో సముద్రాల రాఘవాచారిని కలవగా, ఆయన సూచనపై, రెండు మాసాలు కచేరీలు చేసి, సమకూర్చుకున్న డబ్బుతో, అప్పు చేసి మద్రాసుకు చేరుకున్నారు. రాఘవాచారి ద్వారా నాటి సినీ ప్రముఖులైన చిత్తూరు నాగయ్య, బి.ఎన్.రెడ్డిల సమక్షంలో పాటలు పాడి, ప్రశంసాపాత్రు లైనారు. పానగల్ పార్కులో నిద్రిస్తూ సముద్రాల చొరవతో మద్రాసు రేడియో కేంద్రంలో లలిత సంగీత గాయకునిగా అవకాశం పొందారు. కొన్ని గీతాలు రచించి, స్వరకల్పన చేసి, స్టేషన్ ద్వారా పాడారు. తర్వాత కాలంలో భువన విజయం పేరుతో వాటిని గ్రంథస్థం గావించారు. సినిమాలలో చిన్నచిన్న వేషాలు వేసారు. "స్వర్గసీమ" చిత్రంలో తొలిసారి నాగయ్య, బి.ఎన్.రెడ్డిలు అవకాశం ఇవ్వగా, భానుమతితో పాడిన పాటకు 118 రూపాయల పారితోషికం పొందారు. భానుమతి రామకృష్ణలు తీసిన రత్నమాల చిత్ర సహాయ సంగీత దర్శకత్వ అవకాశం పొంది, తర్వాత బాలరాజు, మనదేశం లకు సంగీత దర్శకులైనారు. 1951లో విడుదలైన "పాతాళ భైరవి" ఘన విజయం ఘంటసాలకు ఎనలేని పేరు తెచ్చి పెట్టింది. మల్లీశ్వరి తర్వాత 1953లో దేవదాసు, 55లో అనార్కలి, 57లో మాయాబజార్ లాంటి హిట్ సినిమాలు ఘంటసాలను సాటిలేని మేటి గాయకునిగా నిలబెట్టాయి. 1970 వరకూ హీరో లకు, విలన్లకు, కమేడియర్లకు పాడిన ప్రతి పాటా మాస్టరుదే కావడంతో ఆయన సినీ సంగీత సామ్రాజ్యానికి మకుటం లేని మహారాజయ్యారు. 1970లో పద్మశ్రీ పురస్కారం గ్రహించారు. 71లో ఐరోపా, అమెరికాలలో ప్రదర్శనలు నిర్వహించారు. ఆరోగ్యం క్రమేపీ క్షీణించి చివరకు 1974 ఫిబ్రవరి 11న యావదాంధ్ర సంగీత ప్రియులను శోకసంద్రంలో ముంచి, స్వర్గస్తులైనారు. కరుణశ్రీ, జాషువా, మల్లాది రామకృష్ణశాస్త్రి వంటి వారి ప్రశంసలకు పాత్రులై, వారి రచనలను వీధి పాటలుగా, నూతన ఒరవడితో శైలితో పద్యాలుగా, సామాన్య జన బాహుళ్యానికి అందుబాటులోకి తెచ్చిన ఘనత మాస్టారుదే. సాంప్రదాయ సంగీతానికి భంగం వాటిల్ల నీయకుండా, సామాన్య సంగీత ప్రియులకు సైతం హృదయ రంజకంగా పాడిన "శేషశైలావాసా", "ఏడు కొండ స్వామి", రహస్యం, లవకుశ, నర్తనశాల, ఒకటేమిటి పాడిన పాటలెన్నో పండిత పామర ప్రశంసాపాత్రాలైనాయి. జన్మతః లభ్యమైన సుమధుర గంభీర గాత్రంతో గానం చేసిన "భగవద్గీత అజరామర సుస్వరాన్ని కలిగిన ఘంటసాలను అనునిత్యం స్మరణీయునిగా చేస్తూనే ఉంది.

# తెలుగు నవలా సాహిత్య వైతాళికుడు

గాంధేయ వాదిగా, న్యాయవాదిగా, సంఘ సంస్కర్తగా, స్వాతంత్ర్య యోధుడుగా, ఉద్యమ నాయకునిగా, స్త్రీ విద్య ప్రోత్సాహికునిగా, కాంగ్రెస్ నేతగా, దళిత జనోద్ధారకునిగా, ప్రధానంగా తెలుగు నవలా సాహిత్య వైతాళికుడుగా ఉన్నవ లక్ష్మీనారాయణ తెలుగు వారికి సుపరిచితుడే. ముఖ్యంగా నాటి సాంఘిక దురాచారాలను ప్రతిబింబించే, మాలపల్లి నవల నాడు ఒక సంచలనమే. సాంఘిక, ఆర్థిక అసమానతలను తొలగించి, కులవ్యవస్థను నిరసించి, అందరూ సమానులే అన్న భావనతో, అగ్రవర్ణాలు, హరిజనులు అందరూ కలసి మెలసి ఉండాలని కోరుకుంటూ, మాలపల్లి అనే విప్లవాత్మకమైన నవలను రవించడం, తన దృక్పథానికి మద్దతుగా, సహ పంక్తి భోజనాలు నిర్వహించడం ఆ రోజులలో సాహసమే. మాలపల్లి తెలుగు సాహితీ చరిత్రలోనూ, సామాజిక దృక్పథంలోనూ ఒక నూతన ఒరవడిని సృష్టికి, చర్చోప చర్చలకు కారణభూతమైంది. ఉన్నవ లక్ష్మీనారాయణ గుంటూరు జిల్లా అప్పటి సత్తెనపల్లి తాలూకా వేములూరుపాడు గ్రామంలో 1877 డిసెంబరు 4వ తేదీన శ్రీరాములు, శేషమ్మ దంపతులకు జన్మించి, ప్రాథమిక విద్య స్వగ్రామంలోనే సాగించాడు. 1897లో గుంటూరులో మెట్రిక్యులేషన్ చదివాడు. 1906లో రాజమండ్రి ఉపాధ్యాయ శిక్షణా కళాశాలలో శిక్షణ పొందాడు. 1916లో ఐర్లాండ్, డబ్లిన్ ?లలో బారిష్టర్ చదువు సాధించాడు. గాంధేయ వాదిగా, సంఘ సంస్కర్తగా, స్వాతంత్ర్య యోధుడుగా, తెలుగు నవలా సాహిత్య వైతాళికుడుగా విశేషమైన కీర్తి పొంది, సాహిత్యం ద్వారా హరిజనోద్ధరణకు కృషి చేశాడు. గుంటూరులో శ్రీ శారదా నికేతన్ ను స్థాపించి, స్త్రీ విద్యను ప్రోత్సహించాడు. కందుకూరి వీరేశలింగం పంతులు అధ్యక్షతలో తొలి వితంతు వివాహం జరిపించిన సంస్కర్తగా నిలిచాడు. 1900 లో గుంటూరులో "యంగ్?మెన్స్ లిటరరీ అసోసియేషన్?"ను స్థాపించాడు. 1902లో అక్కడే వితంతు శరణాలయాన్ని స్థాపించాడు. వీరేశలింగం స్థాపించిన వితంతు శరణాలయాన్ని 1906 లోను, పూనాలోని కార్వే మహిళా విద్యాలయాన్ని, 1912 లోను సందర్శించి అనుభవాలను లక్ష్యానికి జోడించారు. 1913 లో జొన్నవిత్తుల గురునాథంతో కలసి విశాలాంధ్ర పటం తయారు చేశాడు. లక్ష్మీనారాయణ 1900లో గుంటూరులో ఉపాధ్యాయ వృత్తి, 1903లో అక్కడే న్యాయవాద వృత్తిని, 1908లో ర్యాలీ కంపెనీలో ఉద్యోగ బాధ్యతలు స్వీకరించాడు. రష్యాలో 1917లో జరిగిన బోల్షవిక్ విప్లవం వల్ల స్ఫూర్తి పొందిన మొదటి తెలుగు కవి ఉన్నవ. కూలీల పక్షం వహించి కవులు రచనలు చేయడానికి ప్రేరణ నిచ్చింది సదరు రష్యా విప్లవ ప్రభావమే. 1917 లో మద్రాసు హైకోర్టులో న్యాయవాదిగా పనిచేశాడు. 1922లో గుంటూరులో శారదానికేతన్?ను స్థాపించి బాలికలకు విద్య నేర్చుకునే అవకాశం కల్పించాడు. 1922 లో మాలపల్లి నవలను బెల్లంకొండ రాఘవరావు ముద్రించగా, మద్రాసు ప్రభుత్వం మాలపల్లి నవలపై నిషేధం విధించింది. రాజకీయ వాతావరణాన్ని, గాంధీ మహాత్ముని ఆశయాల్ని, తెలుగువారి జీవన విధానాన్ని ప్రతిబింబించిన నవల మాలపల్లి. ఆ నవలలో సాంఘిక దురాచారాలు, జాతీయ సత్యాగ్రహ ఉద్యమాలు, వర్ణ , వర్గ వ్యత్యాసాలు తదితర ఆ నాటి పరిస్థితులను కల గలిపి, కళ్ళకు కట్టినట్లు ఉన్నవ చిత్రించడం విశేషం. ఆనాడు హరిజనుల కుటుంబ గాథను ఇతివృత్తంగా ఎన్నుకొని నవల వ్రాయడమే సాహసం. 1926 లో మద్రాసు శాసన మండలిలో మాలపల్లి నిషేధంపై చర్చలు జరగడం, 1928 లో కొన్ని మార్పులతో మాలపల్లి ప్రచురణకు తిరిగి అనుమతి లభించడం, మద్రాసు ప్రభుత్వం ఆంధ్ర విశ్వ విద్యాలయం మాలపల్లిని ప్రచురించి, ఆ నవలను పాఠ్య గ్రంథంగా ఎంపిక చేయడం, 1936 లో మద్రాసు ప్రభుత్వం మాలపల్లి నవలపై రెండోసారి నిషేధం తెలిపి ఆ నవలను పాఠ్యగ్రంథంగా తొలగించడం, 1937లో చక్రవర్తుల రాజగోపాలా చారి మద్రాసు ప్రధానిగా ఎన్నికైనప్పుడు తొలి కాంగ్రెసు మంత్రి వర్గంచే మాలపల్లి నవలపై నిషేధపు ఉత్తర్వులను రద్దు చేయించడం క్రమానుగతంగా జరిగి పోయాయి. సామాన్య ప్రజల సంక్షేమం, అభ్యుదయాన్ని కోరే కవిత్వం ప్రజలకు సులభంగా అర్థమయ్యే వాడుక భాషలో ఉండాలన్న లక్ష్యంతో మాలపల్లి నవలలో చరమగీతం, సమతాధర్మం అనే రెండు గేయ కవితల్ని సామాన్య ప్రజలకు అర్థమయ్యే నిత్య వాడుక భాషలో జానపద గేయ రీతుల్లో రచించాడు. ఆ నవలకు కాశీనాథుని నాగేశ్వరరావు పీఠిక వ్రాస్తూ, "ఆంధ్ర సాహిత్య హృదయ పరిణామాన్ని గ్రహించడానికి మాలపల్లి ఉత్తమ కావ్యం అని, తెనుగు మాటలు, తెనుగు దేశము, తెనుగు హృదయము, తెనుగు సంకల్పము, మాలపల్లి నవలకు అనిర్వచనీయ ప్రతిభను సమకూర్చాయి" అని కొనియాడాడు. అందుకే తెలుగు సాహిత్యంలో వచ్చిన తొలి విప్లవ నవలగా గుర్తింపు పొందింది. మాలపల్లి, నాయకురాలు, బుడబుక్కల జోస్యం, స్వరాజ్య సోది, భావ తరంగాలు తదితర రచనలు చేశాడు. ఇక 1923 లో కాంగ్రెసు స్వరాజ్య పార్టీలో చేరాడు. ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెసు కమిటీ కార్యదర్శిగా ఎన్నికై, పల్నాడు సత్యాగ్రహ ఉద్యమానికి నాయకత్వం వహించాడు. 1931లో ఉప్పు సత్యాగ్రహ ఉద్యమంలో చేరినందుకు, 1942 లో క్విట్ ఇండియా ఉద్యమంలో చేరినందుకు జైలు శిక్ష అనుభవించాడు. గాంధేయ వాదిగా, సంఘ సంస్కర్తగా, స్వాతంత్ర్య యోధునిగా తెలుగు నవలా సాహిత్య వైతాళికుడుగా కీర్తి పొందిన ఉన్నవ 1958 సెప్టెంబరు 25 న మరణించాడు.

# శత వసంతాల మాలపల్లి నవల

గాంధేయ వాదిగా, న్యాయ వాదిగా, సంఘ సంస్కర్తగా, స్వాతంత్ర్య యోధుడుగా, ఉద్యమ నాయకునిగా, స్త్రీ విద్య ప్రోత్సాహికునిగా, కాంగ్రెస్ నేతగా, దళిత జనోద్ధారకునిగా, ప్రధానంగా తెలుగు నవలా సాహిత్య వైతాళికుడుగా ఉన్నవ లక్ష్మీ నారాయణ తెలుగు వారికి సుపరిచితుడే. ముఖ్యంగా నాటి సాంఘిక దురాచారాలను ప్రతిబింబించే, మాలపల్లి నవల నాడు ఒక సంచలనమే. సాంఘిక, ఆర్థిక అసమానతలను తొలగించి, కుల వ్యవస్థను నిరసించి, అందరూ సమానులే అన్న భావనతో, అగ్రవర్ణాలు, హరిజనులు అందరూ కలసి మెలసి ఉండాలని కోరుకుంటూ, "మాలపల్లి" అనే విప్లవాత్మకమైన నవలను రవించడం, తన దృక్పథానికి మద్దతుగా, "సహ పంక్తి భోజనాలు" నిర్వహించడం ఆ రోజులలో సాహసమే. మాలపల్లి తెలుగు సాహితీ చరిత్రలోనూ, సామాజిక దృక్పథంలోనూ ఒక నూతన ఒరవడిని సృష్టికి, చర్చోప చర్చలకు కారణభూతమైంది. ఒక దళిత కుటుంబం సమా జంలో కలిసి మెలసి ఉండడానికి చేసే ప్రయత్నం, సదరు ప్రయత్నంలో ఎదురైన చేదు అనుభవాలు, ఆ అనుభవాలతో రాటుదేలిన వ్యక్తులు చైతన్యమై సంఘటి తమై సమాజంలో నిర్లక్ష్యం చేయబడ్డ తమ ఉనికి కోసం, మెరుగైన స్థానం కోసం చేసే పోరాటాలు వంటి అంశాలతో మాలపల్లి నవలలోని పాత్రలు ఉదాత్తంగా చిత్రీకరించ బడ్డాయి. సామాజిక మార్పు కోసం బలహీన దళిత, పీడిత వర్గాలు చైతన్యంతో సుసంఘ టితం కావాలని, పోరాటా లకు సిద్ధపడాలని మాలపల్లి ప్రబోధించింది. 1922లో పల్నాడు పుల్లరి సత్యాగ్రహంలో పాల్గొని అరెస్టయి రాయ వెల్లురు జైలుకు ఉన్నవ లక్ష్మీనారాయణ తరలించ బడిన సమయం లోనే అక్కడే తన లక్ష్య సాధనకై విప్లవాత్మకమైన తెలుగు నవలా సాహిత్యంలో చిరస్మరణీయమైన 'మాలపల్లి' నవలను ఆయన రచించారు. మాలపల్లి నవల దళిత కుటుంబాన్ని ప్రధాన కథాశంగా రచించిన తొలి రాజకీయ నవల. 1922 లో మాలపల్లి నవలను బెల్లంకొండ రాఘవరావు ముద్రించగా, మద్రాసు ప్రభుత్వం మాలపల్లి నవలపై నిషేధం విధించింది. రాజకీయ వాతావర ణాన్ని, గాంధీ మహాత్ముని ఆశయాల్ని, తెలుగువారి జీవన విధానాన్ని ప్రతిబింబించిన నవల మాల పల్లి. ఆ నవలలో సాంఘిక దురాచారాలు, జాతీయ సత్యాగ్రహ ఉద్యమాలు, వర్ణ , వర్గ వ్యత్యాసాలు తదితర ఆ నాటి పరిస్థితులను కల గలిపి, కళ్ళకు కట్టినట్లు ఉన్నవ చిత్రించడం విశేషం. ఆనాడు హరిజనుల కుటుంబ గాథను ఇతివృత్తంగా ఎన్నుకొని నవల వ్రాయడమే సాహసం. 1926 లో మద్రాసు శాసన మండలిలో మాలపల్లి నిషేధంపై చర్చలు జరగడం, 1928 లో కొన్ని మార్పులతో మాలపల్లి ప్రచురణకు తిరిగి అనుమతి లభించడం, మద్రాసు ప్రభుత్వం ఆంధ్ర విశ్వ విద్యాలయం మాలపల్లిని ప్రచురించి, ఆ నవలను పాఠ్య గ్రంథంగా ఎంపిక చేయడం, 1936 లో మద్రాసు ప్రభుత్వం మాలపల్లి నవలపై రెండోసారి నిషేధం తెలిపి ఆ నవలను పాఠ్య గ్రంథంగా తొలగించడం, 1937లో చక్రవర్తుల రాజగోపాలాచారి మద్రాసు ప్రధానిగా ఎన్నికైనప్పుడు తొలి కాంగ్రెసు మంత్రి వర్గంచే మాలపల్లి నవలపై నిషేధపు ఉత్తర్వులను రద్దు చేయించడం క్రమానుగతంగా జరిగి పోయాయి. సామాన్య ప్రజల సంక్షేమం, అభ్యుదయాన్ని కోరే కవిత్వం ప్రజలకు సులభంగా అర్థమయ్యే వాడుక భాషలో ఉండాలన్న లక్ష్యంతో మాలపల్లి నవలలో చరమ గీతం, సమతా ధర్మం అనే రెండు గేయ కవితల్ని సామాన్య ప్రజలకు అర్థమయ్యే నిత్య వాడుక భాషలో జానపద గేయ రీతుల్లో రచించాడు. ఆ నవలకు కాశీనాథుని నాగేశ్వర రావు పీఠిక వ్రాస్తూ, "ఆంధ్ర సాహిత్య హృదయ పరిణామా న్ని గ్రహించడానికి మాలపల్లి ఉత్తమ కావ్యం అని, తెనుగు మాటలు, తెనుగు దేశము, తెనుగు హృదయము, తెనుగు సంకల్పము, మాలపల్లి నవలకు అనిర్వచనీయ ప్రతిభను సమ కూర్చాయి" అని కొనియాడాడు. అందుకే తెలుగు సాహిత్యంలో వచ్చిన తొలి విప్లవ నవలగా గుర్తింపు పొందింది. ఆయన సాహిత్యం ద్వారా హరి జనోద్ధరణకు కృషి చేశాడు. గుంటూరులో శ్రీ శారద నికేతన్ ను స్థాపించి, స్త్రీ విద్యను ప్రోత్సహించాడు. కందుకూరి వీరేశలింగం పంతులు అధ్యక్షతలో తొలి వితంతు వివాహం జరిపించిన సంస్కర్తగా నిలిచాడు. రష్యాలో 1917లో జరిగిన బోల్షవిక్ విప్లవం వల్ల స్ఫూర్తి పొందిన మొదటి తెలుగు కవి ఉన్నవ. కూలీల పక్షం వహించి కవులు రచనలు చేయడానికి ప్రేరణ నిచ్చింది సదరు రష్యా విప్లవ ప్రభావమే. ఉన్నవ... మాల పల్లి, నాయకురాలు, బుడ బుక్కల జోస్యం, స్వరాజ్య సోది, భావ తరంగాలు తదితర రచనలు చేశాడు. గాంధేయ వాదిగా, సంఘ సంస్కర్తగా, స్వాతంత్ర్య యోధు నిగా తెలుగు నవలా సాహిత్య వైతాళికుడుగా కీర్తి పొందిన ఉన్నవ లక్ష్మీనారాయణ గుంటూరు జిల్లా అప్పటి సత్తెనపల్లి తాలూకా వేములూ రు పాడు గ్రామంలో 1877 డిసెంబరు 4న జన్మించి, 1958 సెప్టెంబరు 25 న మరణించాడు.

# గాలిలో దీపంగా మైనార్టీల భద్రత

మతపరమైన హింసకు బంగ్లాదేశ్ ఆలవాలంగా మారుతోంది. షేక్ హసీనా గత ఆగస్టులో ప్రధాని పదవిని వదిలి, ఇండియాలో తలదాచుకున్నప్పటినుంచీ బంగ్లాదేశ్ లోని మతఛాందసవాదులు హిందువులను లక్ష్యంగా చేసుకుని దాడులకు పాల్పడటం పరిపాటిగా మారింది. ఒక అంచనా ప్రకారం గత ఐదు నెలల్లో హిందువులపై 200కి పైగా దాడులు జరిగాయి. తొమ్మిదిమంది చనిపోగా, వందల సంఖ్యలో హిందువులు గాయపడ్డారు. భారీయెత్తున హిందువుల ఆస్తులు విధ్వంసానికి గురయ్యాయి. బంగ్లాదేశ్ లో శాంతిభద్రతల పరిస్థితి అదుపు తప్పిందనడానికి ఇంతకంటే నిదర్శనం ఇంకేం కావాలి? నోబెల్ శాంతి బహుమతి విజేత మహమ్మద్ యూనుస్ ఆధ్వర్యంలో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడినా, ఈ దాడులు పెరిగాయే తప్ప తగ్గిన దాఖలాలు కనిపించడం లేదు. తాజాగా ఇస్కాన్ మాజీ అధికార ప్రతినిధి, బంగ్లాదేశ్ సనాతన్ జాగరణ్ మంచ్ నేత అయిన చందన్ కుమార్ దాస్ అలియాస్ చిన్మయ్ కృష్ణదాస్ బ్రహ్మచారి అరెస్టుతో ఉద్రిక్తతలు మరింత పెచ్చరిల్లాయి. పదిహేడు కోట్ల బంగ్లా జనాభాలో హిందువుల సంఖ్య కోటిన్నరకు మించదు. ఇతర మైనారిటీ వర్గాల సంఖ్య మరింత అల్పం. హిందువులలో అధికశాతం ఓటర్లు షేక్ హసీనా నాయకత్వంలోని అవామీ లీగ్ పార్టీకి మద్దతు ఇస్తారనే దుగ్ధతో, అత్తమీద కోపం దుత్తమీద చూపినట్లు హసీనా ప్రభుత్వంపై పెల్లుబుకిన ప్రజాగ్రహం, ఇప్పుడు హిందువులపైకి మళ్ళింది. వారిపై మతఛాందసవాదులు దాడులకు పాల్పడుతూ, ఆస్తులను విధ్వంసం చేస్తూ వికృతానందం పొందుతున్నారు. చిట్టగాంగ్ లో ఇటీవల జరిగిన ఓ భారీ బహిరంగ సభలో జాతీయ పతాకానికంటే ఎత్తులో కాషాయ జెండాను ఆవిష్కరించి, తమ దేశ పతాకాన్ని అగౌరవపరిచారంటూ వచ్చిన ఓ ఫిర్యాదును ఆధారంగా చేసుకుని అక్కడి పోలీసులు కృష్ణదాస్ ను అరెస్టు చేసి, జైలుకు పంపారు. అంతటితో ఆగకుండా కృష్ణదాస్ తోపాటు మరో 18మంది బ్యాంకు ఖాతాలను స్తంభింపజేశారు. చిట్టగాంగ్ లోని పుండరీక ధామ్ అధ్యక్ష బాధ్యతలు నిర్వర్తిస్తున్న కృష్ణదాస్ హిందువుల రక్షణకోసం పోరాటం సాగించడంలో ముందు వరసలో ఉంటున్నారు. హిందువుల పరిరక్షణకోసం ఆయన ఎనిమిది డిమాండ్లు చేసి, వాటి సాధనకోసం ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతున్నారు. హిందువులపై జరుగుతున్న దాడులపై విచారణకు ప్రత్యేక ట్రిబ్యునల్ ఏర్పాటు చేయడం, బాధితులకు పరిహారం చెల్లించడం, ధ్వంసమైన ఆస్తులకు పరిహారం చెల్లించడం వంటివి ఆయన డిమాండ్లలో ప్రధానమైనవి. ఇటీవల జరిగిన అల్లర్ల నేపథ్యంలో యూనుస్ మైనారిటీ వర్గాల ప్రతినిధులతో చర్చలు జరిపినా, జాగరణ మంచ్ డిమాండ్లపై మాత్రం పెదవి విప్పలేదు. మైనారిటీలపై దాడులు జరిగితే తాను పదవినుంచి వైదొలగుతానని మొదట్లో ప్రకటించిన యూనుస్ ఇప్పుడు స్వరం మార్చారు. తమ దేశంలో జరుగుతున్నవి మతపరమైన దాడులు కావంటూ దౌర్జన్యకారులకు వత్తాసు పలకడంతో విస్తుపోవడం ప్రజాస్వామికవాదుల వంతయింది. మరోవైపు కృష్ణదాస్ చేస్తున్న పోరాటం మత ఛాందసవాదులకు కంటగింపుగా మారింది. ఆయన అరెస్టుతో శాంతించని దౌర్జన్యకారులు హిందూ దేవాలయాలపై మూకుమ్మడి దాడులు జరిపి విధ్వంసం సృష్టిస్తున్నారు. కృష్ణదాస్ అరెస్టు అనంతరం, తమ దేశంలో ఇస్కాన్ కార్యకలాపాలను నిషేధించాలంటూ దాఖలైన ఓ పిటిషన్ ను ఢాకా హైకోర్టు కొట్టివేయడం బంగ్లాదేశ్ లో ప్రజాస్వామ్య వ్యవస్థ కొన ఊపిరితోనైనా బతికి ఉందనడానికి నిదర్శనంగా చెప్పుకోవచ్చు. బంగ్లాదేశ్ కు చెందిన ఓ జాతీయ పత్రిక నిర్వహించిన తాజా సర్వేలో దేశంలోని 49 జిల్లాల్లో హిందువులపై దాడులు జరిగినట్లు వెల్లడి కావడం అక్కడ ప్రజాస్వామ్య పతనావస్థను కళ్లకు కడుతోంది. అంతేకాదు, ఆ దేశంలో మతపరమైన హింస క్రమేపీ పెరుగుతోందని రెండేళ్ల క్రితమే ఆమ్నెస్టీ ఇంటర్నెషనల్ ఆందోళన వ్యక్తం చేసింది. అయినా కనువిప్పు కలగని యూనుస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం తాజాగా జరుగుతున్న దాడులపట్ల కూడా ఉదాసీన వైఖరి కనబరచడమే ఆశ్చర్యకరం. ఈ నేపథ్యంలో బంగ్లాను కట్టడి చేసేందుకు భారత్ రంగంలోకి దిగవలసిన ఆవశ్యకత కనబడుతోంది. మైనారిటీల భద్రతకు చర్యలు తీసుకోవాలంటూ భారత్ పదేపదే చేస్తున్న విజ్ఞప్తులను బంగ్లాదేశ్ పెడచెవిన పెట్టడమే కాదు, పరిస్థితిని భారత్ తప్పుదోవ పట్టిస్తోందంటూ నిరసించడం యూనుస్ ప్రభుత్వం తెంపరితనానికి నిదర్శనం. విజ్ఞప్తులు, విన్నపాలతో యూనుస్ ప్రభుత్వం దారికి వస్తుందన్న ఆశలు సన్నగిల్లుతున్న నేపథ్యంలో భారత్ ఆంక్షల కొరడా విధించక తప్పని పరిస్థితి కనిపిస్తోంది

# పీఏల దగ్గరే... అంతా కేసుల ఉచ్చు

శ్రీకాకుళం, డిసెంబర్ 3, రాజకీయ నాయకులకు వ్యక్తిగత కార్యదర్శులు ఎంతో కీలకం. నేతల డెయిలీ రొటీన్, ఇతరాత్ర వ్యవహారాలన్నీ ఆ పీఏలే చూస్తుంటారు. అందుకే నాయకుల రాజకీయ జీవితంలో పీఏలు భాగమవుతుంటారు. సాధారణంగా ఆ పీఏలకు తెలియకుండా నేతల జీవితాల్లో ఏదీ జరగదు. అందుకే ఆ పీఏలను టార్గెట్ చేస్తూ గత ప్రభుత్వంలో ఆరోపణలు ఎదుర్కొన్న వైసీపీ నేతల గుట్టు బయటపెట్టడానికి కూటమి ప్రభుత్వం స్కెచ్ గీస్తున్నట్లు కనిపిస్తుంది.తాజాగా మాజీ డిప్యూటీ సిఎం ధర్మాన కృష్ణదాస్ వద్ద గతంలో ప్రభుత్వ పీఏగా చేసిన గొండు మురళి ఆస్తులపై ఏసీబీ రైడ్స్ నిర్వహించింది. ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నాయన్న ఆరోపణల నేపథ్యంలో శాఖ, శ్రీకాకుళం జిల్లాలో మొత్తం ఆరు చోట్ల సోదాలు నిర్వహించారు ఏసీబీ అధికారులు. కృష్ణ దాసు ఎమ్మెల్యేగా, డిప్యూటీ సీఎంగా ఉన్న సమయంలో సుదీర్ఘకాలం ఆయన వద్ద మురళీ పీఏగా పని చేశారు. కృష్ణ దాస్‌కి సన్నిహితుడిగా మెలిగారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చే ముందు తన మాతృశాఖ అయిన వైద్య ఆరోగ్యశాఖలోకి వెళ్లిపోయారు.ప్రస్తుతం శ్రీకాకుళం జిల్లాలోని బుడితి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఓ సాధారణ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్న మురళీ ఆస్తుల వివరాలు చూస్తే కళ్లు తిరిగాల్సిందే. గొండు మురళికి చెందిన 20 ఎకరాలకు పైగా భూమి, విశాఖ, శ్రీకాకుళం సహా పలు ప్రాంతాల్లో పలు ప్లాట్లు, ఫ్లాట్లకు సంబంధించిన డాక్యుమెంట్లు, కిలో బంగారు ఆభరణాలు, 11.36 కిలోల వెండి వస్తువులు తదితరాలను ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వాటి మార్కెట్ విలువ రూ.70 కోట్లకు పైగా ఉంటుందని అంచనా. ఈ నేపథ్యంలో ఆయనను అరెస్టు చేశారు. ఆ ఆస్తులు మురళీ అక్రమార్జనా? లేకపోతే ఆయన ఎవరికైనా బినామీనా అన్న దానిపై విచారణ జరుగుతుందంట.ఇప్పటికే మదనపల్లె సబ్ కలెక్టర్ ఆఫీసు భూ రికార్డుల దహనం కేసులో నిందితుల కోసం పోలీసులు వేట కొనసాగిస్తున్నారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అనుచరుల కోసం గాలింపు చర్యలు చేపడుతున్నారు. ఆయన పీఏలు శశికాంత్, తుకారం ఇళ్లలో సోదాలు చేసి కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. పీఏ శశికాంత్ ఇంట్లో భారీగా దస్త్రాలు గుర్తించిన పోలీసులు.. నాలుగు బాక్సుల్లో కీలక దస్త్రాల స్వాధీనం చేసుకున్నారు. అరెస్ట్ భయంతో పెద్దిరెడ్డి అధికారిక పీఏ తుకారాం ఇప్పటికే విదేశాలకు పారర్ అయినట్లు తెలుస్తోంది.మరో వైసీపీ నేత, కడప ఎంపీ అవినాష్‌రెడ్డి పీఏ కోసం పోలీసులు గాలిస్తున్నారు. సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులకు సంబంధించిన కేసులో అవినాశ్‌రెడ్డి పీఏ బండి రాఘవరెడ్డి పరారీలో ఉన్నాడు. అతను దాఖలు చేసుకున్న ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కోర్టు కొట్టివేసింది. అతను అప్పటి ప్రతిపక్ష నేతలు చంద్రబాబు, లోకేశ్, పవన్ కల్యాణ్, అనిత, మంద కృష్ణమాదిగ, షర్మిల తదితరులపై వైసీపీ సోషల్ మీడియా ఆధ్వర్యంలో అసభ్యకర పోస్టులు పెట్టారు. వాటిపై అందిన ఫిర్యాదుల మేరకు వైసీపీ సోషల్ మీడియా జిల్లా కో-కన్వీనర్ వర్రా రవీంద్రరెడ్డి, సజ్జల భార్గవ్‌రెడ్డి మరికొందరిపై పులివెందులలో ఎస్సీ, ఎస్టీ కేసు నమోదైంది. అదే కేసులో బండి రాఘవరెడ్డి నిందితుడిగా ఉన్నాడు.ఆ క్రమంలో నేతల పీఏల వ్యవహారం పొలిటికల్ సర్కిల్స్‌లో హాటా టాపిక్‌గా మారింది. నేతల గురించి అన్ని విషయాలు తెలిసిన పీఏలను వ్యూహాత్మకంగానే టార్గెట్ చేస్తున్నారని.. వారిని టార్గెట్ చేసి పెద్ద చేపలకు గాలం వేయడానికి స్కెచ్ గీస్తున్నారన్న అభిప్రాయం వ్యక్తం అవుతుంది.

# 3 సార్లు బయోమెట్రిక్ పక్కా

విజయవాడ, డిసెంబర్ 3, చివాలయ ఉద్యోగుల అటెండెన్స్ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సచివాలయ ఉద్యోగులంతా రోజుకు మూడు సార్లు బయోమెట్రిక్ వేయాల్సిందేనని స్పష్టం చేసింది. ఉదయం, సాయంత్రం తప్పనిసరిగా బయోమెట్రిక్ వేయాలని ఉత్తర్వుల్లో పేర్కొంది.సచివాలయ ఉద్యోగుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కొత్త విధానాన్ని ప్రవేశపెట్టింది. సచివాలయ ఉద్యోగులంతా రోజుకు మూడు సార్లు బయోమెట్రిక్ వేయాల్సిందేనని స్పష్టం చేసింది. ఉదయం సచివాలయానికి వచ్చినప్పుడు, మళ్లీ సాయంత్రం సచివాలయం నుంచి వెళ్లినప్పుడు తప్పనిసరిగా బయోమెట్రిక్ వేయాలి. కనీసం రెండు సార్లు వేయకపోతే ఆ రోజు వేతనం కట్ అవుతుంది. ఈ విధానాన్ని సచివాలయ ఉద్యోగులు వ్యతిరేకిస్తున్నారు.గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు బయోమెట్రిక్ హాజరు ఆధారంగా జీతాలు చెల్లించాలని నిర్ణయించారు. ఈ మేరకు ఏపీ రాష్ట్ర సచివాలయ శాఖ ఉన్నతాధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఒక రోజు ఉదయం నిర్ణీత సమయంలోనూ, సాయంత్రం ఉద్యోగ పనులు ముగించుకుని వెళ్లే సమయంలో బయోమెట్రిక్ వేయాల్సి ఉంటుంది. ఒకవేళ ఉదయం వేసి, సాయంత్రం బయో మెట్రిక్ వేయడం మరిచిపోతే ఆ రోజు మొత్తం వేతనం కట్ చేస్తారు. మధ్యాహ్నం కూడా బయోమెట్రిక్ వేయాలని సచివాలయశాఖ ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ రకమైన విధానంతో ఉద్యోగుల్లో ఆందోళన నెలకొంది.ఎందుకంటే సాయంత్రం ఇంటికి వెళ్లిన సమయంలో బయోమెట్రిక్ పని చేయకపోతే ఉద్యోగులు బయోమెట్రిక్ వేయలేరు. అలాగే మధ్యాహ్నం సర్వేయర్, టెక్నికల్ అసిస్టెంట్ ఇతర ఉద్యోగులు ఫీల్డ్‌కు వెళ్లి రాత్రి అవుతుందని అటునుంచి అటే ఇంటికి వెళ్లలేరు. తప్పనిసరిగా సచివాలయానికి వచ్చి బయోమెట్రిక్ వేసే ఇంటికి వెళ్లాలి. కొంత మంది మరిచిపోవచ్చు. ఇలా చాలా సమస్యలు ఉన్నాయని ఉద్యోగులు చెబుతున్నారు. ఇలాంటి విధానం రాష్ట్రంలోని ఇతర ఉద్యోగులకు ఎందుకు లేదు? కేవలం సచివాలయ ఉద్యోగులపైనే ఎందుకు ఈ కక్ష అంటున్నారు.రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగుల అందరినీ ప్రభుత్వం సమాన దృష్టితో చూడాలని పేర్కొంటున్నారు. గ్రామ సచివాలయ ఉద్యోగులకు మాత్రమే ఇలా బయోమెట్రిక్ హాజరు విధానాన్ని రద్దు చేయాలని కోరుతున్నారు. మిగతా ప్రభుత్వ ఉద్యోగుల వలె ఎఫ్ఆర్ఎస్ యాప్ ద్వారా హాజరు నమోదు చేసే అవకాశం కల్పించాలని గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగులు కోరుతున్నారు.మరోవైపు సచివాలయ ఉద్యోగుల హాజరు సైకిల్ కూడా నెలలో 1 నుంచి ఆఖరు వరకు మార్చారు. ఈ విధానం నవంబర్ 1 నుంచి అమలులో తీసుకొచ్చారు. 2021 ఫిబ్రవరి 4 విడుదల చేసిన జీవోఎంఎస్ నెంబర్ 1 ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. గతంలో నెలలో 23 తేదీ నుంచి నుంచి వచ్చే 22 వ తేదీ వరకు ఉండేది. రాష్ట్రంలో 15,004 గ్రామ, వార్డు సచివాలయాల్లో 1,30,694 మంది ఉద్యోగులు ఉన్నారు.

# విద్యుత్ బిల్లుల భారం

విజయవాడ, డిసెంబర్ 3, ఆంధ్రప్రదేశ్ విద్యుత్ వినియోగదారులపై కొత్త సర్దుబాటు భారం మొదలైంది. ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి అమోదంతో రాష్ట్ర వ్యాప్తంగా రూ.6వేల కోట్ల సర్దుబాటు ఛార్జీల వసూలు మొదలైంది. వచ్చే నెలలో మరో సర్దుబాటు భారం మొదలు కానుంది. పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఎం పిలుపునిచ్చింది.ఆంధ్రప్రదేశ్‌లో డిసెంబర్ నెల విద్యుత్ బిల్లులతో కొత్త సర్దుబాటు భారం మొదలైంది. ఏపీ ఈఆర్సీ ఆమోదంతో రూ. 6072 కోట్ల వసూళ్లను విద్యుత్ పంపిణీ సంస్థలు ప్రారంభించాయి. కొత్త సర్‌ఛార్జీలతో విద్యుత్ బిల్లులు గణనీయంగా పెరిగాయి. ప్రస్తుతం ఏపీలో మూడు రకాల సర్దుబాటు చార్జీలు వసూలు చేస్తున్నారు. వచ్చే నెల నుండి మరో సర్దుపోటు పడనుంది. మొత్తం 15,484 కోట్ల రూపాయల విద్యుత్ భారం రాష్ట్ర ప్రజలపై పడనుంది.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు నెలల తిరగకముందే 15,484 కోట్ల రూపాయల విద్యుత్ భారాన్ని ప్రజలపై పడనుంది. 2022 -23 సంవత్సరాల్లో వినియోగించుకున్న విద్యుత్ పై 6072 కోట్ల రూపాయల సర్దుబాటు చార్జీల వసూలు మొదలైంది. నెల నుండి 2023 -24 సర్దుబాటు చార్జీ 9412 కోట్ల రూపాయల భారం పడనుంది.2014-19 ట్రూ అప్ చార్జీలుగా గత నెల బిల్లులపై 40 పైసలు సర్దుబాటు చార్జీ వసూలు చేస్తున్నారు. తాజాగా మూడవ సర్దుబాటు చార్జీ బిల్లులో వేశారు, వచ్చేనెల 4వ సర్దుబాటు చార్జీ కలపటానికి రంగం సిద్ధం అయ్యింది. సర్దుబాటు ఛార్జీలతో ఈ నెల బిల్లులలో 10 శాతం నుండి 30 శాతం వరకు బిల్లులు పెరిగాయి. విద్యుత్ బిల్లుల్లో సర్దుబాటు ఛార్జీల భారంపై పోరాటాలకు సీపీఎం సిద్ధం అవుతోంది. అజిత్ సింగ్ నగర్‌లోని లింగం వెంకటలక్ష్మి కి మొత్తం రూ.958 బిల్లు రాగా, అందులో రూ.282 30%)2022-23 సర్దుబాటు చార్జీగా పేర్కొన్నారు. బిల్లులో వినియోగించిన విద్యుత్ ఛార్జీలు 30 శాతం ఉంటే సర్దుబాటు చార్జీలు, అదనపు చార్జీలు 70 శాతం ఉంటున్నాయి.

ఈ సర్దుబాటు చార్జీల పాపం పాలక పార్టీలన్నింటిదని, కేంద్రంలోని బీజేపీ, గతంలో పాలించిన వైసిపి, నేడు పాలిస్తున్న తెలుగుదేశం, జనసేన పార్టీలు వీటికి బాధ్యత వహించాలని సీపీఎం డిమాండ్ చేసింది. అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచమని, తగ్గిస్తామని మాట ఇచ్చిన కూటమి మాట తప్పి ప్రజలను వంచించిందని ఆ పార్టీ నేతలు ఆరోపించారు.గత ప్రభుత్వం చేసిన తప్పులను సరి చేయాల్సిన బాధ్యత కూటమిపై ఉండగా ,భారం మోపి చేతులు దులుపుకోవడం సరికాదని, సోలార్ విద్యుత్ ఉత్పత్తి ధరలు యూనిట్ 12 రూపాయల నుండి క్రమంగా రెండు రుపాయలకు తగ్గాయని చెబుతూనే, ఛార్జీలు మాత్రం తగ్గించకుండా పెంచడం అన్యాయమంటున్నారు. అదానీ వద్ద నుండి వందలాది కోట్ల రూపాయలు ముడుపులు తీసుకుని, ప్రజలపై భారాల మోపే ఒప్పందాలను బిజెపి, వైసిపి పార్టీలు చేశాయని, ఆ ఒప్పందాలను రద్దు చేయకుండా తెలుగుదేశం, జనసేన వారితో కుమ్మక్కు అవుతున్నాయని సీపీఎం నాయకుడు చిగురుపాటి బాబురావు ఆరోపించారు.విద్యుత్ ఛార్జీల భారంలో బీజేపీ, వైసీపీ, తెలుగుదేశం, జనసేనలు ఉన్నాయని బడా కార్పొరేట్లకు దోచిపెట్టే విధానాలు వలనే విద్యుత్ చార్జీలు పెరుగుతున్నాయని ఆరోపించారు. పెరిగిన విద్యుత్ చార్జీలపై ప్రజలు గళం విప్పాలి. కేంద్ర, రాష్ట్ర పాలకులను నిలదీయాలని పిలుపునిచ్చారు. గతంలో రాష్ట్రాన్ని పాలించిన వైసీపీ పాపాన్ని గమనించాలని, మరో విద్యుత్ పోరాటానికి ప్రజలు సిద్ధం కావాలన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం సర్దుబాటు చార్జీల భారాన్ని నిలిపివేయాలని, అదానీ, జగన్, కేంద్ర ప్రభుత్వ కుంభకోణంపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. అదానీతో చేసుకున్న ఒప్పందాలను రద్దు చేయాలి. మాట ఇచ్చినట్లు విద్యుత్ ఛార్జీలను తగ్గించాలి, స్మార్ట్ మీటర్లను ఆపాలని డిమాండ్ చేశారు.

## విమానశ్రయాల మాదిరిగా రైల్వేస్టేషన్లు

గుంటూరు, డిసెంబర్ 3, రైల్వే ప్రయాణికులకు ఎయిర్‌పోర్ట్ స్థాయి సౌకర్యాలు కల్పించేందుకు.. సౌత్ సెంట్రల్ రైల్వే చర్యలు చేపట్టింది. గుంటూరు రైల్వేస్టేషన్ సహా డివిజన్ పరిధిలోని పలు స్టేషన్లలో మెరుగైన సదుపాయాల కల్పనపై రైల్వే అధికారులు ఫోకస్ పెట్టారు. రూ.100 కోట్లతో నిర్మాణాలు చేపట్టనున్నారు.గుంటూరు రైల్వేస్టేషన్, డివిజన్ పరిధిలోని పలు స్టేషన్లలో ప్రయాణికులకు మెరుగైన సదుపాయాల కల్పనపై రైల్వే అధికారులు దృష్టి సారించారు. ఇందుకోసం తయారు చేసిన డీపీఆర్‌లకు ఆమోదం లభించింది. దీంతో రూ. 100 కోట్లతో ఫుట్ బ్రిడ్జ్‌లు నిర్మించనున్నారు. ఇప్పటివరకు రైల్వే స్టేషన్లలో మూడు, ఆరు మీటర్ల వెడల్పుతో ఫుట్ బ్రిడ్జ్‌లు నిర్మిస్తున్నారు. కానీ.. భవిష్యత్తులో పెరగనున్న ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని 12 మీటర్ల వెడల్పుతో వీటిని ఏర్పాటు చేయనున్నారు.విమానాశ్రయాల్లో అందించే సదుపాయాలను అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు ప్రయత్నిస్తున్నారు. ఇందుకోసం ఈ ఫుట్ బ్రిడ్జ్‌లను ఉపయోగించనున్నారు. వీటిని చాలా వెడల్పుగా నిర్మిస్తున్నందునా.. మాల్స్‌ను కూడా ఏర్పాటు చేయాలని ప్రణాళిక రూపొందించారు. ప్రయాణికులు ఒకసారి స్టేషన్లోకి వచ్చాక.. ఏ అవసరం వచ్చినా బయటకు వెళ్లక్కర్లేకుండానే అందుబాటులోకి తెస్తున్నారు.గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో గుంటూరు, రేపల్లె, నరసరావుపేట, పిడుగురాళ్ల, మార్కాపురం, దొనకొండ, నంద్యాల, నల్గొండ, మిర్యాలగూడ స్టేషన్లలో వీటిని ఏర్పాటు చేస్తున్నారవీటి నిర్మాణాల కోసం స్థలాల ఎంపిక పూర్తయింది. త్వరలోనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభించనున్నట్టు రైల్వే అధికారులు చెబుతున్నారు.

# రేషన్ బియ్యం అక్రమ రవాణాపై ఉక్కు పాదం

కాకినాడ, డిసెంబర్ 3,పేదలకు ప్రభుత్వాలు అందించే పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా చేస్తే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని ఏపీ ప్రభుత్వం హెచ్చరించింది. ఏపీలో పోర్టుల నుంచి రేషన్ బియ్యం అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలని కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కాకినాడ యాంకరేజ్ పోర్టులో బియ్యం ఎగుమతి చేస్తున్న విదేశీ నౌక పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఏపీ పౌర సరఫరా శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. మంత్రి నాదెండ్ల అధ్యక్షతన మంత్రులు అచ్చెన్నాయుడు, సత్య కుమార్ యాదవ్ మరియు ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం జరిగింది. కాకినాడ పోర్టులోని అయిదు వేర్ హౌసుల్లో సార్టెక్స్ మిషన్లు ఉన్న అంశంపై చర్చించారు. వేర్ హౌసుల్లో యంత్రాలు ఏ విధంగా ఏర్పాటు చేశారని మారిటైమ్ బోర్డు, కాకినాడ పోర్టు అధికారులను రాష్ట్ర మంత్రులు ప్రశ్నించారు. సార్టెక్స్ యంత్రాలను ఏర్పాటుపై విచారణ చేపట్టాలని, అందుకు బాధ్యులైనవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఆంధ్రప్రదేశ్ నుంచి రేషన్ బియ్యం అక్రమ రవాణా, కాకినాడ పోర్టు నుంచి తరలిపోతున్న బియ్యం, ఇతరత్రా అక్రమ రవాణా వ్యవహారంపై మంత్రులు సమీక్షలో కీలకంగా చర్చించారు. నాదెండ్ల, అచ్చెన్నాయుడు, సత్యకుమార్ జరిపిన సమీక్షలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఇకనుంచి ఎవరైనా పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా చేస్తున్న వారిపై పీడీ యాక్ట్ నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని నిర్ణయం. కాకినాడ పోర్టులో భద్రత వ్యవస్థ బలోపేతం చేయాలని నిర్ణయించారు. కాకినాడ పోర్టు భద్రత కోసం ఛీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ నియమించాలని చర్చించారు. రేషన్ బియ్యం అక్రమ రవాణాను వ్యవస్థీకృత నేరంగా పరిగణించాలని మంత్రులు భావిస్తున్నారు. కాకినాడ పోర్టు, పరిసర ప్రాంతాల్లో ఇప్పటివరకూ జరిగిన రవాణా కార్యకలాపాలపై చర్యలు తీసుకోవాలని ఏపీ ప్రభుత్వం భావిస్తోంది. కాకినాడ పోర్టుకు వెళ్లే లారీల నుంచి అక్రమ వసూళ్లపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు నాదెండ్ల మనోహర్. కాకినాడ యాంకరేజ్ పోర్టులో బియ్యం ఎగుమతి చేస్తున్న స్టెల్లా ఓడ ఘటనలో బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. మొదట కాకినాడ కలెక్టర్ , కొందరు ఉన్నతాధికారులతో వెళ్లి కాకినాడ పోర్టు నుంచి విదేశాలకు ఎగుమతి అవుతున్న రేషన్ బియ్యాన్ని సీజ్ చేయాలని ఆదేశించారు. కాకినాడ కలెక్టర్ సాహసం దేశ వ్యాప్తంగా వైరల్ అయింది. ఆ సమయంలో ఢిల్లీ పర్యటనలో ఉన్న ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఏపీకి వచ్చాక కాకినాడ పోర్టు విషయంపై ఫోకస్ చేశారు. పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, కొందరు ఉన్నతాధికారులతో కలిసి వెళ్లి పవన్ కళ్యాణ్ కాకినాడ యాంకరేజ్ పోర్టులో తనిఖీలు చేయడం తెలిసిందే. పవన్ కళ్యాణ్ ను అధికారులు అడ్డుకోవడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశ తూర్పు దేశంలో భద్రతకు ముప్పు పొంచి ఉందని, కాకినాడ పోర్టులో కేవలం 16, 17 మంది అధికారులే ఉన్నారని.. టన్నుల కొద్దీ రేషన్ బియ్యం విదేశాలకు రవాణా చేశారని ఆరోపించారు. సీజ్ ద షిప్ అంటూ పవన్ కళ్యాణ్ చేసిన కామెంట్స్ సోషల్ మీడియాలో దేశ వ్యాప్తంగా ట్రెండ్ అయింది. అయితే కేంద్రం పరిధిలో ఉన్న అంశాలపై రాష్ట్ర ప్రభుత్వానికి చర్యలు తీసుకునే అధికారం లేదని, కేంద్రానికి ఫిర్యాదు చేయాలని నిబంధనలు చెబుతున్నారు.

కింగ్ పిన్ ఎవరు

ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు భద్రత పెంచాల్సి ఉందా? కాకినాడకు వెళ్తానన్న పవన్ ను అడ్డుకున్నదెవరు? పవన్ పర్యటనతో వెలుగులోకి వచ్చిన ఆ కింగ్ పిన్ ఎవరు? అన్ని కోట్లు గోల్ మాల్ జరుగుతుంటే అధికారులు ఇన్ని రోజులు ఏం చేశారు? ఈ ప్రశ్నలే ప్రస్తుతం ఏపీలో వినిపిస్తున్నాయి.కాకినాడ పోర్ట్ ఆధారంగా కోట్ల విలువైన రేషన్ బియ్యం సరఫరాను ఇటీవల కాకినాడ కలెక్టర్ అడ్డుకున్నారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ లు సంయుక్తంగా ఇచ్చిన ఆదేశాలతో కలెక్టర్ మెరుపుదాడులు నిర్వహించారు. భారీ స్థాయిలో రేషన్ ను పట్టుకున్నారు. అయితే డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఢిల్లీ పర్యటన ముగించుకొని నేరుగా కాకినాడ పోర్టుకు వచ్చారు.ఇక్కడే నేరుగా పవన్ కళ్యాణ్ కు అడ్డంకులు సృష్టించారట. ఈ మాటలన్నది ఎవరో కాదు పవన్. తాను పోర్టుకు వస్తానంటే అడుగడుగున అడ్డంకులు తగిలాయని, అలాగే కాకినాడ పోర్టు వద్దకు వచ్చినా కూడా.. సీజ్ చేసిన షిప్ వద్దకు తనను తీసుకెళ్లేందుకు కూడా అదే వ్యవహారం సాగిందని పవన్ అన్నారు. అంటే రేషన్ బియ్యం అక్రమ రవాణా సాగిస్తూ.. కోట్లకు పడగలెత్తిన ఆ కింగ్ పిన్ హవా పోర్టులో ఏ మేరకు ఉందో అర్థం చేసుకోవచ్చు. ప్రభుత్వం పేదలకు ఉచితంగా అందించే రేషన్ బియ్యం ఆఫ్రికా వంటి దేశాల్లో ఏకంగా రూ. 70 లు పలుకుతుందట. ఇదే ఆసరాగా తీసుకున్న ముఠా పెద్ద ఎత్తున ఇక్కడ ఎన్నో ఏళ్లుగా రేషన్ సామ్రాజ్యాన్ని విస్తరించారని మంత్రి నాదెండ్ల మనోహర్ అంటున్నారు. కేవలం మూడేళ్లలో రూ. 45 వేల కోట్ల విలువైన రేషన్ బియ్యం అక్రమ రవాణా సాగినట్లు మనోహర్ తేల్చారు. సీఎం చంద్రబాబు సైతం ఈ ఘటనపై స్పందించి, ఆ కింగ్ పిన్ ఎవరైనా వదిలేది లేదంటూ ప్రకటించారు. ఈ నేపథ్యంలో పవన్ తన పర్యటనలో కొన్ని కీలక కామెంట్స్ చేశారు. రేషన్ బియ్యం స్మగ్లింగ్ చేస్తున్నారు. రేపు స్మగ్లర్లు ఇంతటితో ఆగుతారా.. డబ్బులను కక్కుర్తి పడి ఉగ్రవాదులను తీసుకువస్తారుగా అంటూ అధికారులను ప్రశ్నించారు. ఇప్పుడు అసలు సంగతి ఏమిటంటే.. ఆ కింగ్ పిన్ ఎవరనేది ప్రశ్న. ఏకంగా పవన్ అడ్డుకునే స్థాయిలో ఆ కింగ్ పిన్ తెర వెనుక ఉన్నాడంటే.. అతని సామ్రాజ్యం కాకినాడ పోర్టులో పెద్దగా విస్తరించిందని కూడా చర్చలు సాగుతున్నాయి. పవన్ పర్యటనతోనే కాకినాడ పోర్టు వార్తల్లో రావడం, కోట్లలో స్మగ్లింగ్ బయటపడడంతో పవన్ కు భద్రత పెంచాలని జనసేన పార్టీ నేతలు, కార్యకర్తలు కోరుతున్నారు.దేశ భద్రతకు సంబంధించిన అంశంగా కేంద్రం సైతం భావించి, అసలు పోర్టులో ఏం జరుగుతుందనే విషయాలను ఆరా తీసినట్లు సమాచారం. రేషన్ మాఫియా వెనుక ఎవరున్నారనే వేటలో పోలీసులు దృష్టి సారించినా, కింగ్ పిన్ ను కూకటివేళ్లతో కదిలించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఏదిఏమైనా కింగ్ పిన్ చరిత్ర త్వరలోనే గుట్టురట్టు కావాలని రాష్ట్ర ప్రజలు కోరుతున్నారు. అలాగే కాకినాడ పోర్టులో జరుగుతున్న అక్రమాలను వెలుగులోకి తెచ్చిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నాదెండ్ల మనోహర్ లకు ప్రజలు ప్రత్యేక అభినందనలు తెలుపుతున్నారు.

# మేకపాటి సోదరులు ఎక్కడ

నెల్లూరు, డిసెంబర్ 3, నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గం నుంచి మేకపాటి కుటుంబ సభ్యులు నాలుగు సార్లు ఎమ్మెల్యే గా గెలిచారు. ఉదయగిరి గడ్డ తమదే అన్నట్టు తమ కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే గా ఉండాలని మేకపాటి ఫ్యామిలీ భావించేది. మొన్నటి ఎన్నికల్లోఎంత మంది టికెట్ కోసం పోటీ పడినా మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్ రెడ్డి హైకామాండ్‌ను ఒప్పించి తమ్ముడు రాజగోపాల్ రెడ్డికి టికెట్ ఇప్పించి బరిలో నిలబెట్టారు. అదే కుటుంబం నుంచి నాలుగు సార్లు గెలిచిన మేకపాటి చంద్రశేఖర్ రెడ్డిని కుటుంబ వ్యవహారాలతో మేకపాటి రాజమోహన్ రెడ్డి పక్కన పెట్టారు.ఉదయగిరి నుంచి 2019 ఎన్నికల్లో మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి వైసీపీ తరఫున పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి వైసిపికి ఓటు వేయకుండా టిడిపికి ఓటు వేశారని ఆరోపణలతో రావడంతో వైసిపి అధిష్టానం ఆయన్ని బహిష్కరించింది అప్పటి నుంచి ఉదయగిరి నియోజకవర్గ కోఆర్డినేటర్ గా రాజమోహన్‌రెడ్డి మరో తమ్ముడు మేకపాటి రాజగోపాల్ రెడ్డి ని వైసీపీ అధిష్టానం నియమించింది. అప్పటినుంచి మేకపాటి రాజగోపాల్ రెడ్డి ఉదయగిరికి తానే కాబోయే ఎమ్మెల్యేని అన్న ఆలోచనలతో అధికారులను ఉరుకులు, పరుగులు పెట్టించారు. ఎక్కడ మీటింగ్లు, సమావేశాలు జరిగిన తాను నివాసం ఉంటున్న మర్రిపాడు మండలం బ్రాహ్మణపల్లి నుండి పోలీసులు ఎస్కార్ట్ తో రావాలని అప్పట్లోనే హుకుం జారీ చేశారు. ఉదయగిరి నియోజకవర్గానికి తాను కాబోయే ఎమ్మెల్యేనని తన మాట వినకపోతే రాబోయే రోజుల్లో తగిన లెక్కలు ఉంటాయని బెదిరింపులకు కూడా పాల్పడినట్లు చెపుతారు.2024 ముందు జరిగిన ఎన్నికల ప్రచారంలో ఉదయగిరి నియోజకవర్గం టికెట్ కోసం ఎంతోమంది వ్యాపారవేత్తలు పోటీపడినప్పటికీ వైసీపీ అధిష్టానం మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్ రెడ్డి మాటలకు కట్టుబడి తన రెండో తమ్ముడైన మేకపాటి రాజగోపాల్ రెడ్డికి ఉదయగిరి టికెట్ ను కట్టబెట్టింది. అప్పటినుంచి మేకపాటి రాజగోపాల్ రెడ్డి ఉదయగిరిలో మరింత జోరు పెంచారు. తానే ఉదయగిరి కి బాస్ అంటూ తామ గెలిస్తే ప్రతి ఒక్కరి అంతు చూస్తామంటూ ప్రత్యర్థి అయినా తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా ఉన్న కాకర్ల సురేష్ పై ఒక రేంజ్ లో విరుచుకుపడ్డారు. నారా లోకేష్ రెడ్‌బుక్కులో రాసుకుంటే తాను బ్లూ బుక్కులో రాసుకుంటున్నానని.. మళ్లీ అధికారంలోకి వచ్చాక ఒకొక్కరి అంతు తేలుస్తానని ప్రచారంలో వార్నింగులు ఇచ్చారు.ఉదయగిరి మండలంలోని కొండ కింద పల్లె గ్రామాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించినప్పుడు ప్రజలను మేకపాటి రాజగోపాల్ రెడ్డి బెదిరించారట. తమకు ఓటు వేయకుండా ఏ ఒక్కరూ టిడిపికి ఓటు వేసిన పల్లె గ్రామాలలో ఒక్కరు కూడా మిగలరని గట్టిగా వార్నింగ్ ఇచ్చారట. మళ్లీ గెలిచి తీరతామన్న ధీమాతో కొండాపురం మండలంలో తాహసిల్దారు ఓ సమావేశానికి హాజరు కాకపోవడంతో ఆయనను ఇష్టమొచ్చినట్లు వాయించారాయన. ఇలా మేకపాటి రాజగోపాల్ రెడ్డి ఓటర్లను, అధికారులను బెదిరించిన ఎఫెక్ట్ ఎన్నికల్లో స్పష్టంగా కనిపించింది. ఘోర పరాజయం పాలయ్యారుపోలింగ్ సమయంలో మేకపాటి ఓటర్లను డబ్బులతో మబ్బు పెట్టే ప్రయత్నం చేశారనే ఆరోపణలు ఉన్నాయి. అయినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. వైసిపి అభ్యర్థిగా పోటీచేసిన మేకపాటి రాజగోపాల్ రెడ్డి.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఉదయగిరిలో అడ్రస్ లేకుండా పోయారు. ఉదయగిరి నియోజకవర్గంలో ఉండే ప్రధాన నాయకులు కూడా ఇతర ప్రాంతాలకు వెళ్లి వ్యాపారాలు చేసుకుంటున్నారంట. ఆ క్రమంలో ఇక ఉదయగిరిలో మేకపాటి ఫ్యామిలీ సీన్ అయిపోయిందంటూ.. కొందరు నేతలు కూటమి పార్టీల్లో చేరిపోతున్నారు . ఉదయగిరి సెగ్మెంట్లో వైసీపీలో దూకుడు ప్రదర్శించిన సోషల్ మీడియా యాక్టివిస్టులపై కేసులు నమోదవుతున్నాయి. కేసులు ఎదుర్కొంటున్న కార్యకర్తలు తమను పట్టించుకునే వారే లేకుండా పోయారని కన్నీరు పెట్టుకుంటున్నారు. మొత్తానికి ఉదయగిరి వైసీపీ అనాథలా మారిందిప్పుడు.

## జనవరి నుంచి ఆ రెండు పథకాలు

ఏలూరు, డిసెంబర్3ఏపీ ప్రభుత్వం దూకుడు మీద ఉంది. సంక్షేమ పథకాల అమలుపై ఫుల్ ఫోకస్ పెట్టింది. తాజాగా రేషన్ కార్డుల దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభం కానుంది. అటు కొత్త పింఛన్ల విషయంలో ఎలా ముందుకెళ్లాలో ఆలోచన చేస్తోంది. ఈ నేపథ్యంలో ఈనెల నాలుగో తేదీన జరగాల్సిన మంత్రివర్గ సమావేశం.. ఒకరోజు ముందుగానే జరగనుంది. అయితే దీనికి ఎంతగానో ప్రాధాన్యత సంతరించుకుంది. క్యాబినెట్ భేటిలో కీలక అంశాలను చర్చించనున్నారు. వాటికి ఆమోద ముద్ర వేయనున్నారు. ఇటీవల కాకినాడ పోర్ట్ లో పెద్ద ఎత్తున రేషన్ బియ్యం పట్టుబడిన సంగతి తెలిసిందే. డిప్యూటీ సీఎం పవన్ ఆ బియ్యాన్ని పరిశీలించారు. వెనుక ఉన్న మాఫియాను పూర్తిగా నియంత్రించాలని భావిస్తున్నారు. దీంతో క్యాబినెట్లో బియ్యం అంశం చర్చకు వచ్చే అవకాశం ఉంది. రేషన్ బియ్యం పక్కదారిపై ప్రభుత్వం సీరియస్ చర్యలకు దిగే ఛాన్స్ కనిపిస్తోంది. దీనికిగాను ఒక ప్రత్యేక ప్రణాళిక రూపొందించే అవకాశం ఉంది .ఎట్టి పరిస్థితుల్లో జనవరి నాటికి కొత్త రేషన్ కార్డులు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది.రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా మూడు లక్షల మందికి రేషన్ కార్డులు అందించాలని భావిస్తోంది. అయితే పాత రేషన్ కార్డులను సైతం కొత్తగా డిజైన్ చేసి అందించాలని చూస్తోంది. జనవరి 2 నాటికి జన్మభూమి 2 కార్యక్రమం నిర్వహించాలని భావిస్తోంది. అందుకు సంబంధించి విధివిధానాలను సైతం రూపొందిస్తోంది. దీనిపైన మంత్రివర్గ సమావేశంలో చర్చించనుంది ప్రభుత్వం. జన్మభూమి కార్యక్రమంలో నే కొత్త రేషన్ కార్డులతో పాటు ఇతరత్రా సంక్షేమ పథకాలు ఇవ్వాలని భావిస్తోంది.ఇప్పటికే అన్నదాత సుఖీభవకు బడ్జెట్లో నిధులు కేటాయించింది ప్రభుత్వం. సంక్రాంతి నాటికి రైతుల ఖాతాలో 20వేల రూపాయలు వేయాలని భావిస్తోంది. దానిపైన క్యాబినెట్లో ఒక నిర్ణయం తీసుకునే అవకాశం కనిపిస్తోంది. మహిళలకు ఆర్టీసీ ఉచిత ప్రయాణం హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. దీనిపై ఇప్పటికే విధివిధానాలను రూపొందించారు. వివిధ రాష్ట్రాల్లో అమలవుతున్న ఈ పథకాన్ని పరిశీలించి కీలక ప్రతిపాదనలతో ఒక నివేదిక తయారు చేశారు. దానిపై క్యాబినెట్ సమావేశంలో చర్చించనున్నారు. ఒక నిర్ణయం తీసుకుంటారు. ప్రధానంగా కాకినాడ పోర్ట్ నుంచి బియ్యం తరలింపు, అదాని నుంచి ముడుపులు తీసుకోవడం వంటి అంశాలపై సైతం క్యాబినెట్లో చర్చించే అవకాశం ఉంది. అయితే ఈ నెల 4న జరగాల్సిన క్యాబినెట్ సమావేశం.. ఒకరోజు ముందుగానే నిర్వహిస్తుండడం విశేషం.

# కొడాలి నానిని చుట్టుముడుతున్న కేసులు



విజయవాడ, డిసెంబర్ 3 కొడాలి నాని. తెలుగు రాష్ట్రాల్లో పరిచయం అక్కర్లేని ఈ నేత కాంట్రవర్సీలకు కేరాఫ్. వైసీపీ హయాంలో చంద్రబాబు, లోకేశ్‌ను అడ్డగోలుగా బూతులు తిట్టారని..వాళ్ల కుటుంబ సభ్యుల మీద కూడా అడ్డగోలుగా మాట్లాడారని నాని మీద టీడీపీ క్యాడర్ ఆగ్రహంతో ఉంది. ఈ నేపథ్యంలో ఆ మధ్య విశాఖలో కొడాలి మీద ఓ యువతి కంప్లైంట్ చేశారు. ఆ తర్వాత కూడా అక్కడక్కడ కేసులు నమోదయ్యాయి. అదే ఊపులో కొడాలి నానిని కూడా అరెస్ట్ చేస్తారన్న ప్రచారం జరిగింది. ఈలోపే గుడివాడలో జగనన్న కాలనీ స్థలాల స్టోరీ వెలుగులోకి వచ్చింది.జగనన్న కాలనీల కోసం గుడివాడలో సేకరించిన భూములపై కేసు నమోదైనట్లు తెలుస్తోంది. పేదలకు ఇండ్ల స్థలాలు ఇచ్చేందుకు 173 ఎకరాలు సేకరించి..మెరక పేరుతో అనుచరులకు వర్క్ ఆర్డర్స్ ఇచ్చారని నాని మీద ఆరోపణలు ఉన్నాయి. అలా తనకు కావాల్సిన వాళ్లకు పనులు అప్పగించి 8కోట్ల రూపాయలతో పనులు చేపట్టి.. 40 కోట్ల దాకా స్వాహా చేసినట్లు ప్రాథమిక విచారణలో తేలిందట. త్వరలోనే విజిలెన్స్ రిపోర్ట్ ప్రభుత్వానికి అందబోతున్నట్లు తెలుస్తోంది. ఆ తర్వాత నాని మీద తప్పనిసరిగా యాక్షన్ ఉంటుందని అంటున్నారు టీడీపీ నేతలు. అదే సమయంలో గుడివాడలో కొడాలి నాని ప్రధాన అనుచరులపైనా ప్రభుత్వం ఫోకస్ పెట్టినట్లు టాక్ వినిపిస్తోంది. నానిని చూసుకుని రెచ్చిపోయిన వాళ్లను వదిలిపెట్టొద్దని టీడీపీ అధిష్టానం మీద ఒత్తిడి పెరుగుతోందటజగనన్న కాలనీల కోసం గుడివాడ నియోజకవర్గం మల్లాయపాలెంలో 178.3 ఎకరాలు సేకరించారు. ఎకరా రూ.52 లక్షలు పెట్టి కొన్నారట. అదంతా లోతట్టు ప్రాంతంగా ఉండటంతో సరి చేయాలన్న కారణంతో అప్పుడు ఎమ్మెల్యేగా ఉన్న కొడాలి నాని..అడ్డగోలుగా వర్క్ చేయించారట. దగ్గరలోని చెరువుల్లో మట్టిని తెంచి నింపేశారట. బిల్లులు మాత్రం ఎక్కడో దూరం నుంచి గ్రావెల్ తరలించినట్లు చూపి కోట్ల రూపాయలు కొల్లగొట్టారని ఆరోపణలు ఉన్నాయి. మెరక వర్క్ ఆర్డర్లు పొందిన వారంతా కొడాలి నాని అనుచరులేనని..ఆయన బినామీగా ఉన్న వారి ఖాతాల్లోకి సొమ్ము జమ అయిందని టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపైనే కూటమి సర్కార్ ఇంటర్నల్‌గా విజిలెన్స్ రిపోర్ట్ రెడీ చేయిస్తుందని..ఆ తర్వాత అసలు కథ ఉంటుందని అంటున్నారు.కొడాలి నానిని అన్ని దిక్కుల కార్నర్ చేస్తున్నట్లే కనిపిస్తోంది. ఓ కేసు కాకపోతే మరో కేసు..ఇలా అన్ని దిక్కుల ఇరికించి ఇబ్బంది పెడితేనే మరోసారి బూతు మాటలు మాట్లాడకుండా ఉంటారని టీడీపీ నేతలు..కూటమి ప్రభుత్వం మీద ప్రెజర్ తెస్తున్నారట. ఇప్పటికే నాని మీద యాక్షన్ తీసుకోవడం ఆలస్యమైందని టీడీపీ క్యాడర్ అసంతృప్తిలో ఉందని అంటున్నారు. ఇంటర్నల్ ఎంక్వైరీలతో పూర్తి ఆధారాలు వచ్చాక ఇరికించాలని కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తుంటే..టీడీపీ క్యాడర్, లీడర్లు మాత్రం నాని మీద ఆగ్రహంతో రగిలిపోతున్నారట. కొడాలి నానిని ఎప్పుడు అరెస్ట్ చేస్తారంటూ సందర్భం వచ్చినప్పుడల్లా అగ్రనేతలను క్వశ్చన్ చేస్తున్నట్లు టాక్ వినిపిస్తోంది.అయితే కొన్నిరోజులుగా కొడాలి నాని గుడివాడకు రావడం లేదట. ఆయన ప్రస్తుతం ఎక్కడ ఉంటున్నారో కొందరు ముఖ్య నేతలకే తెలుసు అంటున్నారు. తిరుమల లడ్డూ ఇష్యూ అప్పుడు వైసీపీ అధినేత జగన్‌తో భేటీ తర్వాత మీడియాతో మాట్లాడిన నాని.. అప్పుడు కూడా చంద్రబాబును టార్గెట్ చేస్తూ మాట్లాడారు. ఆ తర్వాత ఫైర్ బ్రాండ్ లీడర్ తగ్గరంటూ వైసీపీ చర్చకు తెరలేపింది. సేమ్ టైమ్ నాని మీద చర్యలు తీసుకోవాల్సిందేనని టీడీపీ క్యాడర్ పట్టుబడుతూ వస్తోంది. ఈ నేపథ్యంలో ముందుగా కొడాలి నానికి ముఖ్య అనుచరులుగా ఉన్న వారి మీద కేసులు పెట్టేందుకు రంగం సిద్ధం అవుతోందట. ఆ తర్వాత నానికి కేసులు విచారణలు తప్పవంటున్నారు కూటమి నేతలు.

# లుకలుకలపైనే ఆశలన్నీ

విజయవాడ, డిసెంబర్ 3, వైసీపీ అధినేత జగన్ కు భవిష్యత్ కనిపించడం లేదు. కూటమి పార్టీలు కలిసి ఉన్నంత కాలం జగన్ కు విజయావకాశాలు తక్కువగానే ఉంటాయన్నది విశ్లేషకుల అంచనా. బలమైన సామాజికవర్గాలు కలసి ఉండటంతో పాటు, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ మద్దతు కూటమి పార్టీలకు ఉన్నంత కాలం జగన్ ప్రతిపక్ష స్థానానికే పరిమితమవ్వాలన్న భావన ఏర్పడుతుంది. ఇద్దరు బలమైన రాష్ట్ర స్థాయి రాజకీయ నేతలైన చంద్రబాబు,పవన్ కల్యాణ్, మరో జాతీయ నేత అయిన మోదీ, అమిత్ షాలను తట్టుకుని ఎన్నికలలో విజయం సాధించడం జగన్ కు అంత సులువు కాదన్నది పార్టీ నేతల నుంచి వినిపిస్తున్న అభిప్రాయం. సునామీలా ప్రజలు తమ వైపునకు తిరిగితే తప్ప గెలుపు సాధ్యం కాదన్నఅభిప్రాయం నెలకొంది. 2019 ఎన్నికలు వేరు. అప్పటి వరకూ జగన్ పాలనను ఎవరూ చూడలేదు. అందుకే ఒక్క ఛాన్స్ అంటే జగన్ కు అవకాశమిచ్చారు. ఆ ఎన్నికల్లో ఇటు టీడీపీ, జనసేన, బీజేపీలు విడివిడిగా పోటీ చేశాయి. అందుకే జగన్ పార్టీకి అంతటి విజయం సాధ్యమయింది. కానీ 2014, 2024 ఎన్నికల ఫలితాలను పరిశీలిస్తే మాత్రం కూటమి పార్టీలను జనం ఆదరిస్తున్నారన్న విషయం స్పష్టమవుతుంది. అందుకే కూటమి పార్టీలు కలసి ఉన్నంత వరకూ జగన్ కు మళ్లీ ముఖ్యమంత్రి అయ్యే యోగం లేదన్న కామెంట్స్ ఫ్యాన్ పార్టీ నుంచే వినిపిస్తున్నాయి. జనంలో కూటమి ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత వస్తే తప్ప జగన్ కు సాధ్యం కాదన్నది సీనియర్ నేతలు కూడా అభిప్రాయపడుతున్నారు. జగన్ వచ్చినా, చంద్రబాబు సీఎం అయినా తమకు ఒరిగేదేమీలేదన్నఅభిప్రాయంలో ఉన్న జనానికి జగన్ ను ఓన్ చేసుకునేందుకు పెద్దగా ఎవరూ ముందుకు రాకపోవచ్చంటున్నారు ఆంధ్రప్రదేశ్ లో కాపు సామాజికవర్గం ఎక్కువ. వారంతా ఎక్కువ మంది జనసేన అధినేత పవన్ కల్యాణ్ తోనే నడుస్తున్నారు. పవన్ ఎప్పటికైనా ముఖ్యమంత్రి అవుతారన్న భావన వారిలో కనిపిస్తుంది. ఆ ఆశతోనే పవన్ వెన్నంటి ఉండాలని భావిస్తున్నారు. వారు ఎవరి వైపు మొగ్గు చూపితే వారిదే విజయం అవుతుంది. ప్రధానంగా తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో కాపు సామాజికవర్గం ఓటర్లు ఎక్కువ. అక్కడ ఎవరు అత్యధిక స్థానాలను సాధించగలిగితే వారిదే అధికారం అని ఎన్నికల గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఇక టీడీపీ వైపు బీసీలు కూడా మొగ్గు చూపుతుండటంతో పాటు మధ్యతరగతి, ఉద్యోగ వర్గాలు, యువత అండగా నిలుస్తుండటంతో పాటు, మోదీ చరిష్మా కలిసి కూటమి పార్టీల విజయానికి కారణమవుతుందన్న అంచనాలు వినపడుతున్నాయి. ఏపీ అభివృద్ధి చంద్రబాబు వల్లనే సాధ్యమవుతుందన్న నమ్మకం కూడా ఓట్లు పెరగడానికి ఒక కారణంగా చెబుతున్నారు. ంఅందుకే ఆ మూడు పార్టీలు కలసి ఉండగా జగన్ కు మరోసారి విజయం దక్కదన్నది అందరూ అంగీకరించే విషయం. మూడు పార్టీల్లో ఏ ఒక్కటి విడిపోయి బయటకు వచ్చినా అది జగన్ కు లాభమే.కానీ మూడు పార్టీలకూ ఒకరి అవసరాలు మరొకరికి ఉన్నాయి. ఎవరి ఆలోచనలు వారివి. అంతిమంగా జగన్ ఓడించే లక్ష్యంగా మూడు పార్టీలూ కలసి పనిచేస్తాయి. చంద్రబాబు కూడా పవన్ కల్యాణ్ ను వదులుకోరు. బీజేపీని దూరం చేసుకోరు. అందుకే ఆ మూడు పార్టీలు కలసి ఉన్నంత కాలం జగన్ కు అధికారం దరి చేరడం కష్టమేనన్న వ్యాఖ్యలు బలంగా వినిపిస్తున్నాయి. అందులోనూ ఒంటరిగా పోటీ చే?సేజగన్ కు ఎన్నికల సమయంలో అన్ని రకాల ఇబ్బందులు ఎదురుకాక తప్పవు. అందుకే కూటమి పార్టీల కలయికపైనే జగన్ భవిష్యత్ ఆధారపడి ఉందన్నది వాస్తవం. అందుకే జగన్ కానీ, ఆ పార్టీ నేతలు కానీ కోరుకోవాల్సింది. కూటమి పార్టీలు విడిపోవాలని కోరుకోవడం తప్ప మరేంచేయలేని పరిస్థితి.



# పాము కాటుతో బాలుడు మృతి

ఒంగోలు ప్రకాశం జిల్లా గిద్దలూరు మండలం బురుజు పల్లి గ్రామంలో సోమవారం రాత్రి సుమారు రెండు గంటల సమయంలో పాముకాటుకు గురయ్యాడు. ఇల్లు రేకుల షెడ్డు కావడంతో పై రేకుల్లో నుంచి మంచం పై నిద్రిస్తున్న బాలుడిపై పడి కాటు వేసిందని తల్లి తెలిపింది.బాలుడిని హుటాహుటిన గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. రాత్రి సుమారు మూడు గంటలకు ప్రభుత్వ వైద్యశాలలో బాలుడు మృతి చెందాడు.

# కాశీ, మధురతో సరిపుచ్చేస్తారా....

ప్రస్తుతంతో పోల్చుకుంటే గతం చాలా భయంకరంగా ఉందనేది నిజం. ఇప్పుడు రాజులు, రాజ్యాలు పోయాయి. ప్రపంచాన్ని కుదించేసి, ప్రజాస్వామ్యం పరుగులు పెడుతోంది. ప్రపంచాన్ని ఏలిన బ్రిటన్, అమెరికా లాంటి దేశాలను కూడా పాలించే స్థాయికి భారతీయులు ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో బాబ్రీ మసీదు ఉన్న స్థలంలో రామమందిరాన్ని నిర్మించిన తర్వాత.. కాశీ, మధురలోని మరో రెండు ఆలయాలను శాంతియుతంగా విముక్తి చేయాలని శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర కోశాధికారి గోవింద్ దేవ్ గిరి మహారాజ్‌తో పాటు చాలా మంది హిందూ వాదులు అన్నారు.ఆ సందర్భంగానే గోవింద్ దేవ్ గిరి మాట్లాడుతూ.. కాశీ, మధుర దేవాలయాలను శాంతియుతంగా విముక్తి చేసిన వెంటనే, విదేశీ ఆక్రమణదారులు ధ్వంసం చేసిన దేవాలయాలను హిందూ సమాజం మరచిపోతుందని స్పష్టం చేశారు. దాదాపు 3 వేల 500 దేవాలయాలు విదేశీ దాడుల్లో నేలమట్టం అయ్యాయనీ.. అయినప్పటికీ, ఈ మూడు దేవాలయాలు శాంతియుతంగా కలిసిపోయిన తర్వాత, ఏ ఇతర దేవాలయాల వైపు చూడమని హామీ ఇచ్చారు. "మనం గతంలో కాదు, భవిష్యత్తులో జీవించాలి" అని కూడా గోవింద్ దేవ్ గిరి వెల్లడించారు.ఈ ఏడాది ఫిబ్రవరిలో గోవింద్ దేవ్ గిరి మహారాజ్ మాట్లాడుతూ.. నా దేశం మారిపోయిందని అన్నారు. "గతం అంతా మరచిపోతాం" అని కూడా అన్నారు. కాశీ, మధురలోని దేవాలయాలను హిందువులకు అప్పగించాలని కూడా ఆయన ముస్లిం సమాజాన్ని కోరారు. వారణాసిలోని జ్ఞాన్‌వాపి మసీదుకు సంబంధించిన సర్వే నివేదికలో.. పురాతన హిందూ దేవాలయ అవశేషాలపై మసీదు నిర్మించారని భారత పురావస్తు శాఖ రిపోర్ట్ ఇచ్చిన కొన్ని రోజుల తర్వాత ఆయన ఈ ప్రకటన చేశారు. అయితే, ఇటీవల లోక్‌సభ ఎన్నికల నుండీ దీనికి విరుద్ధంగా బిజెపి నేతల వ్యాఖ్యలు చేస్తున్నారు.ఉత్తర్ ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యానాథ్ అయితే దాదాపు అన్ని వేదికలపై దేవాలయాల పున:స్థాపన నినాదాన్ని ఎత్తుకుంటున్నారు. ఇటీవలి మహారాష్ట్ర, జార్ఖండ్ ఎన్నికల సందర్భంలోనే ఇదే అంశాన్ని లేవనెత్తారు. ఈ క్రమంలోనే, ఉత్తర్ ప్రదేశ్‌లోని సంభల్‌లో షాహీ జామా మసీదు విషయంలో స్థానిక కోర్టు సర్వేకు అనుమతి ఇచ్చింది. అది అక్కడ మత వివాదానికి దారి తీసింది.ఈ తాజా వివాదం గురించి రాజ్యసభ ఎంపీ, సుప్రీం కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడైన కపిల్ సిబల్ కూడా ఘాటుగా స్పందించారు. ఈ దేశం ఎటు వెళ్తుంది అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ విభజనను సృష్టించడానికి తీవ్రంగా ప్రయత్నాలు జరుగుతున్నాయనీ.. దేశాన్ని ఎటు తీసుకెళ్తున్నామో అర్థమవుతుందా అంటూ ప్రశ్నించారు. ఇలాంటి విభజన రాజకీయాలు ఎందుకు చేస్తున్నారని మండిపడ్డారు.నిజానికి, ఇలాంటి ప్రశ్నలు సామాన్యుల నుండీ మేధావుల వరకూ చాలా మంది మెదడును తొలిచేస్తున్న ప్రశ్నలే. అందులోనూ, అజ్మీర్ దర్గాను భారతదేశ మొదటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ నుండీ ఇప్పటి ప్రధాని నరేంద్ర మోడీ వరకూ అందరూ గౌరవించే వారే. ఆ దర్గాకు దేశ ప్రధానమంత్రి హోదాలో మోడీ కూడా చాదర్‌ను పంపించారు. అలాంటి చారిత్రక ప్రాధాన్యత ఉన్న కట్టడం విషయంలో వివాదాన్ని సృష్టించడం, దాని నుండి రాజకీయ లబ్ధిని పొందడం అనేది ఆందోళన కలిగించే విషయం అన్నది చాలా మంది చెబుతున్న మాట.ఎవరి పేరుతో అయితే ఈ దర్గా ఉందో.. ఈ మొయినుద్దీన్ చిస్తీ 13వ శతాబ్దానికి చెందిన సూఫీ సన్యాసి, తత్వవేత్త. మొయినుద్దీన్ మరణించిన తర్వాత ఆయన్ను గొప్ప సాధువుగా అందరూ పరిగణించారు. ముయిన్ అల్-దీన్ దర్గాను 1236 మార్చిలో నిర్మించారు. ఇది తర్వాత శతాబ్దంలో అత్యంత గౌరవనీయమైన ప్రదేశంగా మారింది. అప్పటి నుండీ అన్ని సామాజిక వర్గాలు దీన్ని గౌరవిస్తూ వచ్చారు. ఈ సమాధిని ఈ యుగంలోని అత్యంత ముఖ్యమైన సున్నీ పాలకుల గౌరవంగా చూసుకున్నారు. మొఘల్ చక్రవర్తి అక్బర్ తన పాలనా కాలంలో పద్నాలుగు సార్లు ఈ దర్గాను సందర్శించినట్లు చరిత్ర చెబుతోంది. 1566లో తన హిందూ భార్య మరియం-ఉజ్-జమానీతో కలిసి, వారికి బిడ్డలు పుట్టాలనే ఆశతో.. చెప్పులు లేకుండా ఈ సమాధికి తీర్థయాత్ర చేసినట్లు తెలుస్తోంది. మధ్యయుగ కాలం నుండి ముస్లింలతో పాటు భారీగా హిందువులు కూడా ఈ స్థలాన్ని సందర్శించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. బరోడా మహారాజు 1800 సంవత్సరంలో దర్గాపై కవచాన్ని నిర్మించారు. ప్రస్తుతం, మొయినుద్దీన్ చిస్తీ సమాధి భారత ఉపఖండంలోని సున్నీ ముస్లింలకు అత్యంత పవిత్రమైన సందర్శనా స్థలాలలో ఒకటి. భారత ఉపఖండం నలుమూలల నుండి వందల, వేల మంది ప్రజలు ఇక్కడకు వస్తుంటారు. 2019లో, హిందుస్థాన్ జింక్ లిమిటెడ్ స్వచ్ఛ భారత్ అభియాన్ కింద దర్గా కాంప్లెక్స్‌ను పునరుద్ధరించాలని నిర్ణయించింది. 2015లో, మొయినుద్దీన్ చిస్తీ 808వ ఉర్స్‌లో ముస్లిం మతపెద్దలతో జరిగిన కార్యక్రమంలో.. అజ్మీర్ షరీఫ్ దర్గాలో సమర్పించిన 'చాదర్'ను ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అందించారు.ఎంతో చరిత్ర ఉన్న ఈ దర్గా పలు వివాదాలకు కూడా కేంద్రంగా ఉంది. 1992 అజ్మీర్ రేప్ కేసు నుండీ.. 2007లో టిఫిన్ క్యారియర్ బాంబు ఘటన వరకూ ఈ ప్రదేశం పాపులర్ అయ్యింది. రంజాన్ మాసంలో ఉపవాస ప్రార్థనల తర్వాత జనాలు గుమ్మిగూడిన ప్రదేశంలో బాంబు పేలింది. ఈ పేలుడులో ఏడుగురు చనిపోగా, 17 మందికి తీవ్రగాయాలయ్యాయి. ప్రత్యేక న్యాయమూర్తి దినేష్ గుప్తా.. 149 మంది సాక్షుల వాంగ్మూలాలు, 451 పత్రాల ఆధారంగా దాదాపు 500 పేజీల తీర్పును సమర్పించారు.జాతీయ దర్యాప్తు సంస్థ ప్రత్యేక న్యాయస్థానం దీనికి రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ మాజీ ప్రచారక్‌లు కారణమని తేల్చింది. నేరస్థులకు జీవిత ఖైదు విధించారు.

అలాగే, 5 జూలై 2022న, ముహమ్మద్‌కు వ్యతిరేకంగా చేసిన వ్యాఖ్యలకు సస్పెండ్ అయిన భారతీయ జనతా పార్టీ ప్రతినిధి నూపుర్ శర్మ తల నరికేయాలని చెప్పిన దర్గా సంరక్షుడు సల్మాన్ చిస్తీని కూడా పోలీసులు అరెస్టు చేశారు.నిజానికి, హిందువులు దేవుడిగా పూజించే రాముడు ఎప్పుడూ తాను పరమాత్మనని ప్రకటించుకోలేదు. సాధారణ మనిషిగానే జీవించాడు, చెప్పుకున్నాడు. రావణుడిపై యుద్ధం కూడా అలాగే పలువురి సహకారంతో చేశాడు. ముఖ్యంగా, రాముడికి పదవీకాంక్ష లేదు.

ఇంద్ర పదవిని కూడా నాకొద్దని తిరస్కరించిన వ్యక్తి. ఉత్తమ నాయకుడు ఎప్పుడూ ఏకపక్షంగా వ్యవహరించడనే సిద్ధాంతం చెప్పిన గొప్ప రాజు. ఏ దశలోనూ తాను ప్రతీకార రాజకీయాలను ప్రోత్సహించలేదు.యుద్ధం యోధులతోనే.. సామాన్య ప్రజలు మనకు శత్రువులు కాదని స్పష్టం చేశాడు. రాముడికి ఉన్న ఆ విచక్షణా గుణమే.. నాయకులలో ఉత్తమ నాయకుడిగా, యోధులలో మహాయోధుడిగా, పాలకులలో అత్యుత్తమ పాలకుడిగా నిలింది.

అదే రామ సార్వభౌముడికి పట్టాభిషేకం చేసింది. ఇప్పుడున్న రాజకీయ నాయకుల్లో కావలసింది సరిగ్గా ఇలాంటి నాయకత్వమే. అప్పుడే, ఇలాంటి విభజన రాజకీయాలకు ముగింపు వస్తుందనేది చాలా మంది అభిప్రాయం.

# నా అరెస్ట్ విషయంలో ఒక సెక్షన్ మీడియా అత్యుత్సాహం ప్రదర్శిస్తోంది, ముందస్తు బెయిల్ కోసం జ్యుడిషియల్ ప్రాసెస్ కొనసాగుతోంది - దర్శకుడు రామ్ గోపాల్ వర్మ



ఏడాది క్రితం తను చేసిన సోషల్ మీడియా పోస్టుపై ఏపీలోని అనేక చోట్ల కేసులు నమోదు కావడంపై దర్శకుడు రామ్ గోపాల్ వర్మ స్పందించారు. ఈ రోజు హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్స్ లో పాత్రికేయ సమావేశం ఏర్పాటు చేశారు. తన అరెస్ట్ విషయంలో ఒక సెక్షన్ మీడియా అత్యుత్సాహం ప్రదర్శిస్తోందని ఆయన అన్నారు. తనపై నమోదైన కేసులు ఉద్దేశపూర్వకంగా ఉన్నాయనే అనుమానంతోనే ముందస్తు బెయిల్ కోసం అప్లై చేసుకున్నానని రామ్ గోపాల్ వర్మ తెలిపారు. ఈ ప్రెస్ మీట్ లో

దర్శకుడు రామ్ గోపాల్ వర్మ మాట్లాడుతూ – మనది ఫ్రీ వరల్డ్. వ్యంగ్యం అనేది మీడియా సహా ప్రతి చోటా ఉంటుంది. ఇప్పుడున్న సోషల్ మీడియా ఓపెన్ చేస్తే వందలాది మీమ్స్ కనిపిస్తాయి. నేను ఏడాది క్రితం చేసిన పోస్ట్ కూడా అలాంటిదే. అయితే ఏడాది తర్వాత ఒక వ్యక్తి మేలుకుని నాపై పోలీస్ స్టేషన్ లో కంప్లైంట్ ఇచ్చాడు. ఆ తర్వాత ఈ ఒకే పోస్ట్ ను కారణంగా చూపుతూ ఏపీలోని అనేక చోట్ల కేసులు నమోదు అయ్యాయి. ఇది ఉద్దేశపూర్వకంగా చేస్తున్నదే అనే అనుమానంతో నేను ముందస్తు బెయిల్ కోసం అప్లై చేసుకున్నాను. ఇంతవరకు పోలీసులు నన్ను అరెస్ట్ చేస్తున్నట్లు కూడా ప్రకటించలేదు. ఇంతలో ఒక సెక్షన్ మీడియా సంస్థలు వర్మను ఎందుకు అరెస్ట్ చేయడం లేదని, వర్మ భయపడి పారిపోయాడని న్యూస్ టెలికాస్ట్ చేస్తూ వస్తున్నాయి. ఇదే మీడియా సంస్థలు అనేక ప్రోగ్రామ్స్ నాయకుల మీద, ఇతరుల మీద నెగిటివ్ గా చేస్తుంటాయి. మొదటి సారి పోలీసులు సంప్రదించినప్పుడు నేను అందుబాటులో లేను. రెండోసారి కూడా ఇంకాస్త సమయం కావాలని అడిగాను. కావాలంటే వర్చువల్ గా వీడియోలో మీతో మాట్లాడుతాను అని చెప్పాను. కోవిడ్ టైమ్ నుంచి వర్చువల్ చాలా కేసుల్లో విచారణలు జరుగుతున్నాయి. నేను అప్లై చేసుకున్న ముందుస్తు బెయిల్ విషయంలో జ్యుడిషియల్ ప్రాసెస్ జరుగుతోంది. నేను పొలిటికల్ మూవీస్ మానేస్తా అని చెప్పింది అక్కడ జరిగే సెన్సార్ ఇబ్బందులు వల్ల. ఏడాది పాటు ఆ సెన్సార్ కోసం వెయిట్ చేయడం చిరాకుగా ఉండి పొలిటికల్ బేస్డ్ మూవీస్ రూపొందించను అని చెప్పాను. నేను ఏదైనా పోస్ట్ చేస్తే నన్ను, నా ఫ్యామిలీని తిడుతూ వందల కామెంట్స్, మీమ్స్ వస్తాయి. పత్రికల్లో వచ్చే కార్టూన్స్ ఎవరో ఒక నాయకుడి మీద సెటైర్ వేసేవి. ఇది దశాబ్దాలుగా ప్రపంచవ్యాప్తంగా జరుగుతోంది. నేను చేసిన పోస్ట్ లో అర్థం మీకు ఒకలా, నాకు ఒకలా కనిపించవచ్చు. అది ఎవరి వ్యక్తిగత దృష్టి కోణాన్ని బట్టి ఉంటుంది. నేను చేసిన తప్పేంటో, ఏ సెక్షన్ లో అరెస్ట్ చేస్తున్నారో పోలీసులు చెప్పకముందే కొన్ని మీడియా సంస్థలు హడావుడి చేస్తున్నాయి. అన్నారు.

# ది గ్రేట్ జడ్జి...

పాట్నా, డిసెంబర్ 3, (న్యూస్ పల్స్) అది బీహార్ రాష్ట్రం.. బీహార్ అంటేనే దరిద్రానికి కేరాఫ్ అడ్రస్.. అక్కడ పేదరికం ఎక్కువగా ఉంటుంది.. ఉన్నత చదువులు చదివే సంఖ్య తక్కువగా ఉంటుంది. పురుషుల సంగతి ఇలా ఉంటే.. ఇక ఆడవాళ పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు.. ఉపాధి లభించక.. దారిద్రం తాండవిస్తుండగా.. పిల్లల్ని చదివించే స్తోమతలేక.. ఆర్థిక స్థిరత్వం అంతగా లేక చాలామంది తల్లిదండ్రులు తమ సంతానాన్ని పెద్దగా చదివించరు. ఒక స్థాయి వచ్చే వరకే వారితో చదువు మాన్పించి పనులకు పంపిస్తారు. పనులకు వెళ్లడం అలవాటు కావడంతో ఆ యువతకు చదువుకునే అవకాశం ఉండదు. ఇలాంటి వారి సంఖ్య బీహార్ లో చాలా ఎక్కువగా ఉంటుంది. అయితే ఇలాంటి కుటుంబాలలో అరుదుగా మాత్రమే ప్రభుత్వ ఉద్యోగాలు సాధిస్తుంటారు. అలాంటి వారిలో ఆదర్శ్ ముందు వరుసలో ఉంటారు. బీహార్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన పరీక్షలు ఆయన సివిల్ సర్వీస్ జ్యుడీషియల్ పరీక్షలో ఉత్తీర్ణుడయ్యాడు. ఏకంగా న్యాయమూర్తిగా ఉద్యోగం సాధించాడు.. ఇప్పుడు అతడి విజయగాథ బీహార్లో మార్మోగిపోతోంది.బీహార్ రాష్ట్రంలో శివగంజ్ అనే ఒక ప్రాంతం ఉంది.. ఇది కోడిగుడ్ల మార్కెట్ గా ప్రసిద్ధి చెందింది. ఈ మార్కెట్లో విజయ్ సావ్ అనే వ్యక్తి కోడిగుడ్ల వ్యాపారం చేస్తుంటాడు. అయితే అతనికి వచ్చే ఆదాయం అంతంత మాత్రమే. దాంతోనే కుటుంబాన్ని సాకుతుంటాడు. ఇలా విజయ్ సావ్ కుమారుడు ఆదర్శ్ తన తండ్రి పడుతున్న కష్టాన్ని దగ్గరుండి చూశాడు. ఇలాంటి ఆర్థిక కష్టాల నుంచి కుటుంబాన్ని గట్టెక్కించాలని భావించాడు. దీనికోసం చదువుకునే ఆయుధంగా మలచుకున్నాడు. తన కుటుంబానికి పేదరిక నేపథ్యం ఉన్నప్పటికీ చదువును మాత్రం వదిలిపెట్టలేదు. పుస్తకాలు కొనే స్తోమత లేకపోయినప్పటికీ.. ఖరీదైన కోచింగ్ సెంటర్లలో శిక్షణ తీసుకునే స్థాయి లేకపోయినప్పటికీ.. ఆదర్శ్ బలంగా ముందడుగు వేశాడు. తన వద్ద ఉన్న మామూలు స్మార్ట్ ఫోన్ తో రోజు యూట్యూబ్లో వీడియోలు చూసేవాడు. అలా నోట్స్ సొంతంగా ప్రిపేర్ చేసుకునేవాడు. ప్రతిరోజు 18 గంటలు చదివేవాడు. అలా బీహార్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన సివిల్ సర్వీస్ జ్యుడీషియల్ పరీక్షలు ఉత్తీర్ణుడయ్యాడు. ఏకంగా న్యాయమూర్తి ఉద్యోగాన్ని సాధించాడు. పేద కుటుంబంలో పుట్టి.. కష్టాలను ఎదుర్కొంటూ చదువుకొని.. ఏకంగా న్యాయమూర్తి దాకా తన ప్రయాణాన్ని కొనసాగించాడు ఆదర్శ్. ఆదర్శ్ సాధించిన విజయం బీహార్ రాష్ట్రంలో సంచలనంగా మారింది. ప్రధాన మీడియా మొత్తం ఆదర్శ్ పోటీ పరీక్షలకు సిద్ధమైన విధానాన్ని కథలు కథలుగా ప్రసారం చేస్తోంది. ఇది ప్రస్తుతం సామాజిక మాధ్యమాలలో సందడి చేస్తోంది. " నేను పేద కుటుంబంలో పుట్టాను. మా నాన్న పడుతున్న కష్టాన్ని దగ్గరుండి చూశాను. ఆ కష్టాన్ని దూరం చేయాలని కంకణం కట్టుకున్నాను. దానికి చదువు అనే ఆయుధాన్ని పట్టుకున్నాను. అంతిమంగా విజయం సాధించానని" ఆదర్శ్ చెబుతున్నాడు.

# ఢిల్లీలో విచిత్రమైన వాతావరణం

న్యూఢిల్లీ, డిసెంబర్ 3, (న్యూస్ పల్స్) డిసెంబరు నెల ప్రారంభమైనప్పటికీ ఢిల్లీలో చలి మాత్రం కనిపించడం లేదు. ఢిల్లీలో మధ్యాహ్నం చాలా వేడిగా ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో ఈసారి చలి తీవ్రత తక్కువగానే ఉంటుందని ప్రజలు చెబుతున్నారు. డిసెంబరు మొదలైంది కానీ ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో చలి వణికిపోయే సూచనలు కనిపించడం లేదు. సాధారణంగా, డిసెంబర్ ప్రారంభంతో రాజధాని ఢిల్లీలో తీవ్రమైన చలి మొదలవుతుంది. అయితే ఈ సంవత్సరం డిసెంబర్ మొదటి వారంలో గత దశాబ్దంలో అత్యంత వేడిగా ఉంటుంది. చలి తీవ్రత కోసం ఢిల్లీ ప్రజలు ఎదురు చూస్తున్నారు. ఇక్కడ ఉదయం, సాయంత్రం మాత్రమే కాస్త చలికాలంలా అనిపిస్తుంది. అర్థరాత్రి కాస్త చల్లగాలి వీస్తోంది. అయితే మధ్యాహ్న సమయంలో ఎండలు ఎక్కువగా ఉండడంతో వేడిగా ఉంటుంది. ఇప్పుడు ఢిల్లీలో చలి తీవ్రత ఎప్పుడు మొదలవుతుందని అక్కడి ప్రజలు ఆలోచిస్తున్నారుడిసెంబరులో ఢిల్లీలో గరిష్ట ఉష్ణోగ్రత 24 నుండి 26 డిగ్రీల సెల్సియస్ లేదా అంతకంటే తక్కువగా నమోదవుతుంది. కానీ ఈసారి డిసెంబర్ మొదటి వారంలో ఉష్ణోగ్రత 26-27 డిగ్రీల వరకు ఉండవచ్చు. వాతావరణ శాఖ ప్రకారం, 2011 తర్వాత నుంచి డిసెంబర్ మొదటి వారంలో ఢిల్లీలో ఇటువంటి వాతావరణ నమూనాలు కనిపించలేదు. ఢిల్లీలో చలి తీవ్రతతో డిసెంబర్ ప్రారంభం అవుతుంది. రుతుపవనాల కారణంగా ఢిల్లీ-ఎన్‌సిఆర్‌లో వాతావరణం పొడిగా ఉంది. అక్టోబర్, నవంబర్‌లో ఒక్కసారి కూడా వర్షాలు పడలేదు. ఈ కాలంలో వర్షాలు కురిసే అవకాశాలు తక్కువగా ఉన్నప్పటికీ, చలిని పెంచడంలో వర్షం ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. ఈ వర్షం పూర్తిగా వెస్ట్రన్ డిస్ట్రబెన్స్‌పై ఆధారపడి ఉంటుంది. ఎందుకంటే ప్రస్తుతం వెస్ట్రన్ డిస్టర్బెన్స్ బలహీనంగా ఉంది, దీని కారణంగా ఢిల్లీతో సహా ఉత్తర భారతదేశంలో తీవ్రమైన చలి లేదు. బలహీనమైన పాశ్చాత్య డిస్ట్రబెన్స్ కారణంగా, ఈసారి శీతాకాలం ఢిల్లీ-ఎన్ సీఆర్, ఉత్తర భారతదేశంలోని ఇతర రాష్ట్రాల్లో కొంచెం ఆలస్యంగా ప్రారంభమయ్యే అవకాశం ఉంది.వాతావరణ శాఖ నివేదిక ప్రకారం డిసెంబర్ 5 తర్వాత ఢిల్లీలో ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గే అవకాశం ఉంది. ఈ సమయంలో రాజధానిలో కనిష్ట ఉష్ణోగ్రత 10 డిగ్రీల వరకు, గరిష్ట ఉష్ణోగ్రత 25 డిగ్రీల సెల్సియస్ వరకు వెళ్లవచ్చు. నగరంలో తెల్లవారుజామున తేలికపాటి పొగమంచు కనిపించవచ్చు. ఆ తర్వాత డిసెంబర్ 6, 7 తేదీల్లో ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉంది. డిసెంబర్ 12 లేదా 15 తర్వాత కూడా ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో చలికాలం మొదలవుతుందని చెబుతున్నారు. డిసెంబర్ 8-9 తేదీల్లో వెస్ట్రన్ డిస్ట్రబెన్స్ యాక్టివ్‌గా ఉంటుందని, దీని ప్రభావం ఉత్తర భారతదేశ వాతావరణంపై కనిపించవచ్చని చెప్పబడింది.ఢిల్లీ మినహా ఉత్తర భారతదేశంలోని పలు రాష్ట్రాల్లో చలి తీవ్రత పెరుగుతోంది. పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లలో ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పడుతున్నాయి. ఈ రాష్ట్రాల్లో ఉదయం, సాయంత్రం చలి గణనీయంగా పెరిగింది. వచ్చే వారంలో చలి మరింత పెరగనుందని, ఉష్ణోగ్రత కూడా గణనీయంగా తగ్గుతుందని వాతావరణ శాఖ తెలిపింది

# నిరుద్యోగులకు స్కిల్ డెవలప్ మెంట్ కోర్సు

## 5 వేల నిరుద్యోగ భృతి

న్యూఢిల్లీ, డిసెంబర్ 3, (న్యూస్ పల్స్) దేశంలో జాబ్ లేని నిరుద్యోగుల్లో నైపుణ్యం పెంచేందుకు కేంద్రం కొత్త ప్రథకం తీసుకువచ్చింది. పీఎం ఇంటర్న్‌షిప్ పేరుతో ఈ పథకాన్ని ప్రారంభించింది. 20224?25 బడ్జెట్‌లో ఇందుకు నిధులు కూడా కేటాయించింది. ఈ పథకంలో భాగండా డిగ్రీ చేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఎంపికైన విద్యార్థులకు నెలకు రూ.5 వేలు, వన్‌టైం గ్రాంట్ కింద రూ.6 వేలు కేంద్రం అందిస్తుంది.ఇంటర్న్‌షిప్ కూడా ప్రముఖ కంపెనీల్లో పొందే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. ఇందు కోసం 280 కంపెనీలను ఎంపిక చేసింది. ఈ కంపెనీల్లో 1, 27,046 మంది యువత ఇంటర్న్‌షిప్ పొందే అవకాశం అందుబాటులోకి తెచ్చింది. విద్యాభ్యాసం అర్హత ఆధారంగా ఎందులో ఇంటర్న్‌షిప్ ఇవ్వాలనేది నిర్ణయిస్తారు.పీఎం ఇంటర్న్‌షిప్ పథకం ద్వారా అభ్యర్థులు రిజిస్ట్రేషన్ చేసుకునే ప్రక్రియ గత అక్టోబర్ 12న ప్రారంభమైంది. అక్టోబర్ 25 వరకు నమోదుకు అవకాశం కల్పించారు. అక్టోబర్ 27వ తేదీ నుంచి నవంబర్ 7వ తేదీ వరకు అభ్యర్థులను ఎంపిక చేశారు. ఎంపిక అయిన అభ్యర్థులకు సమాచారం అందించారు. వారు ఏ కంపెనీలో ఇంటర్న్‌ఫిప్ పొందుతారు అనే వివారలు మెస్సేజ్ రూపంలో పంపించారు. ఇంటర్న్‌షిప్‌లో బ్యాంకింగ్ అండ్ ఫినాన్షియల్ స్వీసెస్, సిమెంట్ అండ్ బిల్డింగ్ మెటీరియల్స్, కెమికల్ ఇండస్ట్రీ, టాటా, రిలయన్స్, ఏషియన్ పెయింట్స్, ఇన్ఫోసిస్, హెచ్‌డీఎఫ్‌సీ, టెక్స్‌టైల్, టెలికాం, మహీంద్ర, హీరో వంటి కంపెనీలు ఇంటర్న్‌షిప్‌లో భాగస్వామి అయ్యాయి. ఇందు కోసం కేంద్రం రూ.800 కోట్లు కేటాయించింది.పీఎం ఇంటర్న్‌షిప్ పథకాన్ని ప్రధాని నరేంద్రమోదీ లాంఛనంగా ప్రారంభించారు. నవంబర్ 30 వరకు అభ్యర్థులు ఆయా కంపెనీల్లో జాయిన్ అయిన నేపథ్యంలో పథకం ప్రారంభించి ఎంపికైన అభ్యర్థుల ఖాతాల్లో వన్‌టైన్ సెటిల్‌మెంట్ కింద రూ.6 వేలు జమ చేస్తారు. తర్వాత నెల నుంచి రూ.5 వేల చొప్పున అభ్యర్థుల ఖాతాల్లో డబ్బులు జమవుతాయి.

## మన హైదరాబాద్ సేఫేనా...

హైదరాబాద్, డిసెంబర్ 3, హైదరాబాద్‌లో కాలుష్యం రోజురోజుకూ పెరుగుతోంది. ఇది పర్యావరణ సమస్యగా మారుతుంది. భాగ్యనగరం ప్రస్తుతం అత్యధిక ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్‌లో ప్రపంచవ్యాప్తంగా 531వ స్థానంలో ఉంది. తెలంగాణలోని మిగిలిన ప్రాంతాల కంటే కాలుష్యం 1.18 రెట్లు ఎక్కువగా ఉంది.హైదరాబాద్ నగరంలో వాయు కాలుష్యం పెరుగుతోంది. తాజాగా.. తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి డేటా విడుదల చేసింది. దీని ప్రకారం వివిధ ప్రాంతాల్లో మోడరేట్, పూర్ ఎయిర్ క్వాలిటీ ఉంది. నవంబర్ మెలలో గాలి నాణ్యత గణనీయమైన హెచ్చుతగ్గులు నమోదైనట్టు కాలుష్య నియంత్రణ మండలి వెల్లడించింది.నగరంలోని సనత్‌నగర్ ప్రాంతంలో గాలి నాణ్యత బాగా క్షీణించిందని తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి స్పష్టం చేసింది. నవంబర్ 30న పూర్ ఎయిర్ క్వాలిటీ నమోదైంది. మరోవైపు జూ పార్క్ ప్రాంతంలో నవంబర్ 28, 29, 30 తేదీల్లో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్‌లో వరుసగా 167, 167, 163 నమోదైంది. ఈ గణాంకాలు మోడరేట్ కేటగిరీ కిందకు వస్తాయని అధికారులు చెబుతున్నారు.

అటు బొల్లారం పారిశ్రామిక జోన్, ఇక్రిసాట్ పటాన్‌చెరు, న్యూ మలక్‌పేట్, సోమాజిగూడ, సెంట్రల్ యూనివర్శిటీ, రామచంద్రపురం, నాచారం, ఈసీఐఎల్, కాప్రా, కోకాపేట్, కొంపల్లి మున్సిపాలిటీ, ఐఐటిహెచ్ సహా అనేక ఇతర ప్రదేశాల్లో మోడరేట్ గణాంకాలే నమోదయ్యాయి. గత సంవత్సరంతో పోల్చితే.. ఈ ప్రాంతాల్లో గాలి నాణ్యత క్షీణించిందని తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి స్పష్టం చేసింది.

ఎయిర్ క్వాలిటీ ఇలా..

0-50: బాగుంది

50-100: మితమైన కాలుష్యం

100-200: పూర్ ఎయిర్

200-300: అనారోగ్యకరమైనది

300-400: తీవ్రమైన కాలుష్యం

400-500+: ప్రమాదకరమైన కాలుష్యం

అందరి బాధ్యత..

భవిష్యత్తు తరాల మనుగడకు ఇబ్బంది లేకుండా పర్యావరణాన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలని.. మంత్రి కొండా సురేఖ పిలుపునిచ్చారు, జాతీయ కాలుష్య నియంత్రణ రోజు సందర్భంగా.. పర్యావరణ పరిరక్షణ బాధ్యతను గుర్తు చేశారు. ఈ ఏడాది 'స్వచ్ఛమైన గాలి, పచ్చని భూమి-సుస్థిరమైన జీవనం వైపు అడుగు' అనే నేపథ్యంతో కాలుష్య నియంత్రణపై అవగాహన కల్పిచేందుకు చర్యలు చేపడుతున్నట్టు ప్రకటించారు. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆంధ్వర్యంలో కాలుష్య నియంత్రణ రోజును నిర్వహిస్తున్నట్లు మంత్రి వివరించారు. ప్రతి ఒక్కరు మొక్కలను నాటుతూ, పర్యావరణ పరిరక్షణకు సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

# నెంబర్ వన్, నెంబర్ 2లకు ఏమైంది

# కల్వకుంట్ల ఫ్యామిలీలో ఏం జరుగుతోంది

హైదరాబాద్, డిసెంబర్ 3,వలసలతో ఖాళీ అవుతున్న బీఆర్ఎస్‌లో ముఖ్యనేతలు కూడా కనిపించకుండా పోవడం విచిత్రంగా తయారైంది. పొలిటికల్‌గా బ్యాడ్ టైమ్ అంటే ఎలా ఉంటుందో బీఆర్ఎస్ ప్రత్యక్షంగా చవిచూస్తుందిప్పుడు. పదేళు రాజ్యాధికాం చెలాయించి అధికారం శాశ్వతం అన్నట్లు వ్యవహరించిన గులాబీనేతలను అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు బిక్కచచ్చిపోయేలా చేశాయి. ఇకఆ తర్వాత జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీ ఖాతా తెరవడం కాదుకదా.. సగం స్థానాల్లో డిపాజిట్లు కూడా దక్కించుకోలేక అంపశయ్యపైకి ఎక్కింది. ఆ ప్రభావంతో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఫాంహౌస్‌కే పరిమితమై.. జనానికి కనిపించడమే మానేశారు.ఒక్కసారి అసెంబ్లీలో కనిపించి మాయమైన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కారు స్టీరింగ్ వదిలేశారు. కొద్ది రోజులుగా పార్టీ కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొంటున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సడన్‌గా కొంతకాలం పాలిటిక్స్ నుంచి బ్రేక్ తీసుకుంటున్నట్లు ప్రకటించారు. ఇలా గులాబీ పార్టీలో నెంబర్ వన్, నెంబర్ టూలు ఇద్దరూ పార్టీ కార్యక్రమాలకు దూరమవ్వడంతో ఇక ఆ పార్టీకి హరీశ్‌రావు, కవితలు ఇద్దరే దిక్కయ్యే పరిస్థితి కనిపిస్తుంది.గెలిచిన 39 మంది ఎమ్మెల్యేలను కూడా గులాబీ పార్టీ కాపాడుకోలేకపోతుంది. సిట్టింగ్ కంటోన్మెంట్ స్థానం బైపోల్స్‌లో కారు పార్టీకి దూరమైతే .. గెలిచిన పది మంది ఎమ్మెల్యేలు కారు జర్నీ తమ వల్ల కాదంటూ కాంగ్రెస్ బాట పట్టేశారు. దాంతో ప్రస్తుతం అసెంబ్లీలో బీఆర్ఎస్ బలం 28 మందికి పడిపోయింది. వారిలో ఎంత మంది లాయల్‌గా ఉంటారన్నదానిపై పార్టీ శ్రేణులకే క్లారిటీ లేదంట. ఇలాంటి పరిస్థితుల్లో బీఆర్ఎస్ ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని చూస్తున్న కార్యక్రమాలు కూడా అట్టర్ ఫ్లాప్ అవుతుండటం ఆ పార్టీ మనుగడనే ప్రశ్నార్థకం చేస్తున్నాయంటున్నారు.తెలంగాణలో అధికారంలో ఉన్న పదేళ్లలో ఎన్నడూ తలవనైనా తలవని దీక్షా దివస్ కు బీఆర్ఎస్ అధికారం కోల్పోయిన తరువాత దానికి ఎక్కడ లేని ప్రాధాన్యతా ఇచ్చింది. పదేళ్ల అధికారంలో ఉన్నప్పుడు.. సావు నోట్లో తలపెట్టి తెలంగాణ తెచ్చుకున్నామని చెప్పుకునే కేసీఆర్.. తాను దీక్ష చేశానని చెప్పుకునే రోజును ఎప్పుడూ తలచుకోలేదు. పార్టీ అధికారం కోల్పోయిన తరువాత, పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి కారణమైన తెలంగాణ పేరును కూడా పార్టీకి దూరం చేశాక.. ఆయనకు దీక్షా దివస్ గుర్తుకొచ్చింది.జాతీయ రాజకీయాలపై మక్కువ పెంచుకున్న గులాబీబాస్ ఢిల్లీ పీఠంపై కన్నేసి పార్టీ పేరులోంచి తెలంగాణను తీసేశారు. తెలంగాణ సాధన కోసం 14 ఏళ్ల సుదీర్ఘ పోరాటం సాగించిన టీఆర్ఎస్ పేరును బీఆర్ఎస్ గా మార్చేశారు. ఆ మార్పుతోనే తెలంగాణ సెంటిమెంట్ గులాబీ పార్టీకి దూరమైంది. బీఆర్ఎస్ పేరుతో ఎన్నికలకు వెళ్లి అధికారాన్ని కోల్పోయింది. ఇప్పుడు విపక్ష పాత్రలో కూడా ఆ పార్టీ అనుకున్న స్థాయిలో పెర్ఫార్మ్ చేయలేకపోతోంది. తమ పార్టీ గతంలో చేసిన త్యాగాలు, పోరాటాలను ప్రజలకు గుర్తు చేయడానికి బీఆర్ఎస్ పార్టీ గతంలో ఎన్నడూ లేని విధంగా తెలంగాణ సాధన కోసం కేసీఆర్ ఆమరణ నిరాహారదీక్ష ప్రారంభించిన నవంబర్ 19వ తేదీని దీక్షా దివస్ పేర ఘనంగా నిర్వహించాలని చూసింది. రాష్ట్రం నలుమూలలా కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకాలు, అమర వీరుల స్మారక చిహ్నాల వద్ద సభలు, సమావేశాలు ర్యాలీలు, ప్రార్థనలతో హడావుడి చేయడానికి స్కెచ్ గీశారు. కరీంనగర్‌లోని అలుగునూరులో జరిగిన సమావేశంలో పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పాల్గొన్నారు. సిద్దిపేటలో పార్టీ సీనియర్ నేత , మాజీ మంత్రని హరీశ్ రావు పాల్గొన్నారు. ఇక గత కొన్ని నెలలుగా యాక్టివ్ పాలిటిక్స్ కు దూరంగా ఉన్న ఎమ్మెల్సీ కవిత కూడా హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో జరిగిన దీక్షా దివస్ కార్యక్రమంలో పాల్గొన్నారు.అంత వరకూ బానే ఉన్నా.. బీఆర్ఎస్‌కు ఆ కార్యక్రమంతో ఎలాంటి మైలేజ్ దక్కలేదు.

పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి, తెలంగాణ సాధన కోసం సావు నోట్లో తలపెట్టి వచ్చానని చెప్పుకునే కేసీఆర్ ఆ ప్రోగ్రాంలో కూడా ఎక్కడా కనిపించలేదు. కనీసం ఫామ్ హౌస్ వదిలి బయటకు రాలేదు. దీంతో బీఆర్ఎస్ దీక్షా దివస్ అంటూ ఎంతగా హంగామా చేసినా జనం పెద్దగా పట్టించుకోలేదు. అది పూర్తిగా ప్రజలకు సంబంధం లేని పార్టీ కార్యక్రమంగా మిగిలిపోయి గులాబీ శ్రేణులకు పెద్ద షాక్ ఇచ్చింది.అలా అట్టర్ ఫ్లాప్ షోలు నిర్వహిస్తున్న కారు పార్టీకి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తండ్రి కేసీఆర్ బాటనే ఫాలో అవుతూ మరో పెద్ద షాక్ ఇచ్చారు.. కేసీఆర్ స్థానంలో పార్టీ బాధ్యతలను తన భుజస్కంధాలపై వేసుకుని నడిపించిన కేటీఆర్ ఇప్పుడు రాజకీయాలకు బ్రేక్ అంటూ ఎక్స్ వేదికగా చేసిన ప్రకటన సంచలనం రేపింది. రాష్ట్రంలో రేవంత్ నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన ఈ ఏడాది కాలంలో ప్రభుత్వ వ్యతిరేక పోరాటాలకు సంబంధించి కేటీఆర్ పూర్తిగా విఫలమయ్యాని ఇంటా బయటా వస్తున్న విమర్శల నేపథ్యంలో కేటీఆర్ రాజకీయాలకు బ్రేక్ ప్రకటించడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఇది తాత్కాలిక బ్రేకా.. రాజకీయ సన్యాసమా అంటూ నెటిజన్లు సెటైర్లు పేలుస్తున్నారు. కేటీఆర్ సోదరి పొలిటికల్ గా యాక్టివ్ అవ్వడం, ఆ వెంటనే కేటీఆర్ యాక్టివ్ పాలిటిక్స్ కు బ్రేక్ ప్రకటించడం ప్రాధాన్యత సంతరించుకుంది. కేటీఆర్ పార్టీని ముందుండి నడిపించడంలో విఫలమయ్యారని కేసీఆర్ కూడా భావిస్తున్నారనీ, అందుకే కుమార్తె కవితను రంగంలోకి దింపారన్న టాక్ ఉంది. లేకపోతే పార్టీ పూర్తిగా హరీష్‌రావు చేతుల్లోకి వెళ్లిపోతుందన్న భయంతో గులాబీబాస్ కూతుర్ని యాక్టివ్ చేయాలని భావిస్తున్నారంట.ఒకవైపు బావ హరీష్‌రావుతో పార్టీలో ఆధిపత్యపోరుతో సతమతమవుతుంటే.. చెల్లెలు కవిత కూడా పొలిటికల్‌గా రీ యాక్టివ్ అవుతుండటం కేటీఆర్‌కు నచ్చడం లేదంట. గత పది రోజులుగా యాక్టివ్ అయిన కేటీఆర్ చెల్లెలు కవిత తన జాగృతి టీమ్‌ని గాడిలో పెడుతున్నారు. నెలల తరబడి లిక్కర్ స్కామ్ కేసులోలో జైలు జీవితం గడిపి బెయిల్ వచ్చాక రెండు నెలల పాటు ఇంటికే పరిమితమైన కవిత.. ఇక రాజకీయాలకు దూరంగా ఉంటారని అప్పట్లో ప్రచారం జరిగింది. జైల్లో అనారోగ్య సమస్యలకు గురైన ఆమె ఇక పాలిటిక్స్‌లో కనిపించరనుకుంటున్న టైంలో సడన్‌గా యాక్టివ్ అయ్యారు.కవిత రీఎంట్రీపై కేటీఆర్ ఆగ్రహంతో ఉన్నారంట. కవిత మళ్లీ రాజకీయాల్లోకి రావడానికి వీల్లేదంటూ పంతం పట్టిన కేటీఆర్.. అదే విషయమై తండ్రి కేసీఆర్ తోనూ గొడవ పడ్డారంట. అయతే కేటీఆర్ మాటలను కేసీఆర్ పట్టించుకోలేదంటున్నారు. మరోవైపు అన్న మాటలను కవిత కూడా లెక్కచేయడం లేదంట.. అలా ఫ్యామిలీలో తన మాట చెల్లుబాటు కాకపోవడంతో అలిగిన కేటీఆర్‌కు సడన్‌గా కేరళలో ప్రకృతి వైద్యం గుర్తుకొచ్చిందంటున్నారు. ఆ నేపథ్యంలో కేటీఆర్ రాజకీయలకు ప్రకటించిన బ్రేక్ సుదీర్ఘ కాలం కొనసాగే అవకాశం ఉందని అంటున్నారు. మొత్తానికి కారు స్టీరింగ్ ఇప్పుడు అయితే హరీష్‌రావు, లేకపోతే కవిత చేతుల్లోకి వెళ్లే పరిస్థితి కనిపిస్తుందిప్పుడు

# సౌత్ కొరియాలో డూ నథింగ్ మూవ్ మెంట్

సియోల్, డిసెంబర్ 3, (న్యూస్ పల్స్) ఇటీవలి కాలంలో సెలబ్రేషన్స్‌కు చాలా మంది ఒక అంశాన్ని ఎంచుకుంటున్నారు. ఈ క్రమంలో సౌత్ కొరియాలో 'డూ నథింగ్' లేదా 'ఎంచుకోని విశ్రాంతి' అనే ఆలోచన గురించి పెద్దగా చర్చ జరుగుతోంది. ఈ ఆలోచన, ముఖ్యంగా యువతలో, వేగంగా పనిచేసే, పోటీతో నిండిన సామాజిక జీవనశైలికి ప్రత్యామ్నాయం ఇవ్వడాన్ని ఉద్దేశిస్తోంది. ఈ భావన సౌత్ కొరియాలోని వారితో మరింత పాప్యులర్ అయ్యింది, వారు తమ జీవనశైలిని సులభతరం చేసుకోవడానికి 'డూ నథింగ్' శైలి అలవర్చుకునే ప్రయత్నం చేస్తున్నారు.'డూ నథింగ్' అనేది పూర్తిగా నిర్లిప్తతను సూచించదు, కానీ ఇది పని, విద్య, సామాజిక ఒత్తిడి నుంచి కొంతకాలం విరామం తీసుకోవడం, మానసిక ఆరోగ్యం కోసం సమయాన్ని వెచ్చించడం. సౌత్ కొరియాలో ఎప్పుడు కష్టపడటం, పూర్తి చేసిన ప్రదేశంలో మాత్రమే శాంతి పొందడం అన్న భావన ఎక్కువ, అయితే ఈ 'డూ నథింగ్' ఆలోచన వారికి విశ్రాంతి, ఒత్తిడి తొలగింపు, నిజంగా ముఖ్యం అయిన దానిపై దృష్టి పెట్టడానికి సహాయం చేస్తోంది. సౌత్ కొరియాలో అనేక ఆన్‌లైన్ కాంపిటేషన్లు, వీడియోలు, మరియు మీడియా కంటెంట్ ఈ 'డూ నథింగ్' శైలి యొక్క సమకాలీన చిహ్నంగా మారాయి. ఇవి సాదాసీదా వాతావరణాలు, ప్రకతి దృశ్యాలు, లేదా మౌనమైన కార్యకలాపాలను చూపిస్తాయి, వీటితో ప్రేక్షకులను విశ్రాంతి, అలసట నుంచి విముక్తి పొందాలని ప్రోత్సహించేందుకు ఉద్దేశించబడినవి.ఈ డూ నథింగ్ ఉద్యమం దక్షిణ కొరయన్లలో రావడానికి ప్రధాన కారణం.. ఎక్కువగా పని చేయడమే. ఈ దేశంలో అందరూ పని చేస్తారు. పని ఒత్తిడి కారణంగా మానసికంగా ఒత్తిడికి గురవుతున్నారు. వీరి వ్యక్తిగత జీవితంలో సాయం చేయడానికి ఈ దృక్పథాన్ని అభివృద్ధి చేస్తున్నారు. ఇది అంతర్జాతీయ స్థాయిలో కూడా కొత్త ఆలోచన. 'డూ నథింగ్' కాంపిటేషన్లు మానసిక పునరుద్ధరణ, సాంత్వన, సరళమైన ఆనందాలు అనుభవించడానికి ఒక ఆహ్వానంగా మారాయి, తద్వారా సమాజంలో నిరంతరం ఉత్పత్తి కావాలన్న ఒత్తిడిని తగ్గించే ప్రయత్నం చేయడాన్ని ప్రేరేపిస్తాయి.

# ప్రైవేట్ మెడికల్ కాలేజీలు... ఆస్తుల ఎటాచ్

కరీంనగర్, డిసెంబర్ 3, బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో అనేక అవినీతి, అక్రమాలు జరిగాయని కేంద్ర దర్యాప్తు సంస్థలకు రాజకీయపార్టీతోపాటు పలువురు ఫిర్యాదులు చేశారు. దీంతో సీబీఐ, ఈడీ, ఐటీ సంస్థలు దాడులు మొదలు పెట్టాయి. చివరకు అప్పటి సీఎం కేసీఆర్ ఇంటికి కూడా సీబీఐ, ఈడీ అధికారులు వచ్చారు. దీంతో బీఆర్ఎస్ ప్రభుత్వం కేంద్ర దర్యాప్తు సంస్థలను రాష్ట్రంలోకి అనుమతి నిరాకరిస్తూ రహస్యంగా జీవో జారీ చేసింది. అయితే ఐటీ దాడులు మాత్రం ఆగలేదు. ఎన్నికల సమయంలో ఐటీ పలువురు బీఆర్ఎస్ నేతలతోపాటు, కాంగ్రెస్ నేతల ఇళ్లపై దాడిచేసింది. ఎన్నికల తర్వాత ప్రభుత్వం మారడంతో ఈడీ, సీబీఐ కూడా రాష్ట్రంలోకి వస్తున్నాయి. తాజాగా మెడికల్ సీట్ల స్కామ్‌లో అవకతవకలపై ఇప్పటికే రాష్ట్రంలోని పలు కళాశాలలను సీబీఐ, ఈడీ అధికారులు తనిఖీ చేశారు. తాజాగా ఈడీ చర్యలకు దిగింది. మూడు మెడికల్ కాలేజీలకు సంబంధించిన ఆస్తులను సీజ్ చేసింది.మెడికల్ సీట్లలో అక్రమాలకు పాల్పడిన మూడు మెడికల్ కాలేజీలకు చెందిన రూ.9.71 కోట్ల విలువైన ఆస్తులను ఈడీ అటాచ్ చేసింది. ఇందులో మల్లారెడ్డి కళాశాలకు చెందిన రూ.2.89 కోట్లు, ఎంఎన్‌ఆర్ మెడికల్ కాలేజీకి చెందిన రూ.2.01 కోట్లు, కరీంనగర్‌లోని చల్మెడ ఆనందరావు మెడికల్ కాలేజీకి చెందిన రూ.3.33 కుట్లు ఆస్తులను అటాచ్ చేసింది.మెడికల్ సీట్లను బ్లాక్ చేసి పెద్ద మొత్తంలో ఆర్థిక లావాదేవీలకు పాల్పడినట్లు ఆరోపణలపై ఈడీ అధికారులు గతంలో రంగంలోకి దిగారు. కాళోజీ వర్సిటీ రిజిస్ట్రార్ వరంగల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీని ఆధారంగా కేసు కూడా నమోదు చేశారు. దీని ఆధారంగా మెడికల్ కాలేజీలపై మెరుపు దాడులు చేసిన ఈడీ.. కీలక సమాచారం సేకరించింది. నీట్ పీజీ మెరిట్ ఆధారంగా కన్వీనర్ కోటా లేదాంటే ఫ్రీ సీట్ల కింద చాలా వరకు ఉత్తరాది రాష్ట్రాల విద్యార్థుల పేర్లతో బ్లాక్ చేసినట్లు గుర్తించింది.గతేడాది జూన్‌లో మల్లారెడ్డి నివాసంతోపాటు మెడికల్ కాలేజీ, ఆఫీసులపై ఈడీ దాడిచేసింది. కీలక పత్రాలు, పెన్‌డ్రైవ్‌లు, హార్డ్ డిస్కులు స్వాధీనం చేసుకుంది. వేర్వేరు మెడికల్ కాలేజీ ప్రవేశాల్లో 2016 నుంచి 2022 వరకు అవకతవకలు జరిగినట్లు గుర్తించింది. ఎంఎన్‌ఆర్, చల్మెడ ఆనందరావు మెడికల్ కాలేజీల్లో చేపట్టిన తనిఖీల్లోనూ కీలక డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకుంది. తాజాగా ఆస్తులను ఆటాచ్ చేసింది.

# కోచ్ ఫ్యాక్టరీ క్రెడిట్ వార్..

వరంగల్, డిసెంబర్ 3, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ క్రెడిట్ కోసం అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీజేపీ, బీఆర్ఎస్ కొట్లాట మొదలుపెట్టాయి. తమ పోరాటం వల్లే కోచ్ ఫ్యాక్టరీ వచ్చిందని మూడు పార్టీల నేతలు పోటాపోటీగా ప్రచారం చేసుకుంటున్నారు. ఓరుగల్లు రాజకీయ పార్టీల్లో కొత్త కొట్లాట మొదలైంది. ఎన్నో ఏళ్లుగా ఇక్కడి ప్రజలు డిమాండ్ చేస్తున్న రైల్వే కోచ్ ఫ్యాక్టరీ కల ఇటీవల సాకారం కాగా.. కాజీపేటకు కోచ్ ఫ్యాక్టరీ తీసుకు వచ్చిన క్రెడిట్ మాదంటే మాదేనని మూడు ప్రధాన పార్టీలు కొట్లాడుకుంటున్నాయి. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలో ఉండగా.. తమ పార్టీ పెద్దలను ఒప్పించి కోచ్ ఫ్యాక్టరీ తీసుకొచ్చామని ఆ పార్టీ నేతలు అంటుంటే.. సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఎంపీలు కొట్లాడటం వల్లే కేంద్రం కాజీపేటకు కోచ్ ఫ్యాక్టరీని మంజూరు చేసిందని హస్తం పార్టీ నేతలు వాదిస్తున్నారు. ఈ రెండు పార్టీలు ఇలా ఉంటే.. తమ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు కోచ్ ఫ్యాక్టరీ కోసం గల్లీ నుంచి ఢిల్లీ వరకు కొట్లాడామని, తమ పోరాటాలకే కేంద్రం కోచ్ ఫ్యాక్టరీ ఇచ్చిందంటూ బీఆర్ఎస్ నేతలు చెప్పుకుంటున్నారు. ఇలా మూడు పార్టీలు కోచ్ ఫ్యాక్టరీ తెచ్చిన క్రెడిట్ అంతా తమదేనని కొట్లాడుకుంటుండగా, ఫ్యాక్టరీ ఎవరు తెచ్చినా అందులో ఇక్కడి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేయాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి.సౌత్ సెంట్రల్ రైల్వేలో కాజీపేట జంక్షన్ కు కీలక స్థానం ఉంది. నార్త్ ఇండియాకు పోవాలన్నా.. సౌత్ ఇండియా వైపు వెళ్లాలన్నా ఈ జంక్షన్ నుంచే మళ్లాల్సి ఉంటుంది. అంతేగాకుండా తెలంగాణలో రెండో అతి పెద్ద జంక్షన్ గా ఉండటం, ఇక్కడి నుంచి ఆదాయం కూడా పెద్ద మొత్తంలోనే సమకూరుతుండటంతో ఇక్కడ రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలనే డిమాండ్ దాదాపు ఆరు దశాబ్ధాల నుంచి ఉంది. 1969లోనే కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు కోసం కమ్యూనిస్ట్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు జరిగాయి. అప్పటి కమ్యూనిస్టు నేతలు బీఆర్ భగవాన్ దాసు, కాళీదాసు నేతృత్వంలో ఈ కోచ్ ఫ్యాక్టరీ ఉద్యమం ప్రారంభం కాగా.. అప్పటి నుంచి ఇప్పటివరకు కొనసాగుతూ వచ్చింది. కాగా 1978?80 మధ్య కాలంలో అన్ని పార్టీలు తమతమ కండువాలను పక్కన పెట్టేసి అఖిలపక్షంగా ఏర్పడి కోచ్ ఫ్యాక్టరీ కోసం అప్పటి ప్రధాని ఇందిరాగాంధీకి విన్నవించారు. దీంతో ఇందిరాగాంధీ 1982లో పార్లమెంట్‌లో కాజీపేటకు కోచ్ ఫ్యాక్టరీని మంజూరు చేశారు.కానీ స్థల సేకరణ ప్రక్రియలో ఇబ్బందులు తలెత్తడంతో కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు అడుగులు పడలేదు. కాగా 1984లో ఇందిరాగాంధీ హత్యకు గురవడం, ఖలిస్థాన్ ఉద్యమ నేపథ్యంలో ఆ కోచ్ ఫ్యాక్టరీని పంజాబ్‌లోని కపుర్తాలకు తరలించారు. ఆ తరువాత 2004లో మరోసారి కాజీపేటకు కోచ్ ఫ్యాక్టరీ మంజూరు చేశారు. కానీ ఆ తరువాత దానిని రాయిబరేలికి తరలించారు. ఇదిలా ఉంటే 2010?11 బడ్జెట్ లో అప్పటి కేంద్ర ప్రభుత్వం కాజీపేటలో వ్యాగన్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చి, రూ.15 కోట్లు మంజూరు కూడా చేసింది. ఆ తరువాత దీనికి అప్పటి రాష్ట్ర ప్రభుత్వం 54 ఎకరాల భూమిని కేటాయించగా.. ఆ స్థలంపై వివాదాలు రావటంతో ఆ ప్రాజెక్టు తెర వెనక్కి వెళ్లిపోయింది. ఇక తెలంగాణ ఏర్పాటు సమయంలో ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ అంశాన్ని చేర్చారు. కానీ ఆ తరువాత కోచ్ ఫ్యాక్టరీ అంశం పార్టీల మాటల యుద్ధానికే పరిమితమైంది. కాగా దేశంలో కొత్తగా కోచ్ ఫ్యాక్టరీల అవసరం లేదని చెబుతూ వచ్చిన కేంద్ర ప్రభుత్వం 2016లో కాజీపేటకు కోచ్ ఫ్యాక్టరీకి బదులు పీరియాడికల్ ఓవర్ హాలింగ్ (పీవోహెచ్) వర్క్ షాపును ప్రకటించింది.

దానికి కోసం 160 ఎకరాలు అవసరం కాగా.. మడికొండ, అయోధ్యపురం గ్రామాల శివారులోని ఎండోమెంట్ భూములను సేకరించారు. ఈ మేరకు గతేడాది అసెంబ్లీ ఎన్నికల ముందు జులై 8న వరంగల్ కు వచ్చిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పీవోహెచ్ ను అప్ గ్రేడ్ చేసి, వ్యాగన్ మాన్యుఫ్యాక్షరింగ్ యూనిట్ కు శంకుస్థాపన చేశారు. అయినా కోచ్ ఫ్యాక్టరీ డిమాండ్ మాత్రం నెరవేరకపోవడంతో ఓరుగల్లు ప్రజల్లో కొంత అసంతృప్తి ఉండేది. ఈ క్రమంలో ఈ ఏడాది సెప్టెంబర్ లోనే కాజీపేట వ్యాగన్ తయారీ యూనిట్ ను ఇంటిగ్రేటెడ్ రైల్వే కోచ్ ఫ్యాక్టరీగా అప్ గ్రేడ్ చేస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు అధికారికంగా రైల్వే శాఖకు ఉత్తర్వులు కూడా అందాయి. కానీ కోచ్ ఫ్యాక్టరీగా అప్ గ్రేడ్ చేస్తూ ఇచ్చిన ఉత్తర్వులు తాజాగా నవంబర్ 28న వెలుగులోకి వచ్చాయి.కాజీపేటకు కోచ్ ఫ్యాక్టరీ మంజూరు కావడానికి తమ కృషే కారణమంటూ కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ప్రచారం చేసుకుంటున్నాయి. ఎవరికి వారు సంబరాలు నిర్వహించుకోవడంతో పాటు పోటాపోటీగా మీడియా సమావేశాలు కూడా నిర్వహించి, కోచ్ ఫ్యాక్టరీ క్రెడిట్ అంతా తమదేనని చెప్పుకుంటున్నారు.కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు కృషి చేసింది బీఆర్ఎస్ పార్టీనేని ఆ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ చెబుతున్నారు. ఈ మేరకు కోచ్ ఫ్యాక్టరీ ప్రకటన విషయం వెలుగులోకి వచ్చిన తరువాత ఆయన ప్రత్యేకంగా కాజీపేట జంక్షన్ ను విజిట్ చేసి, టపాసులు కాల్చి సంబరాలు కూడా జరిపారు. మీడియా సమావేశం కూడా నిర్వహించి తెలంగాణ కోసం కొట్లాడినట్టే కోచ్ ఫ్యాక్టరీ కోసం బీఆర్ఎస్ పార్టీ కొట్లాడిందని చెప్పుకొచ్చారు. కోచ్ ఫ్యాక్టరీ కోసం గల్లీ నుంచి ఢిల్లీ దాకా పోరాటాలు చేశామని, ఉద్యమ సమయంలో కూడా శ్రీకృష్ణ కమిటీకి వినతిపత్రాలు ఇచ్చామన్నారు. బీఆర్ఎస్ అదినేత కేసీఆర్ తో పాటు ఆ పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలంతా కలిసి కలిసి విభజన చట్టంలో కోచ్ ఫ్యాక్టరీ అంశాన్ని పొందుపరిచేలా ఒత్తిడి చేశామంటూ చెప్పుకొస్తున్నారు. మొత్తంగా బీఆర్ఎస్ కొట్లాడటం వల్లనే కేంద్ర ప్రభుత్వం కాజీపేటకు కోచ్ ఫ్యాక్టరీ ఇచ్చిందని ప్రచారం చేస్తున్నారు.

కాజీపేటకు కోచ్ ఫ్యాక్టరీ మంజూరు చేయడం బీజేపీతోనే సాధ్యమైందని ఆ పార్టీ జిల్లా అద్యక్షురాలు రావు పద్మారెడ్డి చెబుతున్నారు. గతంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కాజీపేటకు మంజూరైన కోచ్ ఫ్యాక్టరీని ఇతర ప్రాంతాలకు తరలించిందని, కానీ కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ఓరుగల్లు అభివృద్ధికి పాటుపడుతూ కాజీపేటకు కోచ్ ఫ్యాక్టరీని ఇచ్చిందంటున్నారు. ఇప్పటికే వరంగల్ కు స్మార్ట్ సిటీ, హృదయ్, అమృత్ లాంటి పథకాలు ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం.. కాజీపేటకు కోచ్ ఫ్యాక్టరీ మంజూరు చేసి చిత్తశుద్ధి చాటుకుందని చెబుతున్నారు. కాగా కాజీపేట కల నెరవేర్చింది తమ పార్టేనంటూ నవంబర్ 29న బీజేపీ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసిన అరూరి రమేశ్, మాజీ ఎమ్మెల్యేలు, ఇతర నేతలు సంబరాలు నిర్వహించారు. ప్రధాని మోదీ ఫొటోలకు పాలతో అభిషేకాలు కూడా నిర్వహించారు.సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకుల పోరాట ఫలితంగానే కాజీపేటకు కోచ్ ఫ్యాక్టరీ వచ్చిందని వరంగల్ వెస్ట్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి చెబుతున్నారు. ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి, ఎంపీ కడియం కావ్య పలుమార్లు కేంద్ర ప్రభుత్వానికి విన్నవించి కాజీపేటలోని వ్యాగన్ తయారీ యూనిట్ ను కోచ్ ఫ్యాక్టరీగా అప్ గ్రేడ్ చేయించారని చెబుతున్నారు. గతంలో కోచ్ ఫ్యాక్టరీ మంజూరు చేస్తే గత బీఆర్ఎస్ ప్రభుత్వం స్థలం ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేసిందని, కానీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాకనే ఓరుగల్లు అభివృద్ధికి అడుగులు పడుతున్నాయని అంటున్నారు. ఈ మేరకు ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం కూడా చేశారు. ఇలా మూడు పార్టీలు ఎవరికి వారు కోచ్ ఫ్యాక్టరీ క్రెడిట్ అంతా తమదేనని చెప్పుకుంటుండగా.. ఉమ్మడి పోరాటాల ఫలితంగానే కాజీపేటకు కోచ్ ఫ్యాక్టరీ కల నెరవేరిందని రైల్వే సంఘాల నేతలు అంటున్నారు. ఏది ఏమైనా దశాబ్ధాల కల నెరవేరగా.. ఇక్కడి యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ప్రధాన పార్టీల నేతలు చొరవ చూపాలని ఓరుగల్లు ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## ఆపరేషన్ సమాధాన్ తో పట్టు చిక్కినట్టేనా

వరంగల్, డిసెంబర్ 3, (న్యూస్ పల్స్)దండకారణ్యంలో పట్టు సాధించేందుకు తెలంగాణ పోలీసులు బలంగా అడుగులు వేస్తున్నారు. గ్రేహౌండ్స్ దళాలు తెలంగాణ వ్యాప్తంగా విస్తరించి ఉన్న అడవుల్లో కొంతకాలంగా విస్తృతంగా కూంబింగ్ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో పోలీసులు, మావోయిస్టుల మధ్య పరస్పరం కాల్పులు జరుగుతున్నాయి. అయితే అధునాతన ఆయుధాలు కలిగిన పోలీసులు మావోయిస్టులపై పై చేయి సాధిస్తున్నారు.మావోయిస్టులపై తెలంగాణ గ్రేహౌండ్స్ పోలీసులు వరుసగా ఎన్ కౌంటర్ చేస్తున్నారు. తాజాగా ఆదివారం ములుగు జిల్లాలో భారీ ఎన్ కౌంటర్ చోటుచేసుకుంది. ఈ ఎన్కౌంటర్లో ఏడుగురు మావోయిస్టులు హతమైనట్టు తెలుస్తోంది. ఈ ఏడాదిలో చత్తీస్ గడ్ రాష్ట్రంలో ఇటీవల దంతవాడ ప్రాంతంలో జరిగిన ఎన్ కౌంటర్ లో 36 మంది మావోయిస్టులు చనిపోయారు. దాని తర్వాత రెండవ అతిపెద్ద ఎన్ కౌంటర్ ఇదే కావడం విశేషం. ఆదివారం తెల్లవారుజామున ఏటూరు నాగారంలోని చల్పాక అటవీ ప్రాంతంలో ఎన్ కౌంటర్ జరిగింది. ఈ ఎన్ కౌంటర్ లో ఏడుగురు మావోయిస్టులు హతం అయినట్టు తెలుస్తోంది. గ్రేహౌండ్స్, మావోయిస్టు వ్యతిరేక దళాలు సంయుక్తంగా ఈ ఆపరేషన్ సాగించాయి.. అయితే ఈ ఎన్ కౌంటర్ పై పోలీసులు ఇంతవరకు అధికారికంగా ప్రకటించలేదు. మీడియాలో వస్తున్న వార్తలు ప్రకారం ఈ ఎన్ కౌంటర్ లో మావోయిస్టు కీలక నేతలు ఉన్నట్టు తెలుస్తోంది. ఇల్లందు ? నర్సంపేట ఏరియా కమిటీ కార్యదర్శి బద్రు అలియాస్ పాపన్న ఎన్ కౌంటర్ లో హతమైనట్టు సమాచారం. సరిగ్గా వారం క్రితం ఇద్దరు ఆదివాసీలను మావోయిస్టులు చంపేశారు. పోలీసులకు ఇన్ ఫార్మర్లుగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ.. వారిని మావోయిస్టులు అత్యంత కిరాతకంగా చంపేశారు. అయితే ఈ ఘటనను తెలంగాణ గ్రేహౌండ్స్ దళాలు సీరియస్ గా పరిగణించాయి. వెంటనే మావోయిస్టు వ్యతిరేక పోలీసుల దళం తో కలిసి గ్రేహౌండ్స్ బలగాలు దండకారణ్యంలో కూంబింగ్ మొదలుపెట్టాయి. ఈ క్రమంలో చలపాక అటవీ ప్రాంతంలో పోలీసులకు, మావోయిస్టులకు భీకరమైన ఎదురు కాల్పులు జరిగాయి. ఈ ఘటనలో ఏడుగురు మావోయిస్టులు చనిపోయారు.అక్టోబర్ 22న చత్తీస్ గడ్ రాష్ట్రంలో భారీ ఎన్ కౌంటర్ చోటుచేసుకుంది. ఈ ఘటనలో పదిమంది మావోయిస్టులు చనిపోయారు. మావోయిస్టుల వ్యతిరేక ఆపరేషన్ లో భాగంగా పోలీసు బలగాలు ఈ కార్యక్రమం చేపట్టాయి. కుంట పోలీస్ స్టేషన్ పరిధిలోని డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్ ఆధ్వర్యంలో కూలింగ్ మొదలైంది. ఈ క్రమంలో పోలీసులకు, మావోయిస్టులకు భీకరమైన కాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనలో పదిమంది మావోయిస్టులు చనిపోయారు. సంఘటన స్థలంలో ఆటోమేటిక్ తుపాకులను, ఇతర అధునాతన ఆయుధాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.. ఇటీవల కాలంలో దండకారణ్యంలో మావోయిస్టుల కార్యకలాపాలు పెరిగిపోయాయి. ఛత్తీస్ గడ్ రాష్ట్రం నుంచి మావోయిస్టులు తెలంగాణ సరిహద్దుల్లోకి వస్తున్నట్టు గ్రేహౌండ్స్ బలగాలు గుర్తించాయి. దీంతో దండకారణ్యంలో కూంబింగ్ నిర్వహిస్తున్నాయి. ఈ క్రమంలోనే వరుసగా ఎన్ కౌంటర్లు చోటు చేసుకుంటున్నాయి. తాజా ఎన్ కౌంటర్ మావోయిస్టులకు కోలుకోలేని దెబ్బ అని తెలుస్తోంది. వరుసగా కీలక నేతలను కోల్పోవడంతో మావోయిస్టులపై గ్రేహౌండ్స్ దళాలు పై చేయి సాధించినట్లు వార్తలు వినిపిస్తున్నాయి.కేంద్ర బలగాలు కొంతకాలంగా వామపక్ష భావజాల తీవ్రవాదాన్ని అణచివేయడానికి ఆపరేషన్ సమాధాన్ నిర్వహిస్తోంది. దీనిని వాపక్ష పార్టీలు ఖండిస్తున్నాయి. అయినప్పటికీ కేంద్ర బలగాలు దూకుడుగానే ముందుకు వెళ్తున్నాయి. దండకారణ్యంలో విస్తృతంగా కూంబింగ్ నిర్వహిస్తున్నాయి. అధునాతన డ్రోన్ కెమెరాలు, ఆయుధాలతో మావోయిస్టులపై విరుచుకుపడుతున్నాయి. దండకారణ్యంలో పట్టు సాధిస్తున్నాయి. అంతేకాదు గతంలో జరిగిన ఎన్ కౌంటర్లకు బలమైన సమాధానాలు చెబుతున్నాయి. అయితే ఈ దాడుల పరంపర ఇక్కడితో ఆగదని.. కేంద్ర బలగాలు మరింత వేగంగా వెళ్తాయని తెలుస్తోంది. రాష్ట్ర పోలీసుల సహకారంతో కేంద్ర బలగాలు సంయుక్తంగా ఆపరేషన్లు చేపడుతున్నట్టు తెలుస్తోంది.

## చిన్న పోస్టులో ఉండి... కోట్ల సంపాదన...

హైదరాబాద్, డిసెంబర్ 3, ఏసీబీ అధికారులే షాక్ అయిన పరిస్థితి. ఇరిగేషన్ శాఖలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్..ఏఈఈగా పనిచేస్తున్న నిఖేశ్ కుమార్ అవినీతి బాగోతం భాగోతం ఇప్పుడు టాక్ ఆఫ్ ది టూ స్టేట్స్‌గా మారింది.రెండు మూడ్రోజుల నుంచి ఆయన కరప్షన్ స్టోరీ మీదే డిస్కషన్ జరుగుతోంది. ఏసీబీ అధికారులు చేసిన సోదాల్లో నిఖేశ్‌కు సంబంధించి ఏకంగా 200 కోట్ల రూపాయల అవినీతి అక్రమాస్తులు బయటపడ్డాయి. దాంతో ఏఈఈ పోస్టులో అంతగా వెనకేసుకునే అవకాశం ఉంటుందా చర్చ జరుగుతోంది.నిఖేష్ డిపార్ట్‌మెంట్‌లో చేరి కూడా పట్టుమని పదేళ్లు పూర్తి కాలేదు. కానీ అతని అవినీతి బాగోతం మాత్రం..సరికొత్త రికార్డు సృష్టించింది. నిఖేశ్ కుమార్ ఇరిగేషన్ శాఖలో 2013లో విధుల్లో చేరాడు. ఎక్కువ సమయం ఆయన సిటీ శివారు ప్రాంతాల్లోనే పనిచేశాడు. ఇదే నిఖేశ్‌కు కాసుల వర్షం కురిపించింది.నగరు శివారు ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణాలు, వెంచర్లకు ఎన్వోసీ తప్పనిసరి అవుతుంది. మరీ ముఖ్యంగా చెరువులు కుంటల దగ్గరుండే రివర్ వ్యూ వెంచర్లకు భారీ డిమాండ్ ఉంటుంది. వీటన్నింటికి ఇరిగేషన్ శాఖ అనుమతి ఇవ్వాల్సి ఉండటంతో దీన్నే అవకాశంగా మల్చుకున్న ఏఈఈ నిఖేశ్ కుమార్..పైఆఫీసర్లకు వాటాలను సెట్ చేసి..పనికానిచ్చేవాడట. పైఆఫీసర్లు కూడా తమ చేతికి మట్టి అంటకుండా కాసులు వచ్చిపడుతుండటంతో నిఖేశ్ ఆగడాలకు ఫుల్ సపోర్ట్ చేశారట.భారీ లంచాలకు రుచిమరిగిన నిఖేశ్ యాజ్‌టీజ్‌గా ఒక ఫైల్ విషయంలో పెద్ద మొత్తంలో డిమాండ్ చేశాడు. రంగారెడ్డి జిల్లా మణికొండ నెక్నంపూర్‌కు చెందిన బొమ్ము ఉపేంద్రనాథ్ రెడ్డి కన్‌స్ట్రక్షన్ ఎన్‌వోసీ కోసం ఇరిగేషన్ శాఖకు దరఖాస్తు చేసుకున్నాడు. ఉపేంద్రనాథ్ ఫైల్ క్లియర్ చేయడం కోసం 2 లక్షల 50వేలు డిమాండ్ చేశాడు.మొదటి విడతగా దాదాపు 2లక్షలు తీసుకున్నారు. ఆ తర్వాత మరిన్ని డబ్బులు కావాలని డిమాండ్ చేయడంతో ఉపేంద్రనాథ్ ఏసీబీని ఆశ్రయించాడు. అలా లక్ష రూపాయలు తీసుకుంటూ ఏసీబీకి రెడ్ హాండెడ్‌గా పట్టుబడ్డారు. ఈ వ్యవహారంలో సంబంధం ఉన్న ఏఈఈ నిఖేశ్‌తో పాటు ఏఈ భన్సీలాల్, సర్వేయర్ గణేశ్‌లను ఏసీబీ అదుపులోకి తీసుకుంది. దీని తర్వాత అసలు బాగోతం వెలుగులోకి వచ్చింది.

ఏసీబీ రైడ్స్‌లో పట్టుబడిన ఈ అధికారిపై..డిపార్ట్‌మెంట్ ఇంటర్నల్ ఇన్వెస్టిగేషన్‌లో చాలా అవినీతి బాగోతాలు బయటికి వచ్చాయట. కోట్ల రూపాయలు విలువ చేసే ఆస్తులను తన బినామీల పేరిట పెట్టినట్లు గుర్తించారట. దీంతో నిఖేశ్ కుమార్ నివాసంతో పాటు ఆయన బినామీలుగా ఉన్న 19 ప్రాంతాల్లో సోదాలు చేశారు. ఈ తనిఖీల్లో ఊహించిన దానికంటే ఎక్కువ అవినీతి బాగోతం బయటపడింది. ఏకంగా 200 కోట్ల విలువ చేసే ఆస్తులు ఏసీబీ రైడ్స్‌లో బయటపడ్డట్లు చెబుతున్నారు.

ఓ చిన్న స్థాయి అధికారే ఈ రేంజ్‌లో అక్రమాస్తులు సంపాదిస్తే..పైలెవల్ ఆఫీసర్ల పరిస్థితి ఏందటన్నది చర్చనీయాంశంగా మారింది. ఇలా అక్కడక్కడ ఎవరైనా అధికారి పట్టుబడినప్పుడు నాలుగు రోజులు చర్చించి లైట్ తీసుకోవడం తప్ప..కరప్షన్‌ను పూర్తిస్థాయిలో కంట్రోల్ చేయలేరా అన్న చర్చ జరుగుతోంది. అయితే నిఖేశ్ దగ్గర ఇంత భారీ స్థాయిలో అక్రమాస్తులు వెలుగు చూడటంతో పోలీసులు విస్తుపోయారు.నిఖేశ్ సింగిల్ విండో సిస్టమ్‌లో పైఅధికారుల వాటాను డీల్ చేసే వ్యవహారం బయటపడటంతో..ఈ కేసును మరింత లోతుగా విచారణ చేయాలని ఏసీబీ భావిస్తోంది. నిఖేష్ ఇంతగా రెచ్చిపోవడానికి సహకరించిన పై అధికారుల ఎవరనే అంశాన్ని తేల్చాలని చూస్తున్నారు. అయితే ఈ కేసు వెలుగులోకి రావడంతో నిఖేశ్‌కు సహకరించిన అధికారుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయట. చూడాలి మరి ఈ అవినీతి బాగోతంలో ఎలాంటి అనకొండలు బయటకు వస్తాయనేది

## పాలమూరు కోసం రేవంత్ రిక్వెస్ట్..

మహబూబ్ నగర్, డిసెంబర్ 3, ఢిల్లీకి రాజైనా తల్లికి కొడుకే. అవును రేవంత్ రెడ్డి రాష్ట్రానికి ముఖ్యమంత్రే అయినా.. పాలమూరుకు మాత్రం జిల్లావాసే. అందుకే సొంత జిల్లాపై ఉన్న మమకారాన్ని మరోసారి బయటపెట్టారు సీఎం. ఈ క్రమంలోనే మహబూబ్‌నగర్ జిల్లా అభివృద్ధికి సహకరించాలని మంత్రులను కోరారు. సీఎం స్థాయిలో తన జిల్లాకు ఏం కావాలో చేసుకునే రేంజ్‌లో ఉన్నా.. రిక్వెస్ట్ మ్యానర్‌లో సహచర మంత్రులను తనదైన స్టైల్లో జిల్లా అభివృద్ధికి హెల్ప్ చేయాలని కోరడం రేవంత్‌రెడ్డి చాకచక్యానికి నిదర్శనమంటున్నారు రాజకీయ విశ్లేషకులు.తానొవ్వక..నొప్పించక ధన్యుడు సుమతి అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు సీఎం రేవంత్. అందులోనూ తన సొంత జిల్లా ఉమ్మడి మహబూబ్ నగర్ అభివృద్ధి విషయంలో ఆచితూచి అడుగులు వేస్తున్నారు. సీఎం హోదాలో తన జిల్లాకు ఏం కావాలో అది మంజూరు చేసుకునే పొజిషన్‌లో ఉన్న రేవంత్ రెడ్డి..జాగ్రత్తగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. అటు సొంత పార్టీతో పాటు ఇటు అపోజిషన్ నుంచి విమర్శలు రాకుండా స్కెచ్ వేస్తున్నారట. ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారని, సొంత జిల్లాకు ఎక్కువ నిధులను తీసుకెళ్తున్నారనే టాక్ రాకుండా కేర్ తీసుకుంటున్నారట రేవంత్.సొంత జిల్లాకు ఏం కావాలో అది తీసుకెళ్తే.. మిగతా మంత్రులు ఏమనుకుంటారోనని సీఎం రేవంత్ రెడ్డి భావిస్తున్నట్లు తెలుస్తోంది. అందుకే ముఖ్యమంత్రి స్థాయిలో ఉండి కూడా.. తన సొంత జిల్లాపై కాస్త ప్రేమ చూపించాలని విజ్ఞప్తి చేయడం ఆసక్తికరంగా మారింది. పాలమూరు జిల్లా అభివృద్ధికి సంబంధించిన ఫైళ్లపై కొన్ని ఎక్కువ సంతకాలు చేయాలని సరదాగా అన్నప్పటికీ.. సీఎం తన సొంత జిల్లా అభివృద్ధికి సహకరించాలని మంత్రులను కోరడం ఆయన రాజకీయ చాకచక్యానికి నిదర్శనమంటున్నారు రాజకీయ ఎనలిస్టులు.డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నుంచి మొదలు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, తుమ్మల నాగేశ్వర రావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి..ఇలా మంత్రులందరిని మహబూబ్ నగర్ అభివృద్ధికి సహకరించాలని స్వయంగా కోరడం సీఎం రేవంత్ రెడ్డికే చెల్లిందనే చర్చ జరుగుతోంది.నీటిపారుదల రంగం నుంచి మొదలు ప్రతి శాఖకు సంబంధించి అభివృద్ధి పనుల్లో మహబూబ్ నగర్‌ను దృష్టిలో పెట్టుకుని, పాలమూరు జిల్లా ఫైల్ అనగానే ఏ మాత్రం ఆలోచించకుండా సంతకాలు పెట్టాలని మంత్రులను కోరడం చర్చనీయాంశంగా మారింది. అటు మహబూబ్ నగర్ ప్రజల అభిమానాన్ని సొంతం చేసుకోవడంతో పాటు మిగతా జిల్లాల ప్రజలు కూడా కన్విన్స్ అయ్యేలా రేవంత్ చాతుర్యం ప్రదర్శించారని అంటున్నారు.ఇదే సమయంలో ఏ మంత్రిత్వ శాఖలో తాను తల దూర్చడం లేదని, తన మంత్రి వర్గంలోని మంత్రులందరికి పూర్తి స్వేచ్ఛ ఉందని చెప్పే ప్రయత్నం చేశారట. ఆఖరికి తన జిల్లా అభివృద్ధిపై కూడా మంత్రులదే ఫైనల్ డెసిషన్ అన్నట్లుగా చెప్పుకొచ్చారు ముఖ్యమంత్రి. రేవంత్ రెడ్డి మంత్రులతో సరదాగా మాట్లాడినా.. ఆయన మాటల్లో చాలా అంతర్యం ఉందన్న చర్చ జరుగుతోంది.

## ప్రేమజంట ఆత్మహత్య

గాజువాక షీలానగర్ లో ప్రేమజంట ఆత్మహత్య స్థానికంగా కలకలం రేపింది, వెంకటేశ్వర కాలనీలో ఎస్ఎల్ . బినాయక్ క్లేవ్ అపార్ట్మెంట్ తెల్లవారుజామున అపార్ట్మెంట్ పై నుండి కిందకు దూకి ప్రేమజంట, ఆత్మహత్య చేసుకుంది. అమలాపురంకు చెందిన పిల్లి దుర్గారావు, సాయి సుస్మితగా పోలీసులు గుర్తించారు. మృతుడు దుర్గారావు క్యాటరింగ్ నడుపుతుండగా, మృతురాలు సాయి సుష్మిత ఒక ప్రైవేట్ కంపెనీలో సాఫ్ట్వేర్ ఉద్యోగిగా పని చేస్తున్నట్టు స్థానికులు చెబుతున్నారు. ఆరు నెలలుగా అపార్ట్మెంట్లో ఉంటున్న పిల్లి దుర్గరావు వద్దకి అప్పుడప్పుడు అపార్ట్మెంట్ కు వచ్చి మృతురాలు సాయి సుస్మిత వచ్చి వెళ్తునట్టు సమాచారం. పోలీసులు ప్రాథమిక వివరాలు వెల్లడించారు.మృతులు ఇరువురు మధ్య వాగ్వాదం జరిగినట్టు గుర్తించారు. ఇంట్లో గాజు గ్లాస్, టీవీ రిమోర్ట్ పగిలిపోవడం పోలీసులు గుర్తించారు. మృతురాలు సాయి సుస్మిత కుటుంబ సభ్యులకి పోలీసులు సమాచారం అందించారు, మృతుడు ఫోన్ లాక్ అవ్వడంతో విచారణ చేపట్టారు. .

## ఏడాది ఘనమా...గణమా... , సూపర్ అంటున్న అధికార పార్టీ..

### ఫెయిల్యూర్ స్టోరీస్ అంటున్న ప్రతిపక్షాలు

హైదరాబాద్, డిసెంబర్ 3, రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచింది. ఏడాది పాలనలో సాధించిన రికార్డులు అన్నీ ఇన్నీకావు. ఇప్పటివరకు ఏ ప్రభుత్వాలు చేయని పనులు చేసి చూపించింది. అన్నింటిలో ముఖ్యంగా చెప్పుకోదగినది.

: 40 సంవత్సరాల తర్వాత ఆక్రమణలు పూర్తిగా నిలిపివేశారు. చెరువుల పునరుద్ధరణ చాలా కీలకమైన అంశం. 50 ఏళ్లుగా నిర్లక్ష్యానికి గురైన మూసీ నది పునరుద్ధరణకు ప్రాధాన్యత ఇచ్చింది. వాతావరణ మార్పుల సవాళ్లను ఎదుర్కొనేలా భవిష్యత్తుకు తగ్గట్టుగా మౌలిక వసతుల రూపకల్పన చేపట్టిన దేశంలో ఫస్ట్ నగరం హైదరాబాద్.భారతదేశంలో తొలి పరిశ్రమ ఆధారిత నైపుణ్య విశ్వవిద్యాలయం. దక్షిణ భారత్‌లో అతిపెద్ద క్రీడల విశ్వవిద్యాలయంతోపాటు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500 గ్యాస్ సిలిండర్, 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగానికి ఉచిత విద్యుత్, రైతులకు 247 విద్యుత్ సదుపాయం వంటివి ఇందులో కీలకమైనవిహైదరాబాద్‌లో పెట్రోల్, డీజిల్ బస్సులను పూర్తిగా తొలగించింది. 3,000 వేల విద్యుత్ బస్సులు ప్రవేశపెట్టడం మరో అంశం. బాపూఘాట్‌లో ప్రపంచంలోనే అతిపెద్ద గాంధీ విగ్రహం, 200 ఎకరాల గాంధీ స్మారక నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. హైదరాబాద్ ప్రజల అవసరాల కోసం గోదావరి నుంచి త్రాగు నీరు సరఫరా చేయడం మరో అంశం.మహిళలను కోటీశ్వరులను చేసే లక్ష్యంతో..: భవిష్యత్ నగర ప్రణాళికలు అన్నీఇన్నీకావు. భారత్‌లో అత్యాధునిక నగరంగా హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్‌తో పాటు నాలుగో నగరానికి శ్రీకారం చుట్టింది. రెసిడెన్షియల్ పాఠశాలల పిల్లల కోసం ఆహార, కాస్మెటిక్ ఛార్జీలు పదేళ్ల తర్వాత పెంపు, మహిళా స్వయం సహాయక సంఘాలకు, పారిశ్రామికవేత్తలకు రుణాలు– లక్ష మంది మహిళా కోటీశ్వరులను సృష్టించే లక్ష్యం. సమగ్ర కుల జనగణన ? విధానాలు, కేటాయింపుల సమీక్షలతోపాటు దళిత, గిరిజన, బీసీ మరియు మైనారిటీ విద్యార్థుల కోసం ప్రపంచ స్థాయి రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణం చేస్తోంది. అవినీతితో కూడిన ధరణి పోర్టల్‌ను పూర్తిగా జాతీయ సంస్థ ఔఎఅకి అప్పగించి కీలక మార్పులు చేపట్టింది. ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలను కలుసుకునే అవకాశం, మీడియా స్వేచ్ఛ పునరుద్ధరణ భవిష్యత్ తరాలకు హానికరం కాకుండా మాదక ద్రవ్యాలపై పోరాటం, తొలి ఏడాదిలో గరిష్ఠ పెట్టుబడుల ఆకర్షణ ? విదేశీ, దేశీయ, ప్రజా పెట్టుబడులు.ప్రాంతీయ రింగ్ రోడ్, రింగ్ రైలు ప్రాజెక్టులు, మెట్రో రైలు విస్తరణ ? తదుపరి దశ ప్రారంభం టియర్–2 పట్టణాల్లో పారిశ్రామికాభివృద్ధి మొదలైనవి. వరంగల్ రెండో రాజధానిగా భారీ అభివృద్ధి ప్రాజెక్టులు శ్రీకారం చుట్టింది. ఇందిరమ్మ ఇళ్ళ కోసం 400,000 ఇళ్లకు ఆమోదం తెలిపిన ప్రభుత్వం, రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా ప్రతి వ్యక్తికి రూ. 10 లక్షల విలువైన యూనివర్సల్ హెల్త్‌కేర్ సదుపాయాలు కల్పించింది. ప్రజా వాణిలో 5 లక్షల ప్రజా సమస్యల పరిష్కారం చేపట్టింది. ప్రతి నెల మొదటి తేదీన ప్రభుత్వ ఉద్యోగుల వేతనాలు, పెన్షన్ల చెల్లింపు మరో కీలకమైన అంశం. తెలంగాణ తల్లి విగ్రహం ఆవిష్కరణకు అంతా సిద్ధమైంది. రాష్ట్ర గౌరవం, సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా తయారైంది. ఏ పనైనా ఇంకా పూర్తిగా ఆచరణలోకి రాలేదని... చార్జీషీటుకు ప్రతిపక్షాలు రెడీ అవుతున్నాయి.,

# సినిమా





## మహేష్ డబ్బింగ్ ప్రధాన ఆకర్షణ



మోస్ట్ ఎవైటెడ్ ఫ్యామిలీ ఎంటర్ టైనర్ 'ముఫాసా: ది లయన్ కింగ్' ఈనెల 20న ఇండియాలో ఇంగ్లీష్, హిందీ, తమిళం, తెలుగు భాషలలో విడుదల కానుంది. బారీ జెంకిన్స్ డైరెక్ట్ చేసిన ఈ చిత్రం 2019లో 'లైవ్-యాక్షన్ ది లయన్ కింగ్' బ్లాక్ బస్టర్ విజయాన్ని కొనసాగిస్తూ ప్రేక్షకులని అలరించ బోతోంది. 'ముఫాసా'కి హీరో మహేష్ బాబు వాయిస్ అందించారు. మహేష్ బాబు వాయిస్ ఓవర్‌లో రిలీజైన ట్రైలర్‌కు ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. ఈ నేపథ్యంలో అభిమానులకు స్పెషల్ ట్రీట్ ఇస్తూ మహేష్ బాబు అద్భుతమైన పోస్టర్‌ను నమ్రతా శిరోద్కర్ గ్రాండ్ మీడియా ఈవెంట్‌లో లాంచ్ చేశారు. టాకా పాత్రకు హీరో సత్యదేవ్, టిమోన్ పాత్రకు అలీ, పుంబా పాత్రకు బ్రహ్మానందం, కిరోస్ పాత్రకు అయ్యప్ప పి.శర్మ వాయిస్ అందించారు. నమ్రతా శిరోద్కర్ మాట్లాడుతూ, 'డిస్నీ టీమ్ థ్యాంక్స్. చాలా శ్రద్ధతో ఈ ప్రాజెక్ట్ చేశారు. ఇలాంటి ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్‌ని డబ్ చేయడం ఒక ఛాలెంజ్. ఇది పక్కా ఫ్యామిలీ ఫిల్మ్. ఎమోషనల్ రైడ్. మహేష్ బాబు చాలా ఎంజాయ్ చేస్తూ డబ్బింగ్ చెప్పారు. సినిమా అద్భుతంగా వచ్చింది. తప్పకుండా అందరికీ నచ్చుతుందనే నమ్మకం ఉంది' అని అన్నారు. 'మన వాయిస్ డిస్నీ లైబ్రరీలో ఉండటం అనేది గ్రేట్ ఎచీవ్‌మెంట్. సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు, సరిలేరు నికెవ్వరు వంటి మహేష్‌బాబు చిత్రాల్లో నటించడం, ఇప్పుడు ఆయనతో కలిసి టాకా అనే క్యారెక్టర్‌కి వాయిస్ చెప్పడం చాలా ఆనందంగా ఉంది' అని హీరో సత్యదేవ్ చెప్పారు.

## గిరిజన వేషధారణలో విష్ణు మంచు పిల్లలు



డైనమిక్ హీరో విష్ణు మంచు డ్రీమ్ ప్రాజెక్ట్ అయిన 'కన్నప్ప' చిత్రం నుంచి వస్తున్న ప్రతీ అప్డేట్ ప్రేక్షకుల్లో అంచనాలు పెంచేస్తూనే ఉన్నాయి. భారీ క్రేజీ పాన్-ఇండియా ప్రాజెక్ట్ అయిన 'కన్నప్ప' ఏప్రిల్ 25, 2025న విడుదల కానుంది. ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి సంబంధించిన మరో అప్డేట్‌ను సోమవారం నాడు రిలీజ్ చేశారు. విష్ణు మంచు పిల్లలు అరియానా మంచు, వివియానా మంచు ఫస్ట్ లుక్‌లను విడుదల చేశారు. అంతే కాకుండా సోమవారం విష్ణు మంచు కవల కుమార్తెల పుట్టినరోజులు కావడం కూడా విశేషం. ఈ పోస్టర్‌లో పిల్లలిద్దరూ గిరిజన వేషధారణలో చాలా డిఫరెంట్‌గా కనిపిస్తున్నారు. శ్రీ కాళహస్తి పురాణ కథ ప్రాముఖ్యతను చాటి చెప్పే పాటలో కనిపించనున్నారు. 'పాట పాడినా, నృత్యం చేసినా, ఇది శివుని కోసం' అని ఈ పోస్టర్‌లో చూపించారు. ఈ మేరకు విష్ణు మంచు పోస్ట్ చేస్తూ.. 'పుట్టినరోజు సందర్భంగా నా కుమార్తెల ఫస్ట్‌లుక్‌ను రిలీజ్ చేయడం ఆనందంగా ఉంది. ఈ క్షణంలో నా హృదయం గర్వంతో ఉప్పొంగుతోంది. నా చిన్ని తల్లులు తెరపై సృష్టించే మ్యాజిక్‌ను చూసేందుకు నేను ఎంతగానో ఎదురుచూస్తున్నాను"అని అన్నారు.

## విరహ వేదనలో సారంగపాణి



మోహనకృష్ణ ఇంద్రగంటి దర్శకత్వంలో శ్రీదేవి మూవీస్ పతాకంపై శివలెంక కృష్ణ ప్రసాద్ నిర్మించిన సినిమా 'సారంగపాణి జాతకం'. ప్రియదర్శి, రూప కొడువాయూర్ జంటగా నటించారు. 'జెంటిల్‌మన్', 'సమ్మోహనం' విజయాల తర్వాత మోహనకృష్ణ ఇంద్రగంటి, శివలెంక కృష్ణప్రసాద్ కలయికలో రూపొందుతున్న మూడో చిత్రమిది. ఈనెల 20న థియేటర్లలోకి వస్తుందీ సినిమా. టైటిల్ సాంగ్ 'సారంగో సారంగో' కొన్ని రోజుల క్రితం విడుదలైంది. రెండో పాట 'సంచారి సంచారి'ని సోమవారం విడుదల చేశారు. దర్శకుడు మోహనకృష్ణ ఇంద్రగంటి మాట్లాడుతూ, 'ఎటువంటి కథలోనైనా భావోద్వేగం లేకపోతే ఆ కథకు పరిపూర్ణత ఉండదు, 'సారంగపాణి జాతకం' లాంటి పూర్తి నిడివి హాస్యరస చిత్రంలో కూడా! ముఖ్యంగా ఈ సినిమాలో ప్రధానమైన అంశం ప్రేమ. తాను ప్రాణంగా ప్రేమించిన అమ్మాయికి, తన నమ్మకానికి మధ్య నలిగిపోయిన వ్యక్తి కథే ఈ సినిమా. 'సంచారి' అనే పాట తన నమ్మకం వల్ల తాను ప్రాణంగా ప్రేమించే అమ్మాయిని కోల్పోయే సందర్భంలో వస్తుంది. కొంత విరహ వేదన, కొంత ఆ అమ్మాయిని కోల్పోతాననే తపన - వేదన మేళవించిన గీతమిది. ద్వితీయార్థంలో కీలకమైన సందర్భంలో వచ్చిన తర్వాత కథ గమనాన్ని మారుస్తుంది. అమ్మాయిని పొందాలనే అతని కోరికను బలంగా మార్చి, ఆఖరి ఆటంకాన్ని ఎదుర్కోవడానికి ప్రేరేపిస్తుంది. ఈ పాటకు కథలో మంచి ప్రాముఖ్యం ఉంటుంది. నాకు చాలా చాలా ఇష్టమైన పాటల్లో ఇదొకటి. సంజీత్ హెగ్డే అద్భుతంగా పాడిన పాట. రామజోగయ్య శాస్త్రి ఎంత బాగా రాస్తారో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. సంగీత దర్శకుడు వివేక్ సాగర్ శైలి గుర్తొచ్చే పాట ఇది. ప్రియదర్శి, రూప నటన కూడా బావుంటుంది. నాకు ఇష్టమైన పాట ప్రేక్షకులకు కూడా దగ్గర అవుతుందని నమ్ముతున్నాను' అని అన్నారు.

## నటనకు విరామం



12th ఫెయిల్' చిత్రంతో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందారు బాలీవుడ్ నటుడు విక్రాంత్ మాస్సే. తాజాగా ఆయన ఓ ప్రకటన చేశారు. తాను కొంత కాలం పాటు కొత్త సినిమాలు చేయలేనంటూ విరామం ప్రకటించారు. దీనిపై ఇన్‌స్టా వేదికగా ఓ నోట్ విడుదల చేశారు. 'కొన్ని సంవత్సరాలుగా అందరి నుంచి అసాధారణమైన ప్రేమను, అభిమానాన్ని పొందుతున్నాను. మీ అందరి మద్దతుకు ధన్యవాదాలు. కుటుంబ సభ్యులకు నా పూర్తి సమయాన్ని కేటాయించాల్సిన టైమ్ వచ్చింది. అందుకే సినిమాలను ఇక అంగీకరించడం లేదు. మళ్లీ సరైన సమయం వచ్చేంతవరకు.. 2025లో విడుదల కానున్న సినిమానే నా చివరి సినిమా. ఇటీవల నేను నటించిన చిత్రాలపై మీరు చూపిన ఆదరాభిమానాలు మర్చిపోలేను. అందరికీ కృతజ్ఞతలు' అని నోట్‌లో పేర్కొన్నారు. విక్రాంత్ మాస్సే సీరియల్స్‌తో కెరీర్ మొదలుపెట్టారు. 'బాలికా వధూ' (చిన్నారి పెళ్లికూతురు)తో అందరికీ అభిమాన నటుడిగా మారారు. 2017లో 'ఎ డెత్ ఇన్ ది గంజ్'తో వెండితెరపై హీరోగా కనిపించి అలరించారు. ఇటీవల జరిగిన 'ఇఫీ' వేడుకల్లోనూ అరుదైన గౌరవాన్ని సొంతం చేసుకున్నారు.

## కంటెంటే సూపర్‌స్టార్

పి.ఎన్.బి సినిమాస్ బ్యానర్ పై రూపొందురన్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'డియర్ కృష్ణ'. ఈ సినిమా ద్వారా పీఎన్ బలరామ్ రచయితగా, నిర్మాతగా పరిచయమవుతున్నారు. దినేష్ బాబు స్క్రీన్ ప్లే, డైలాగ్స్ అందించడంతో పాటు దర్శకత్వం వహిస్తున్నారు. అక్షరు హీరోగా పరిచయం అవుతున్న ఈ చిత్రంలో 'ప్రేమలు' చిత్ర ఫేమ్ మమిత బైజు హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఐశ్వర్య కూడా మరో హీరోయిన్. ప్రచార చిత్రాలతో, లక్ష రూపాయల కాంటెస్ట్‌తో ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించిన ఈ సినిమాపై మంచి అంచనాలు ఉన్నాయి. రచయిత, నిర్మాత పి.ఎన్. బలరామ్ మాట్లాడుతూ, 'నేను ఈ సినిమాకి నిర్మాతగా భావించట్లేదు. కృష్ణుడి సందేశాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తున్న వ్యక్తిగానే భావిస్తు న్నాను. కృష్ణుడి వల్ల మా కుటుంబంలో జరిగిన మిరాకిల్‌నే కథగా తీసుకున్నాం. అదేంటంటే మా అబ్బాయి అక్షరు అత్యంత అరుదైన డిసీజ్ నుంచి, డాక్టర్లే ఆశ్చర్యపోయేలా ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. ఈ సినిమాలో అక్షరునే హీరోగా నటించాడు. ఈ చిత్రం కోసం మేం స్టార్స్‌ని తీసుకోవాలి అనుకోలేదు. ఎందుకంటే కృష్ణుడే సూపర్‌స్టార్, కంటెంటే సూపర్ స్టార్' అని అన్నారు. 'మా కుటుంబానికి, కృష్ణుడికి మధ్య నడిచే ప్రేమ కథే ఈ చిత్రం. మా నాన్న నాకు జన్మని ఇవ్వడమే కాదు, పునర్జన్మను కూడా ఇచ్చారు. ఆయన వల్లే నేను ఈరోజు ఇలా మీ ముందు ఉన్నాను. ఈ సినిమా తప్పకుండా మీ అందరికీ నచ్చుతుంది' అని హీరో అక్షరు తెలిపారు.

## గ్రాండ్‌గా ఫిలింఫేర్ షార్ట్ ఫిలిం వేడుకలు




2024 ఫిల్మ్‌ఫేర్ ఓటీటీ అవార్డుల వేడుక ఆదివారం రాత్రి ముంబయిలో వైభవంగా జరిగింది. అయితే ఈ వేడుకలలో సాయిదుర్గ తేజ్, స్వాతి రెడ్డి కాంబోలో వచ్చిన "సత్య" షార్ట్ ఫిలిం పీపుల్స్ ఛాయిస్ అవార్డును గెలుచుకుంది. ఈ కార్యక్రమంలో ఇండియన్ ఫిల్మ్ ఇండిస్ట్రీకి చెందిన సినీ ప్రముఖులు హాజరయ్యారు. వివిధ కారణాల వలన నేరుగా ఓటీటీలో విడుదలైన సినిమాలు, వెబ్ సిరీస్‌లలో అద్భుత నటన ప్రదర్శించిన నటీనటులు, టెక్నిషియన్స్ కు ఈ అవార్డులను ప్రకటించారు. సినిమా విభాగంలో ఉత్తమ నటిగా బాలీవుడ్ భామ కరీనా కపూర్, ఉత్తమ నటుడిగా దిల్జిత్ దొసాంజ్ అవార్డు గెలుచుకోగా, ఉత్తమ సిరీస్ గా రైల్వేమెన్ అవార్డు గెలుచుకుంది. ఈ వేడుకలోనే టాలీవుడ్ నటుడు సాయిదుర్గా తేజ్, స్వాతి నటించిన షార్ట్ ఫిల్మ్ 'సత్య' అవార్డు గెలుచుకుంది. హార్ట్ టచింగ్ షార్ట్ ఫిలింగా అందరి ప్రశంసలు పొందింది సుప్రీమ్ హీరో సాయిదుర్గ తేజ్ నటించిన "సత్య". ఈ షార్ట్ ఫిలిం ఫిలింఫేర్ షార్ట్ ఫిలిం అవార్డ్స్ 2024లో పీపుల్స్ ఛాయిస్ కేటగిరిలో అవార్డు గెల్చుకుంది. ఈ అవార్డు గెల్చుకున్న హ్యాపీ మూవ్ మెంట్ ను టీమ్ సోషల్ మీడియా ద్వారా షేర్ చేస్తూ ' సత్య ప్రజల కోసం రూపొందించబడిన ఒక అందమైన కథ, ఫిలింఫేర్ పీపుల్స్ ఛాయిస్ బెస్ట్ షార్ట్ ఫిల్మ్ 2024 అవార్డుతో ప్రజలతో రివార్డ్ చేయబడింది. నలుగురు స్నేహితులు కలిసి మొదలు పెట్టిన ఈ ప్రయాణం జీవితాంతం నిలిచిపోయే జ్ఞాపకాలను అందించింది, అందరికి ధన్యవాదాలు' అని సాయి ట్వీట్ చేశారు. "సత్య" షార్ట్ ఫిలింలో స్వాతి రెడ్డి హీరోయిన్ గా నటించింది. హర్షిత్, హన్షిత నిర్మాతలుగా వ్యవహరించారు. విజయకృష్ణ వీకే దర్శకత్వం వహించారు. మ్యూజికల్ షార్ట్ ఫిలింగా "సత్య" ప్రేక్షకులకు మంచి అనుభూతిని ఇచ్చింది.

## రాంగోపాల్ వర్మకు హైకోర్టు బిగ్ రిలీఫ్



గత వైసిపి ప్రభుత్వ హయాంలో వైఎస్ జగన్‌పై తీసిన 'వ్యూహం' చిత్రం ప్రమోషన్‌లో భాగంగా విపక్ష నేతలుగా ఉన్న చంద్రబాబు, పవన్ కళ్యాణ్, నారా లోకేష్‌పై అనుచిత పోస్టులు పెట్టిన విషయంలో టాలీవుడ్ దర్శకుడు రాంగోపాల్ వర్మకు సోమవారం తాత్కాలిక ఊరట లభించింది. తనను అరెస్టు చేసేందుకు ఏపి పోలీసులు ప్రయత్నిస్తున్న నేపథ్యంలో ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన ఏపి హైకోర్టు వచ్చే వారం వరకూ అరెస్టు కాకుండా ఉత్తర్వులు ఇచ్చింది. వర్మ సోషల్ మీడియా పోస్టులపై ప్రకాశం జిల్లా మద్దిపాడుతో పాటు ఇతర ప్రాంతాల్లో కేసులు నమోదైన నేపథ్యంలో ఆయన తనను అరెస్టు చేయకుండా ఉత్తర్వులు కోరుతూ హైకోర్టును ఆశ్రయించారు. అయితే హైకోర్టు మాత్రం అరెస్టు చేయకుండా ఉత్తర్వులు ఇవ్వలేమని, కావాలంటే ముందస్తు బెయిల్ పిటిషన్ వేసుకోవాలని సూచించింది. దీంతో ఆయన ముందస్తు బెయిల్ పిటిషన్ వేయడంతో పాటు ఈ కేసులన్నీ కొట్టేయాలని క్వాష్ పిటిషన్ కూడా వేశారు. ఈ పిటిషన్లపై సోమవారం హైకోర్టులో విచారణ జరిగింది. ఇందులో ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణ మాత్రం వచ్చే సోమవారానికి వాయిదా పడింది. అప్పటివరకు వర్మపై ఎటువంటి చర్యలు తీసుకోవద్దంటూ కోర్టు ఆదేశాలు ఇచ్చింది. రామ్‌గోపాల్‌వర్మ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు ఇచ్చింది. ఈ నెల 9 లోగా కౌంటర్ దాఖలకు ప్రభుత్వానికి సమయం ఇచ్చింది. ప్రభుత్వం దాఖలు చేసే కౌంటర్ ఆధారంగా వచ్చే సోమవారం వర్మ అరెస్టుతో పాటు బెయిల్ వ్యవహారం కూడా తేలనుంది.

# కొనసాగుతున్న ఫెంగల్ తుపాను బీభత్సం



చెన్నై : తమిళనాడు, పుదుచ్చేరిలో ఫెంగల్ తుపాను బీభత్సం కొనసాగుతోంది. తమిళనాడులో తిరువన్ణమలై పట్టణం అన్నమలైయార్ హిల్ వద్ద ఆదివారం సాయంత్రం నివాస భవనంపై కొండచరియలు విరిగిపడ్డాయి. ఆ సమయంలో భవనంలో ఉన్న ఏడుగురిలో ఐదుగురి మృతదేహాలను సోమవారం వెలికితీశారు. మిగిలిన వారి కోసం గాలింపు కొనసాగుతోంది. మృతుల్లో ఒక మహిళ, ఒక చిన్నారి ఉన్నారు. స్థానికుల సమాచారం ప్రకారం ఈ భవనంలో రాజ్‌కుమార్, మీనా దంపతులు తమ ఇద్దరు పిల్లలతో కలిసి ఉంటున్నారు. మీనా సోదరుడి మరో ముగ్గురు పిల్లలు కూడా వీరితో కలిసి ఉంటున్నారు. ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలతో పాటు స్థానిక పోలీసులు, ఫైర్ సిబ్బంది సహాయక కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. చెన్నై ఐఐటికి చెందిన సాంకేతిక నిపుణులు కూడా వీరికి సహాయం చేస్తున్నారు. తమిళనాడు నీలగిరి జిల్లా ఊటీ నొండిమేడు వద్ద భారీ వర్షాల కారణంగా బలహీనపడిన ఇళ్లు సోమవారం తెల్లవారుజామున కూలిపోయిందని, ప్రమాదంలో 45 ఏళ్ల ఆరుముగం మరణించాడని అధికారులు తెలిపారు. తమిళనాడులోని విల్లుపురం, కళ్లకురిచ్చి, తిరువణ్ణామలై జిల్లాల్లో దాదాపు 1,29,000 హెక్టార్లలో పంటలు నీట మునిగాయని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ సోమవారం తెలిపారు. తుపాను నష్టంపై సమగ్ర నివేదికను కేంద్రానికి సమర్పిస్తామని, నష్టపోయిన వారందరికీ సాయం అందిస్తామని చెప్పారు. రాష్ట్రంలో సోమవారం కూడా వర్షాలు కురిసాయి. విల్పురం జిల్లాలో వరదలు సంభవించాయి. వంతెనలు, రోడ్లు మునిగిపోయాయి. రైల్వే ట్రాక్‌లపై నీరు నిలిచిపోవడంతో కొన్ని రైళ్లను రద్దు చేశారు. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. క్రిష్ణగిరి జిల్లా ఊతరగరై, పోచంపల్లి తాలుకాల్లో భారీ వర్షాలకు రోడ్లపై నీరు ఉధృతంగా ప్రవహించింది. జాతీయ రహదారులకు అనుసంధానం తెగిపోయింది. ఉత్తంగరై హైవేపై పక్కన నిలిపి ఉంచిన బస్సులు వరద నీటిలో కొట్టుకుపోయాయి. ఈ రెండు తాలుకాల్లో మంగళవారం కూడా విద్యా సంస్థలకు సెలవు ప్రకటించారు. ఈ జిల్లాల్లో అన్నామలై యూనివర్శిటీ పరీక్షలను వాయిదా వేసింది. పుదుచ్చేరిలోనూ వర్షాల కారణంగా నలుగురు మరణించారని ముఖ్యమంత్రి ఎన్ రంగసామి తెలిపారు. మృతుల కుటుంబాలకు ఒక్కొరికి రూ 5 లక్షల చొప్పున పరిహారం అందజేస్తామని చెప్పారు. ప్రజా పంపిణీ వ్యవస్థ కింద 3.54 లక్షల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5 వేలు సహాయం అందజేస్తామని ప్రకటించారు. బ్యాంక్ ఖాతాలకు నేరుగా జమ చేస్తామని తెలిపారు. ఈ నెల 3, 5 తేదీల్లో జరగాల్సిన పరీక్షలను పుదుచ్చేరి యూనివర్శిటీ రద్దు చేసింది. తాజా తేదీలను త్వరలో ప్రకటిస్తామని అసిస్టెంట్ రిజిస్ట్రార్ తెలిపారు. ఈ నెల 6 నుంచి జరగాల్సిన పరీక్షలు యథావిధిగా జరుగుతాయని చెప్పారు.

# కొనసాగుతున్న 'మహా' ప్రతిష్టంభన

ముంబయి : మరాఠా పీఠంపై కొనసాగుతున్న ప్రతిష్టంభన సోమవారం పదో రోజుకు చేరింది. బుధవారం జరిగే పార్టీ శాసనసభాపక్ష సమావేశానికి పరిశీలకులుగా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి విజరు రూపానీని బిజెపి అధిష్టానం ముంబయి పంపుతోంది. అనారోగ్యంతో బాధపడుతున్న ఆపద్ధర్మ ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిండే తన షెడ్యూల్ సమావేశాలను రద్దు చేసుకున్నారు. మరో కీలక నేత, ఎన్‌సిపి అధినేత అజిత్ పవార్ మహారాష్ట్రలో ప్రభుత్వ ఏర్పాటుపై, మంత్రుల శాఖలపై బిజెపి నాయకత్వంతో చర్చలు జరిపేందుకు ఢిల్లీ వెళ్లారు. ముఖ్యమంత్రి పదవిని ఆశిస్తున్న బిజెపి సీనియర్ నేత దేవేంద్ర ఫడ్నవీస్ ఆపద్ధర్మ ముఖ్యమంత్రి షిండేకు ఫోన్ చేసి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ముఖ్యమంత్రి పదవికి ఫడ్నవీస్ పేరు ఖరారైందని బిజెపి సీనియర్ నేత ఒకరు పిటిఐ వార్తాసంస్థకు తెలిపారు. ముంబయిలోని ఆజాద్ మైదాన్‌లో ఈ నెల ఐదవ తేదీన ప్రభుత్వ ప్రమాణస్వీకార కార్యక్రమం ఉంటుందని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్ బవన్‌కులే ప్రకటించారు. ఏక్‌నాథ్ షిండే గొంతు ఇన్‌ఫెక్షన్, జ్వరంతో బాధపడుతుండడంతో సోమవారం జరగాల్సిన మహాయుతి నేతల భేటీ వాయిదా పడింది. ఆయన ఇంకా సతారాలోని తన స్వగ్రామంలోనే ఉన్నారు. మహాయుతి నేతలు మంగళవారం సమావేశమై మంత్రుల శాఖల కేటాయింపుపై ఓ నిర్ణయానికి వస్తారని సమాచారం. ఉప ముఖ్యమంత్రి పదవి కావాలని డిమాండ్ చేస్తున్నట్లు వస్తున్న వార్తలను షిండే కుమారుడు, శివసేన ఎంపీ శ్రీకాంత్ షిండే తోసిపుచ్చారు. ఈ వార్తలు నిరాధారమని అంటూ మంత్రి పదవికి తాను పోటీలో లేనని స్పష్టం చేశారు.

# గినియా ఫుట్‌బాల్ మ్యాచ్‌లో ఘర్షణలు



గినియా : దక్షిణ గినియాలోనే అతిపెద్ద నగరమైన నజెరెకొరెలో సాకర్ మ్యాచ్ సందర్భంగా జరిగిన ఘర్షణలు, తొక్కిసలాటలో పిల్లలతో సహా డజన్ల సంఖ్యలో అభిమానులు మరణించారు. మ్యాచ్ చూసేందుకు వచ్చిన అభిమానులతో స్టేడియం కిక్కిరిసిపోయింది. ఆ సమయంలో చెలరేగిన ఘర్షణలను అదుపు చేసేందుకు భద్రతా బలగాలు ప్రయత్నించాయి. దాంతో చోటుచేసుకున్న తొక్కిసలాటలో భారీగా ప్రాణ నష్టం సంభవించిందని స్థానిక మీడియా, రాజకీయ పార్టీల కూటమి వెల్లడించింది. స్థానిక కాలమానం ప్రకారం ఆదివారం మధ్యాహ్నం (డిసెంబరు 2వ తేదీ) ఈ తొక్కిసలాట జరిగిందని గినియా ప్రధాని అమడవు ఒరి బా%ఎ% ఎక్స్‌లో తెలిపారు. ఎంతమంది మరణించారనే సంఖ్యను నిర్దిష్టంగా వెల్లడించలేదు. అధికారులు ఆ ప్రాంతంలో శాంతి భద్రతలను పునరుద్ధరించేందుకు ప్రయత్నిస్తున్నారని బా%ఎ% తెలిపారు. డజన్ల సంఖ్యలో మరణాలు సంభవించాయని, పదుల సంఖ్యలో గాయపడ్డారని రాజకీయ పార్టీల కూటమి నేషనల్ అలయన్స్ ఫర్ అల్టర్‌నేషన్ అండ్ డెమోక్రసీ ఒక ప్రకటనలో తెలిపింది. స్థానిక మీడియా కథనం ప్రకారం సాకర్ మ్యాచ్‌లో వివాదాస్పద పెనాల్టీ విషయం అభిమానులకు ఆగ్రహం తెప్పించింది. కొందరు రాళ్లు విసిరారు. దీంతో, భద్రతా బలగాలు బాష్పవాయు గోళాలను ప్రయోగించాయి. ఈ ఘటనలో పిల్లలుసహా చాలామంది చనిపోయారు. సమీపంలోని ఆస్పత్రిలో గాయపడిన వారు చికిత్స పొందుతున్నారని, వారిలో కొంతమంది పరిస్థితి విషమంగా వుందని సంబంధిత వర్గాలు తెలిపాయి.

# తుఫాను బాధితులను ఆదుకుంటాం



న్యూఢిల్లీ : ఫెంగల్ తుఫాను తమిళనాడుని అతలాకుతలం చేసింది. ఈ తుఫాను వల్ల 14 జిల్లాల్లో 1.5 కోట్ల మంది ప్రజలపై ప్రభావం చూపిందని, 2.11 లక్షల హెక్టార్లలో పంట నష్టం జరిగిందని, మౌలిక వసతులు పూర్తిగా దెబ్బతిన్నాయని వీటి పునరుద్ధరణకు పునరావాసాల పనుల కోసం నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫండ్ (ఎన్‌డిఆర్‌ఎఫ్) నుండి రెండు వేల కోట్ల రూపాయలను విడుదల చేయాలని ప్రధాని నరేంద్ర మోడీని తమిళనాడు సిఎం స్టాలిన్ కోరారు. ఆయన మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు. ఈ తుఫాను వల్ల జరిగిన నష్టాన్ని సమగ్రంగా అంచనా వేయడానికి కేంద్ర బృందాన్ని నియమించాలని స్టాలిన్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోడీ మంగళవారం తమిళనాడు సిఎం ఎం.కె స్టాలిన్‌కు ఫోన్ చేశారు. ఫెంగల్ తుఫాను వల్ల నష్టపోయిన తమిళనాడుకు అన్నివిధాలా సాయం అందిస్తామని మోడీ స్టాలిన్‌కు హామీ ఇచ్చారు. కాగా, భారీ వర్షాల కారణంగా తమిళనాడులోని నీలగిరి జిల్లాలోని అన్ని పాఠశాలనను మూసివేస్తున్నట్లు ఆ జిల్లా మెజిస్ట్రేట్ లక్ష్మీ భవ్య మంగళవారం తెలిపారు.

# తీవ్ర ఆందోళనకర అంశం

అగర్తలాలోని బంగ్లాదేశ్ అసిస్టెంట్ హై కమిషన్ కార్యాలయంలో భద్రతా నిబంధనలను ఉల్లంఘించి ఆందోళనకారులు ప్రవేశించడాన్ని 'తీవ్ర ఆందోళన కలిగించే సంఘటన' గా విదేశాంగ శాఖ సోమవారం వ్యాఖ్యానించింది. ఎలాంటి పరిస్థితుల్లోనూ దౌత్య, కాన్సులర్ కార్యాలయాలు దాడులకు లక్ష్యంగా కాకూడదని పేర్కొంది. దౌత్య కార్యాలయాల పవిత్రతను పరిరక్షించడానికి భారత్ కట్టుబడి వుందని విదేశాంగ శాఖ పునరుద్ఘాటించింది. ఈ పరిస్థితుల్లో భారత్‌లోని బంగ్లాదేశ్ దౌత్య కార్యాలయాలకు భద్రతను పెంచుతామని హామీ ఇచ్చింది. ఈ మేరకు విదేశాంగ శాఖ ఒక ప్రకటన జారీ చేసింది. గత నెల 25న ఇస్కాన్ నేత చిన్మరు దాస్‌ను అరెస్టు చేయడంపై హిందూసంఘర్ష్ సమితికి చెందిన ఆందోళనకారులు సోమవారం అగర్తలాలో అసిస్టెంట్ హై కమిషన్ కార్యాలయంలోకి బలవంతంగా చొరబడ్డారు. బంగ్లాదేశ్ జాతీయ పతాకాన్ని లాగివేసి, అక్కడున్న దౌత్య కార్యాలయ బోర్డును ధ్వంసం చేశారు. కొంతమంది నేతలు అసిస్టెంట్ హై కమిషనర్‌కు మెమొరాండం అందచేశారు. ఈలోగా భద్రతా సిబ్బంది వచ్చి బయటకు పంపివేశారు.

# రెండు కేసుల్లో కుమారుడికి బైడెన్ క్షమాభిక్ష



వాషింగ్టన్ : పలు కేసుల్లో చిక్కుకున్న తన కుమారుడు హంటర్ బైడెన్‌కు అధ్యక్షుడు జో బైడెన్ సోమవారం క్షమాభిక్ష ప్రకటించారు. తాను అధ్యక్షుడిగా వున్నా న్యాయ వ్యవస్థ వ్యవహారాల్లో జోక్యం చేసుకోబోనని ప్రకటించిన బైడెన్, కుమారుడిపై కేసులు విచారణ, శిక్ష విధింపు సమయాల్లో మౌనంగా వున్నారు. తాజాగా ఆయన తన హామీని ఉల్లంఘించారు. మరికొన్ని వారాల్లో పదవి నుండి వైదొలగనున్న నేపథ్యంలో ఈ చర్య తీసుకున్నారు. ఒక తండ్రిగా, అధ్యక్షుడిగా తాను ఈ చర్య ఎందుకు తీసుకున్నానో ప్రజలు అర్థం చేసుకుంటారని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం సాయంత్రం ఆయన ఒక ప్రకటన జారీ చేశారు. న్యాయ వ్యవస్థలో తనకు విశ్వాసం వుందని, అయితే మురికి రాజకీయాలు ఆ ప్రక్రియను దెబ్బ తీశాయని, అందువల్ల న్యాయం జరగలేదని వ్యాఖ్యానించారు. తన రాజకీయ ప్రత్యర్థులు దురుద్దేశపూరితంగా ఈ అభియోగాలు మోపారని, తనను దెబ్బ తీయాలన్నది వారి లక్ష్యంగా వుందని పేర్కొన్నారు. అక్రమంగా ఆయుధాలు కలిగివుండడం, పన్నులను ఎగవేయడం వంటి కేసుల్లో జూనియర్ బైడెన్‌పై డెల్వార్, కాలిఫోర్నియాల్లో అభియోగాలు నమోదయ్యాయి.

# ఏడు కొత్త కేసుల్లో ఇమ్రాన్ ఖాన్‌కు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్



ఇస్లామాబాద్ : పాకిస్తాన్ తెహ్రీక్-ఇ-ఇన్సాఫ్ (పిటిఐ) పార్టీ ఇటీవల నిర్వహించిన ఆందోళనలు, నిరసనలకు సంబంధించి నమోదైన ఏడు కొత్త కేసుల్లో మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌కు తీవ్రవాద నిరోధక కోర్టు 14రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. మరో కేసులో ఆరు రోజులపాటు విధించిన పోలీసు రిమాండ్‌ను పూర్తి చేసిన అనంతరం ఖాన్‌ను అడియాలా జైలుకు తీసుకువచ్చి జడ్జి ముందు ప్రవేశపెట్టారు. విచారణ పూర్తి చేసిన న్యాయమూర్తి అంజాద్ అలీ షా, న్యూ టౌన్ పోలీసు స్టేషన్ కేసుతోపాటు మరో ఆరు కేసుల్లో ఖాన్ జ్యుడీషియల్ రిమాండ్‌ను ఆమోదించారు. గతేడాది పాకిస్తాన్ ఆర్మీ హెడ్‌క్వార్టర్స్‌పై దాడికి సంబంధించి ఖాన్‌ను అరెస్టు చేశారు. మిగిలిన ఆరు కేసుల్లో ఖాన్ భౌతిక రిమాండ్ కోసం పోలీసులు అభ్యర్థించినా న్యాయమూర్తి తిరస్కరించారు. ఈ కేసులన్నీ సెప్టెంబరు 28, అక్టోబరు 5 మధ్యే నమోదయ్యాయి. గత నెల్లో రెండవ తోషఖానా కేసులో ఆయనకు బెయిల్ లభించిన తర్వాత న్యూ టౌన్ పోలీసు స్టేషన్ కేసులో రావల్పిండి పోలీసులు ఖాన్‌ను అరెస్టు చేశారు. అవిశ్వాస తీర్మానంతో 2022లో ఖాన్ ప్రభుత్వం పడిపోయినప్పటి నుండి ఆయనపై డజన్ల కొద్దీ కేసులు నమోదవుతునే వున్నాయి.


# కావాలనే మానవతా సాయాన్ని అడ్డుకుంటున్న ఇజ్రాయిల్



గాజా : పాలస్తీనియన్ల కోసం గాజాలోకి వస్తున్న మానవతా సాయాన్ని కావాలనే ఇజ్రాయిల్ అడ్డుకుంటోందని నార్వే శరణార్థుల మండలి విమర్శించింది. ప్రతి వారం గాజాకు 25 ట్రక్కుల వరకు సరఫరాలు అవసరం కాగా, కేవలం 10 లేదా 11 ట్రక్కులు మాత్రమే వస్తున్నాయని తెలిపింది. ప్రతి వారం గాజాలోకి చాలా తక్కువగా సహాయక ట్రక్కులు ప్రవేశించేలా చూస్తూ, ప్రజలను చలిలో వుంచి, ఆకలి దప్పులతో మరణించేలా చూడడం ఇజ్రాయిల్ లక్ష్యంగా వుందని విమర్శించింది. వరుసగా సహాయ కాన్వారులపై దాడులు కొనసాగుతుండడంతో ప్రస్తుతానికి సహాయం పంపడాన్ని ఆపివేస్తున్నట్లు ఐక్యరాజ్య సమితి పాలస్తీనా శరణార్థుల సంస్థ పేర్కొంది. ఈ పరిస్థితుల్లో రాఫా సరిహద్దు క్రాసింగ్‌ను తిరిగి తెరిపించే ప్రతిపాదనపై కైరోలో ప్రత్యర్థి పాలస్తీనా గ్రూపులు ఫతా, హమాస్ చర్చిస్తున్నాయి. మరోవైపు ఉత్తరాన జాబాలియా శరణార్థ శిబిరంపై, దక్షిణాన అబసన్ అల్ కబీరా శిబిరంపై దాడులు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం గాజాలో సగటున ప్రపంచంలోనే ఎక్కడా లేని రీతిలో బాల వికలాంగులు వున్నారని ఐక్యరాజ్య సమితి ప్రకటించింది. ఏడాదికి పైగా కొనసాగుతున్న దాడుల కారణంగా గాజాలో లక్షల సంఖ్యలో చిన్నారులు అవయవాలు కోల్పోయి జీవచ్ఛవంగా బతుకీడుస్తున్నారని పేర్కొంది. చాలామందికి అనస్తీషియా లేకుండానే సర్జరీలు చేయాల్సిన పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయని, చిన్నారుల బాధలు వర్ణనాతీతమని యుఎన్ చీఫ్ గుటెరస్ వ్యాఖ్యానించారు. ఆయన వ్యాఖ్యలను కైరో కాన్ఫరెన్స్‌లో ఆయన డిప్యూటీ చదివి వినిపించారు.

## విష జ్వరాల భారీ నుండి కాపాడండి డ్రైనేజీ లైన్ మంజూరు చేయండి..సీనియర్ జర్నలిస్ట్ ఏ విజయేందర్ రెడ్డి





రామంతాపూర్ బాగయత్ బాలకృష్ణ నగర్ కాలనీలో డ్రైనేజీ సమస్య రోజు రోజుకి తీవ్రత అవ్వడంతో కాలనీవాసులు విష జ్వరాలు బారిన పడుతున్నారని డ్రైనేజీ లైను లేక సెప్టిక్ ట్యాంక్ నుంచి డ్రైనేజీ నీరు రోడ్డుపై పారుతున్నాయని హైదరాబాద్ ఇన్చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ కు వివరించారు వెంటనే జలమండలి ఎండి అశోక్ రెడ్డి కి తక్షణమే బాలకృష్ణ నగర్ కాలనీకు డ్రైనేజీ లైన్ మంజూరు చేయాలని ఆదేశాలు జారీ చేశారు ఈ కార్యక్రమంలో పోరెడ్డి మహేశ్వర్ రెడ్డి,నాగేష్, రఫిక్, క్రిష్ణ ,సీనియర్ జర్నలిస్ట్ ఏ.విజయేందర్ రెడ్డి పాల్గొన్నారు

## పట్టణ దినోత్సవం సందర్భంగా నకిరేకల్ పట్టణంలోని మెయిన్ సెంటర్ నందు ర్యాలీ



**నకిరేకల్ప్రజాబలం ప్రతినిధి:** మంగళవారం నాడు ప్రజా పాలన విజయోత్సవాలలో భాగంగా పట్టణ దినోత్సవం సందర్భంగా నకిరేకల్ పట్టణంలోని మెయిన్ సెంటర్ నందు ర్యాలీ నిర్వహించిన, అనంతరం పట్టణంలోని శకుంతల పంక్షన్ హాల్ లో నిర్వహించిన ఇందిరా మహిళా శక్తి పథకం మహిళా సంఘాలకు చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న., నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ చైర్మన్ చెవుగోని రజిత – శ్రీనివాస్, %PACS% చైర్మన్ నాగులవంచ వెంకటేశ్వర్లు, మున్సిపాలిటీ కమిషనర్, స్థానిక కౌన్సిలర్లు, మహిళలు తదితరులు పాల్గొన్నారు..



ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ :-

ఈ రాష్టంలో గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో వచ్చింది ఇందిరమ్మ రాజ్యం..

585 సంఘాలకు

ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీ రుణాలు ఇప్పుడు మీకు అందిస్తున్నాం....!!

ఇందిరమ్మ రాజ్యం వస్తే వడ్డీ లేని రుణాలు ఇస్తాం అనీ ఆనాడు ఎన్నికల హామీ ఇవ్వడం జరిగింది నేడు అమలు చేసున్నాము

ఇందిరమ్మ రాజ్యంలో మహిళలను శక్తి వంతం చేయడమే ప్రభుత్వ లక్ష్యం



కేసీఆర్ 10 సంవత్సరాల్లో 7 లక్షల కోట్ల అప్పు చేశారు

మహిళకు ఉచితంగా బస్సు, 500 గ్యాస్, 200 యునిట్ కరెంట్ లాంటి హామీలు అమలు చేస్తున్నాం

కేసీఆర్ 10 సంవత్సరాల పరిపాలనలో డబల్ బెడ్రూమ్ ఇండ్లు, రేషన్ కార్డులు, కొత్త పెన్షన్లు ఇవ్వలేదు

మన నియోజకవర్గంకి 3500 ఇండ్లలను కేటాయించడం జరిగింది

మీకు ఒక మహిళ శక్తి బిల్డింగ్ కూడా త్వరలో మంజూరు చేస్తాను

త్వరలో 100 పడకల ఆసుపత్రిని ప్రారంభిస్తాం

గతంలో 5 లక్షల వరకు రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం ఉండేది నేడు అది 10 లక్షల వరకు ఇస్తున్నాం..

## ఈ.వి.ఎం.భద్రతపై కట్టుదిట్టమైన చర్యలు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్




**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి డిసెంబర్ 03 :** మంచిర్యాల జిల్లాలోని హాజీపూర్ మండలం ముల్కల్లలో గల ఐజా ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్ల వద్ద భద్రతా ఏర్పాట్లను హాజీపూర్ మండల తహశిల్దార్ శ్రీనివాస్ రావు దేశ్పాండేతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గం, మంచిర్యాల,బెల్లంపల్లి, చెన్నూర్ అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్ల వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయడం జరిగిందని, సి.సి.కెమెరాల ద్వారా పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



నల్లగొండ జిల్లా :-తెలంగాణ మలిదశ ఉద్యమ తొలి అమరుడు శ్రీకాంత్ చారి వర్ధంతి సందర్భంగా నకిరేకల్ పట్టణంలోని మెయిన్ సెంటర్ నందు వారి చిత్రపటానికి పూలమాలవేసి ఘనమైన నివాళులర్పించిన., నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

## దివ్యాంగుల సంక్షేమం దిశగా ప్రత్యేక చర్యలు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి డిసెంబర్ 03 :** దివ్యాంగుల సంక్షేమం దిశగా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలోని నస్పూర్లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా మహిళ, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా సంక్షేమశాఖ అధికారి స్వరూపారాణితో కలిసి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని తెలిపారు. దివ్యాంగుల పరిరక్షణ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని, దివ్యాంగులకు ప్రత్యేక కమ్యూనిటీ హాల్ ఏర్పాటుపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. దివ్యాంగుల సమస్యలపై ఆన్లైన్లో ఉన్న నంబర్కు వాట్సాప్ ద్వారా దరఖాస్తు చేసినట్లయితే పరిష్కారంపై ప్రత్యేక దృష్టి తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. దివ్యాంగుల సౌకర్యార్థం ట్రై సైకిళ్ళు అందించడం జరుగుతుందని తెలిపారు. సంకల్పం, మనోధైర్యంతో ముందుకు సాగాలని, అన్ని రంగాలలో దివ్యాంగులకు ప్రత్యేక రిజర్వేషన్ కేటాయించడం జరిగిందనని, దివ్యాంగులు అందరితో సమానంగా రాణించవచ్చని, ప్రభుత్వం ఆ దిశగా ప్రోత్సహిస్తుందని తెలిపారు.దివ్యాంగులుగా సమాజంలో ఉన్నత స్థాయిలో ఉండి ఎన్నో సేవలు అందిస్తున్న వారిని ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్.సి. కార్పొరేషన్ ఈ.డి.దుర్గాప్రసాద్, ఎస్.సి.అభివృద్ధి శాఖ అధికారి రవీందర్రెడ్డి, జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి నీరటి రాజేశ్వరి,జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి గణపతి, సంబంధిత శాఖల అధికారులు,దివ్యాంగుల సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## హుజూరాబాద్‌లో కార్డియాలజిస్టులను నియమించండి



**– హెల్త్ మినిస్టర్ దామోదరకు సబ్బని వెంకట్ వినతి**

**– నియోజకవర్గ పరిధిలో గుండె వైద్య నిపుణుల కొరత**

**– త్వరలో నియమిస్తామని మంత్రి రాజనర్సింహ హామీ**

**హుజురాబాద్ నియోజకవర్గం ప్రజాబలం ప్రతినిధి డిసెంబర్ 3**హుజురాబాద్ నియోజకవర్గ పరిధిలో సమస్యలపై ప్రముఖ సామాజికవేత్త, మల్టీ నేషనల్ కంపెనీ 'జెన్ ప్యాక్ట్' గ్లోబల్ వైస్ ప్రెసిడెంట్ సబ్బని వెంకట్ తన గళం వినిపిస్తున్నారు. ఇటీవల జమ్మికుంట సివిల్ హాస్పిటల్ ను సందర్శించి వసతుల కల్పన, వైద్య నిపుణుల కొరత గురించి వెంకట్ వాకబు చేశారు. హుజూరాబాద్ నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో గుండె వైద్య నిపుణుల కొరత, ఆవశ్యకత గురించి తెలుసుకుని రాష్ట్ర వైద్య శాఖ మంత్రి దామోదర రాజ నర్సింహాను కలిసి మంగళవారం వినతి పత్రం సమర్పించారు. గోల్డెన్ అవర్‌లో ట్రీట్‌మెంట్ అందించేందుకు కార్డియలజిస్టుల అవసరముందని వివరించారు. నియోజకవర్గ పరిధిలో గుండె వైద్య నిపుణులను నియమించాలని కోరారు. తనతో ఉన్న సన్నిహిత్యం కారణంగా మంత్రి సానుకూలంగా స్పందించారని.. త్వరలో అధికారులతో మాట్లాడి గుండె వైద్య నిపుణులను నియమిస్తానని హామీ ఇచ్చారని సబ్బని వెంకట్ వెల్లడించారు. హుజూరాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో విద్య, వైద్యం, ఉపాధి కల్పనకు తన వంతుగా కృషి చేస్తూనే.. ప్రభుత్వాల పరంగా చేయాల్సిన విషయాలపై సామాజికవేత్త తన వాయిస్ వినిపిస్తున్నారు. ప్రజల పక్షాన ప్రభుత్వం దృష్టికి సమస్యలను తీసుకెళ్తూ.. పరిష్కారానికి తన వంతు కృషి చేస్తున్నారు. యువతను క్రీడల్లో ప్రోత్సహించడానికి సైతం సబ్బని వెంకట్ ఆర్థిక సాయం చేస్తున్నారు.

# శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవు

## పోలీస్ కమీషనర్ ఐపిఎస్ ఐజీ ఎం.శ్రీనివాస్ ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ట్రాఫిక్ అడ్వైజరి..



ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి డిసెంబర్ 03 : తేది 04-12-2024 రోజున పెద్దపల్లి లో గ్రూప్ -%×ఒ% అభ్యర్థులకు నియామక పత్రాల అందచేత,పలు అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమాల నేపథ్యంలో గౌరవ ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా సామాన్య ప్రజలకు ఎలాంటి ట్రాఫిక్ సమస్య కలగకూడదని ప్రజల సౌకర్యార్థం ముందస్తుగా ట్రాఫిక్ డైవర్షన్స్ గురించి పోలీస్ వారి సూచనలు ఇవ్వడం జరుగుతుంది కావున రేపు తేది 04-12-2024 ఉదయం నుండి ట్రాఫిక్ డైవర్షన్స్ ఏర్పాటు చేయడం జరుగుతోంది కావున ప్రజలందరూ సహకరించగలరని విజ్ఞప్తి.10 గంటల నుండి ముఖ్యమంత్రి గారి పర్యటన ముగింపు వరకు ప్రజలు కింద తెలిపిన మరియు ఇతర ప్రత్యామ్నాయ రవాణా మార్గాలు చూసుకోవాలని పోలీస్ వారి సూచన.

ట్రాఫిక్ డైవరషన్ లు రామగుండం నుండి కరీంనగర్ వైపు వెళ్ళు అన్ని వాహనాలు ధర్మారం-ఎక్స్ రోడ్(బసంత్ నగర్) ద్వారా కుక్కలగూడూరు, రాజారాంపల్లి, ధర్మారం,చొప్పదండి ద్వారా కరీంనగర్ వైపు వెళ్ళాలి. మంథని వైపు నుండి కరీంనగర్ వైపు వెళ్ళు భారీ వాహనాలు అప్పన్నపేట, ధర్మారం-ఎక్స్ రోడ్(బసంత్ నగర్) ద్వారా కుక్కలగూడూరు, రాజారాంపల్లి, ధర్మారం,చొప్పదండి ద్వారా కరీంనగర్ వైపు వెళ్ళాలి.మంథని వైపు నుండి కరీంనగర్ వైపు వెళ్ళు 4 వీలర్లు అప్పన్నపేట నుండి ఎడమ వైపు తీసుకుని బొంపల్లి, దొంగతుర్తి,ధర్మారం, చొప్పదండి ద్వారా కరీంనగర్ వైపు వెళ్ళాలి.కరీంనగర్ నుండి రామగుండం, మంథని వైపు వెళ్ళు భారీ వాహనాలు ముగ్దుంపూర్-ఎక్స్ రోడ్ నుండి కరీంనగర్-లక్షెట్టిపేట రోడ్ ద్వారా చొప్పదండి,ధర్మారం, రాజారాంపల్లి వద్ద కుడి వైపు తీసుకుని కుక్కలగూడూర్, ధర్మారం-ఎక్స్ రోడ్ ద్వారా రాజీవ్ రహదారి (కరీంనగర్-రామగుండం)కు చేరుకుని రామగుండం, మంథని వైపు వెళ్ళాలి.కరీంనగర్ నుండి పెద్దపల్లి, రామగుండం వైపు వచ్చే 4 వీలర్ లు సుల్తానాబాద్ మండలం నారాయణపూర్-ఎక్స్ రోడ్ నుండి నారాయణపూర్, కోదురుపాక, నిమ్మనపల్లి,పెద్దపల్లి సాగర్ రోడ్, జూనియర్ కాలేజ్ రోడ్(ఎమ్ బీ గార్డెన్ రోడ్), అయ్యప్ప జంక్షన్ ద్వారా రామగుండం మరియు మంథని వైపు వెళ్లవచ్చు.

గౌరవ ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా కార్యక్రమాలు చేసిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని రామగుండము పోలీస్ కమీషనర్ ఐపిఎస్ ఐజీ ఎం. శ్రీనివాస్ హెచ్చరించారు. చట్టవ్యతిరేక, ప్రజా శాంతికి,శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదన్నారు.ఎలాంటి సంఘటనలకు తావు లేకుండా ప్రశాంత వాతావరణం ఉండాలని అన్ని వర్గాల ప్రజలు శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా పోలీసులతో సహకరించాలని సిపి గారు కోరారు.

## ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ను ప్రారంభించిన ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్




ప్రజాబలం ప్రతినిధి నిర్మల్ జిల్లా.. నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ను ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్,అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ తో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదగాలని అన్నారు.

క్యాంటీన్ లో నాణ్యమైన ఆహారాన్ని సరసమైన ధరలకు అందించాలని సూచించారు.మహిళా సంఘాల సభ్యులకు ప్రభుత్వం అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ వేడుకలు

**ప్రజాబలం మందమర్రి మండల రిపోర్టర్ డిసెంబర్ 3**మందమర్రి ఏరియాలోని సింగరేణి హై స్కూల్ గ్రౌండ్ లో గల మనోవికాస్ స్కూల్ లో మంగళవారం నిర్వహించిన అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథి గా జి.ఎం జి.దేవేందర్ హాజరయ్యారు. డిసెంబర్ 3 అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన క్రీడలలో గెలుపొందిన విద్యార్థిని,విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని దివ్యాంగుల పిల్లల మధ్య జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఎంతో ఓపికతో ఎంతో శ్రమకు ఓర్చి ఇలాంటి పిల్లలకు చదువు చెప్పడం, కొన్ని పనులలో నేర్పరులనుగా చేయడం, ఇక్కడ వారికి శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులకు, ఆయాలకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను అని అన్నారు. దివ్యాంగులు చాలా శక్తివంతమైన వారిని వారిలో ఏదో తెలియని శక్తి దాగి ఉందని దానిని వెలికి తీసి ప్రోత్సహించాలని ఆయన సూచించారు. అలాగే మనోవికాస్ స్కూల్ పిల్లలకు మన సింగరేణి ఉద్యోగులు కూడా సహకరిస్తున్నరని, ఇంకా ప్రత్యక్షంగా పరోక్షంగా సహాయపడుతున్న అందరికీ కూడా కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం ఆటల పోటీల లో గెలుపొందిన వారికి బహుమతులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి మందమర్రి ఏరియా బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ, పర్సనల్ మేనేజర్ ఎస్.శ్యాంసుందర్, డి.వై పి.ఎం శ్రీ,ఎం.డి ఆసిఫ్, శ్రీమతి టి. సురేఖ, (మనోవికాస్ స్పెషల్ స్కూల్ మందమర్రి ఇంచార్జ్), శ్రీ టి.రాజలింగు,(పేరెంట్స్ కమిటీ వైస్ ప్రెసిడెంట్ మందమర్రి), తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.






# ఘనంగా ప్రజాపాలన విజయోత్సవ ర్యాలీ

## మహిళా సంఘ సభ్యులకు చెక్కు పంపిణి మునిసిపల్ కార్మికులకు సన్మానం..




**జమ్మికుంట ప్రజాబలం ప్రతినిధి డిసెంబర్ 3** జమ్మికుంట మునిసిపాలిటి అధ్వర్యంలో ప్రజాపాలన విజయోత్సవాలలో భాగంగా అర్బన్ డే కార్యక్రమం సందర్భంగా మంగళవారం ర్యాలి నిర్వహించారు. ముందుగా మునిసిపల్ చైర్మెన్ తక్కళ్ళపల్లి రాజేశ్వర్ రావు, మునిసిపల్ కమీషనర్ మొహమ్మద్ ఆయాజ్ లు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. పాత మునిసిపల్ కార్యాలయం నుండి సుమారు 650 మంది సంఘ సభ్యులు, మునిసిపల్ సిబ్బందితో కలిసి పట్టణ పురవీదుల గుండా సువర్ణ ఫంక్షన్ హాల్ వరకు ర్యాలి నిర్వహించారు. అనంతరం మహిళా సంఘ సభ్యులు ఏర్పాటు చేసిన స్టాల్స్ ను సందర్శించి, వారిని అభినందించారు. తదనంతరం ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిదిగా హాజరైన రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ పి శ్రీధర్, మునిసిపల్ చైర్మెన్ తక్కళ్ళపల్లి రాజేశ్వర్ రావు, మునిసిపల్ కమీషనర్ అయాజ్ లు మాట్లాడుతూ రాష్ట్రంలో 139 మునిసిపాలిటిలలో ఎక్కడ చేయలేని కార్యక్రమాలు పారిశుధ్య కార్మికులకు ఇన్సూరెన్స్, ఈ ఎస్ ఐ కార్డుల పంపిణి, హెల్త్ కార్డుల పంపిణి వంటి ఎన్నో కార్యక్రమాలు జమ్మికుంట మునిసిపాలిటి నిర్వహిస్తుందని అయన అన్నారు. పారిశుధ్య కార్మికుల ఆరోగ్యమే పట్టణ ప్రజల ఆరోగ్యం అని ఉద్దేశంతో ఈహెల్త్ క్యాంపు నిర్వహించడం జరిగిందన్నారు. పట్టణంలో పారిశుధ్య కార్మికులు వెన్నుపూస లాంటివారని, వారు లేకపోతే పట్టణ అభివృద్ధి జరగదని వారు అన్నారు. ఈ కార్యక్రమలో ఐఎం.ఏ అధ్యక్షులు డాక్టర్ సుధాకర్ అధ్వర్యంలో 14 మంది వైద్యులతో హెల్త్ క్యాంపు నిర్వహించగా, కార్మికులు, సంఘ సభ్యులు ఆర్థో, ఫిజిషేయన్, సర్జన్ లకు చెందినా వైద్యులు పరీక్షించి, పరిక్షలు నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో పనిచేస్తున్న 12 మంది కార్మికులకు, 4 వాటర్ సప్లై వర్కర్స్, 5 సంఘ సభ్యులకు, ఇద్దరు వార్డ్ ఆఫీసర్లకు, సానిటరీ ఇన్స్ పెక్టర్ సదానందం, కంప్యూటర్ ఆపరేటర్ కుమార్, ఇద్దరు బిల్ కల్లెక్టర్లకు, టౌన్ ప్లానింగ్ చైన్మెన్, ఇద్దరు అటెండర్లకు సన్మానం చేసారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ వైస్ చైర్మెన్ దేశిని స్వప్న కోటి, మునిసిపల్ మేనేజర్ జి రాజిరెడ్డి, ఏఈ నరేష్, జూనియర్ ఎకౌంటు ఆఫీసర్ రాజశేఖర్ రెడ్డీ, హెల్త్ అసిస్టంట్ మహేష్, సీనియర్ అస్సిస్టంట్ భాస్కర్, వాణి, ఇంచార్జ్ టి.ఎం.సి. మానస, ఎన్విరాన్మేంట్ ఇంజనీర్ శ్రీకాంత్, మునిసిపల్ కౌన్సిలేర్లు, సిఎల్ అర్పిలు, అర్పిలు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, జవాన్లు, పారిశుధ్య కార్మికులు పలువురు పాల్గొన్నారు.







# ఘనంగా తెలంగాణ ప్రజాపాలన విజయోత్సవాలు




**ప్రజాబలం మందమర్రి మండల రిపోర్టర్ డిసెంబర్ 3** :తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజా పాలన విజయోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ముందుగా మున్సిపల్ కార్యాలయం నుండి బస్టాండ్ వరకు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ చెన్నూరు శాసనసభ్యులు శ్రీ నల్లాల ఓదెలు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నోముల ఉపేందర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు శ్రీ సొత్కు సుదర్శన్ గా ఇతర పార్టీ నాయకులు పాల్గొన్నారు. అదేవిధంగా కార్యాలయం నుండి మున్సిపల్ కమిషనర్ శ్రీ ఇన్ వెంకటేశ్వర్లు మున్సిపల్ ఇంజనీర్ శ్రీమతి సుమతి, మున్సిపల్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్ సందీప్, మున్సిపల్ రెవెన్యూ ఆఫీసర్ సి పి కృష్ణ ప్రసాద్ లు పాల్గొన్నారు. అనంతరం కార్యాలయం నందు ఆరోగ్య సిబ్బందిచే పారిశుధ్య కార్మికులకు హెల్త్ క్యాంప్ నిర్వహించారు. పారిశుధ్య కార్మికులకు పిపీఈ కిట్స్ ( అప్రాన్స్ గన్ షూస్ హ్యాండ్ గ్లౌజులు,సబ్బులు,నూనెలు, ప్రశంసా పత్రములతో సత్కరించారు. ఎస్ హెచ్ జి గ్రూప్ సభ్యులకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ మరియు ఫీల్డ్ ఆఫీసర్, మాజీ శాసనసభ్యులు నల్లాల ఓదెలు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నిలిగొండ వెంకటేశ్వర్లు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం. సుమతి, రెవెన్యూ ఆఫీసర్ పి. కృష్ణ ప్రసాద్, మున్సిపల్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్. సందీప్, శానిటరీ ఇన్స్పెక్టర్ వి. శ్యాంసుందర్, హెల్త్ అసిస్టెంట్ ఎం. ఏ. సమీర్, జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ ఏ. నాగిరెడ్డి, సీనియర్ అసిస్టెంట్లు ఏ. రాణి, బి శ్రీనివాస్, బి. లక్ష్మీరాజు, జి. రాజేందర్, మెప్మా టౌన్ కో ఆర్డినేటర్ ఏనుగు రఘురాం, 24 వార్డుల రిసోర్స్ పర్సన్లు మరియు వార్డు ప్రజలు పాల్గొన్నారు.



## థాయిలాండ్ లో తప్పిపోయిన ఇద్దరు తెలంగాణ వాసులు

### భర్తల ఆచూకీ కోసం భార్యల వినతి

జగిత్యాల ఓ ఏజెంటుకు రూ.2 లక్షల చొప్పున చెల్లించి విజిట్ వీసాపై ఉద్యోగం కోసం థాయిలాండ్ కు వెళ్లిన ఇద్దరు తెలంగాణ వాసులు అక్కడ తప్పిపోయిన సంఘటన జరిగింది. నిజామాబాద్ జిల్లా షెట్పల్లి కి చెందిన శనిగరపు అరవింద్, జగిత్యాల జిల్లా ఆత్మకూరు కు చెందిన కొండ సాగర్ నవంబర్ 11న ముంబయి నుంచి బ్యాంకాక్ కు వెళ్లారని 21 నుంచి అందుబాటులో లేకుండా పోయారని అరవింద్ భార్య జల, సాగర్ భార్య కాశమ్మ మంగళవారం హైదరాబాద్ లోని ప్రవాసి ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. వారివెంట కాంగ్రెస్ ఎన్నారై సెల్ నాయకులు డా. బిఎం వినోద్ కుమార్, మంద భీంరెడ్డి, చెన్నమనేని శ్రీనివాస రావు ఉన్నారు. థాయిలాండ్ లో తప్పిపోయిన ఇద్దరి ఆచూకీ తెలుసుకోవాలని, ఏజెంట్ పై పోలీసు కేసు నమోదు చేయాలని వారు ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు.

# అమ్మవారి పూజా కార్యక్రమంలో పాల్గోన్న దానం నాగేందర్





**గోషామహల్ ప్రజాబలం ప్రతినిధి:** గోషామహల్ అసెంబ్లీ నియెజక వర్గంలోని గోషామహల్ లో యోగేష్ యాదవ్ కుటుంబం ఆధ్వర్యంలో జరిగిన తుల్జాభవాని అమ్మవారి పూజా కార్యక్రమంలో ముఖ్యఅతిధిగా ఖైరతాబాద్ శాసన సభ్యులు దానం నాగేందర్ పాల్గోని అమ్మవారి ఆశీర్వాదం పొందారు.ఈ సందర్భంలో దానం నాగేందర్ మాట్లాడుతూ గ్రేటర్ హైదరాబాద్ ప్రజలందరు అమ్మవారి ఆశీర్వాదంతో సుఖశాంతులతో కలిసిమెలిసి ఉండాలని కోరుకున్న అని అన్నారు . ఈ కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ ఖైరాతాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యాక్షులు ఎస్.ధనరాజ్ ,టీ.సతీష్,సంతోష్‌గుప్తా , వాసు ,సుభాష్, తదితరులు పాల్గోన్నారు.

# అధిక శబ్దం చేసే ద్విచక్ర వాహనాలపై ప్రత్యేక దృష్టి




రాజన్న సిరిసిల్ల జిల్లా ,
3 డిసెంబర్ 2024 ,
ప్రజాబలం ప్రతినిధి,

ద్విచక్ర వాహనాలకు సైలెన్సర్లు మార్చిన, వాహనాలకు సైరన్లు ఏర్పాటు చేసిన కేసుల తప్పవు.

అధిక శబ్ధం చేసే 72 ద్విచక్ర వాహన సైలెన్సర్లు , నిబంధనలకు విరుద్ధంగా ఏర్పటు చేసిన 03 పోలీస్ సైరన్లు ధ్వంసం.

ద్విచక్ర వాహనదారులు కంపెనీతో వచ్చిన సైలెన్సర్లు మార్పు చేసిన,వాహనాలకు నిబంధనలకు విరుద్ధంగా పోలీస్ సైరన్లు అమర్చిన చట్ట రీత్యా చర్యలు తీసుకోబడుతాయని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ హెచ్చరించారు.

జిల్లాలో రెండు నెలల వ్యవధిలో నిబంధనలకు విరుద్ధంగా ద్విచక్ర వాహనాల కంపెనీ సైలెన్సర్ స్థానంలో అధిక శబ్దం వచ్చే సైలెన్సర్లు ఏర్పాటుపై పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి 72 ద్విచక్ర వాహన సైలెన్సర్లను మరియు నిబంధనలకు విరుద్ధంగా వాహనాలకు ఏర్పాటు చేసిన 03 పోలీస్ సైరన్లను గుర్తించి మరోమారు వినియోగించకుండా రోడ్ రోలర్ సాయంతో మంగళవారం రోజున సిరిసిల్ల పట్టణ పరిధిలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ధ్వంసం చేసారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ....నిబంధనలకు విరుద్ధంగా ద్విచక్ర వాహనాల సైలెన్సర్లను మార్పు చేయడం చట్టరిత్యా నేరమని,శబ్ద కాలుష్య నియంత్రణతో పాటు ప్రజాఆరోగ్యాన్ని దృష్టిలో వుంచుకోని అధికంగా శబ్దం చేసే ద్విచక్రవాహనలపై ప్రత్యేక దృష్టి సారించి జిల్లా వ్యాప్తంగా తనీఖీలు చేపట్టడం జరిగిందన్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులకు తెలియజేయునది కంపెనీతో వచ్చిన సైలెన్సర్లను మాత్రమే వినియోగించుకోవాలని,ఎవరైన వాహనదారుడు సైలెన్సర్ మార్పు చేసి శబ్ద కాలుష్యానికి కారణమవుతున్నా వాహనాలపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జిల్లాలో నిబంధనలు విరుద్ధంగా వాహనాలకు పోలీస్ సైరన్లు బిగిస్తే వాహనాలు సీజ్ చేసి కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా పోలీస్ సైరన్లు బిగించిన సుమారు 10 వాహనాలపై కేసులు నమోదు చేసి వాహనాలు సీజ్ చేయడం జరిగిందన్నారు.

వాహణలకు సైలెన్సర్ మార్పు చేసి శబ్ద కాలుష్యానికి కారణమవుతున్నా వారి సమాచారం సిరిసిల్ల ట్రాఫిక్ ఎస్.ఐ 8712656441 , వేములవాడ ట్రాఫిక్ ఎస్.ఐ 8712656440 కి సమాచారం ఇవ్వాలని తెలిపారు.

ఎస్పీ వెంట డిఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, సి.ఐ కృష్ణ, ట్రాఫిక్ ఎస్.ఐ రమేష్, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

## నృత్య కళా ప్రదర్శనలో మెరిసిన తులసి హిరెన్స్రీ

## -ఎస్సై చేతుల మీదుగా చిన్నారికి బహుమతి ప్రధానం



**ప్రజాబలం మందమర్రి మండల రిపోర్టర్ డిసెంబర్ 3** :మంచిర్యాల జిల్లా నృత్య కళాకారుల అసోసియేషన్, టాలెంట్ నృత్య కళా నిలయం సంయుక్తంగా నిర్వహించిన బాల ప్రతిభా కళోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈపోటీలలో అత్యంత ప్రతిభ చూపిన తులసి హిరెన్స్రీ ప్రధమ బహుమతి గెలుచుకుంది. తన అద్భుత ప్రతిభా నైపుణ్యంతో మొదటి స్థానం సాధించిన చిన్నారికి మందమర్రి ఎస్.ఐ రాజశేఖర్ చేతుల మీదుగా బహుమతిని అందుకుంది.

# సొంత భూమిలో అక్రమంగా నిర్మిస్తున్న చర్చిపై ఎంపీడీవో కు వినతి పత్రం



**ప్రజాబలం దండేపల్లి మండల రిపోర్టర్ డిసెంబర్ 03 :** స్వంత భూమిలో అక్రమంగా ఇల్లు నిర్మించి దానిని చర్చిగా మార్చినందుకు,తగు చర్యల దండేపల్లి ఎంపీడీవో కు వినతి పత్రం అందజేశారు మంగళవారం ఈ సందర్భంగా

మేదరి శంకర్,నివాసము లింగాపూర్(దుబ్బగూడ) అనే వారు మాట్లాడుతూ... పాఠశాల పక్కన ఉన్న నా స్వంత భూమిలో(సర్వే నెం 90/59) గ్రామానికి చెందిన సురిమిల్ల లింగయ్య తండ్రి భీమయ్య,అక్రమంగా ఇల్లు నిర్మించుకుని,(పాఠశాల సమయంలో) అందులో క్రై స్తవ ప్రార్ధనలు చేయడం, గట్టిగా అరవడం,పిల్లలు తాగునీరు కొరకు,బోరింగ్ వద్దకు వెళ్ళే పిల్లపట్ల దుర్భషలాడటం, చేస్తున్నాడు. అంతేకాకుండా పాఠశాల టీచరు ను కూడా బెదిరిస్తూ,భయాందోళనకు గురిచేస్తున్నారు.దీనిపై పలుమార్లు మేము ఫిర్యాదులు కూడా చేస్తునే ఉన్నాము.గతంలో అక్కడ ప్రార్థలను చేస్తున్నవారు, కొంతమంది హిందు గ్రామ దేవతల యొక్క విగ్రహాలను కూడా ధ్వంసం చేశారు.దీనిపై ఫిర్యాదు చేయగా,కేసులు కూడ నమోదయ్యాయి.చర్చి న్మిణం పై ఈనెల 12న గ్రామస్తులు అభ్యంతరం తెలిపినందుకు,హిందు వర్గానికి చెందిన నంది సురేష్ అనే వ్యక్తిని క్రై స్థలు కత్తి పొడిచి హత్యాయత్నం చేశారు.దీనిపై కూడా పోలీస్టేషన్లో ఫిర్యాదు చేసిన దాడిచేసిన వారిపై ఎలాంటి చర్యలు లేవు.గ్రామ పంచాయతీ నుంచి ఎలాంటి అనుమతులు కూడా లేకుండా ఇల్లు నిర్మించి,దానిని చర్చిగా మార్చి,స్థానికులకు ఇబ్బంది కలిగిస్తున్నందు, అట్టి చర్చిని వెంటనే తొలగించాలని, వివాదాస్పదంగా మారిన చర్చిని 24 గంటల్లో తొలగించని యెడల హిందు సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు చేసేందుకు సిద్ధం తెలియజేస్తున్నాము.

దీనికి గతంలో చేసిన పిర్యాదు తెలిపారు.ఈ కార్యక్రమంలో మేదరి శంకర్,మేదరి రిమిల,మేదరి హరిష్, సంధ్యవేణి కిరణ్, గాదే శ్రీనివాస్,కొండ నరేష్,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# బదిలీపై వెళ్తున్న అధికారికి ఘన సన్మానం



**ప్రజాబలం మందమర్రి మండల రిపోర్టర్ డిసెంబర్ 3**మందమర్రి ఏరియా స్టోర్ ఎస్.ఈ గ విధులు నిర్వర్తించి బదిలీపై వెళ్తున్న పైడిశ్వర్ ని, మంగళవారం మందమర్రి లోని జీ.ఎం కార్యాలయంలో ఏరియ సింగరేణి అధికారులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ జి.దేవేందర్ మందమర్రి ఏరియాలో పైడీశ్వర్ చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మందమర్రి ఏరియా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# లా డే సందర్భంగా సీనియర్ న్యాయవాదులకు ఘన సన్మానం





**కరీంనగర్ ప్రజాబలం ప్రతినిధి:**న్యాయవాదుల దినోత్సవాన్ని పురస్కరించుకుని టిపిసిసి జాయింట్ కన్వీనర్ భూక్యా రజనీష్ ,కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ లీగల్ సెల్ చైర్మన్ కల్లేపెల్లి లక్ష్మయ్య ఆధ్వర్యంలో మంగళవారం పలువురు సీనియర్ న్యాయవాదులను ఘనంగా సన్మానించారు. కరీంనగర్ బార్ అసోసియేషన్ న్యాయవాదుల మీటింగ్ హాల్ లో న్యాయ వాద వృతి లో 35 సం. లు పైబడిన సీనియర్ న్యాయవాదులు గులాబీల మల్లారెడ్డి పటేల్, మరొజు రామకృష్ణ చారి, మెట్ట అనిల్ కుమార్, డి మల్లయ్య, కుసుంబా కృష్ణ రావు, కొరివి వేణు గోపాల్ లను శాలువా, బొకే లతో ఘనంగా సన్మానించారు. ఇటీవల కాంగ్రెస్ లీగల్ సెల్ మీడియా కన్వీనర్ గా నియమితులైన కొత్త ప్రకాశ్ ను శాలువా, బొకే తో సన్మానించారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీతలు మాట్లాడుతు న్యాయవాది వృతి లో ఎంతో పవిత్ర మైనదని జూనియర్ న్యాయవాదులు కేసుల విషయం లో డౌట్ లు ఉంటే సీనియర్ ల సలహాలు సూచనలు తీసుకోవాలని, డబ్బులే ముఖ్యం కాదని అన్నారు. ఎంత సీనియర్ ఐన నిత్య విద్యార్థి నని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు చేపట్టిన కాంగ్రెస్ లీగల్ సెల్ బాధ్యులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లీగల్ సెల్ బాధ్యులు వి కృష్ణ, కె శంకర్, శ్రీకాంత్, శ్రీరాముల కిషన్, సృజన్, రాజు, బాలకిషన్, రాచకొండ ప్రభాకర్, పర్లపెల్లి వేణుగోపాల్, లక్ష్మన్ రావు, చక్రధర్, ప్రభాకర్, ఆంజనేయులు తదతరులు పాల్గొన్నారు.

## వైద్యులు సమయ పాలన పాటించాలి
## జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్

మెట్ పల్లి, వైద్యులు సమయ పాలన పాటించి,వైద్య సేవలను మెరుగు పరచాలని, జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ ఆదేశించారుమంగళవారం మెటపల్లి పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఓపీ సేవలు, ఆన్ లైన్ రిజిస్టర్లను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఆసుపత్రిలో ప్రసూతి సేవలను, వైద్య సేవలను మెరుగు పరచాలని, డాక్టర్లు సమయ పాలన పాటించాలని కలెక్టర్ ఆదేశించారు. రోజుకు ఎన్ని ఓ.పి.లను చూస్తున్నారు, ఎంతమంది డెలివరీలు అయ్యారని, ప్రభుత్వ ఆసుపత్రిలో నార్మల్ డెలివరీలను పెంచుటకు గర్భిణులను ప్రోత్సహించాలని డాక్టర్లకు సూచించారు. ఆసుపత్రిలో పేషెంట్లకు నాణ్యమైన ఆహారాన్ని, త్రాగునీరు అందిస్తున్నారా లేదా లేని యెడల వెంటనే పేషెంట్లకు అందించుటకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆసుపత్రిలో శుభ్రమైన త్రాగునీరు సరఫరా చేసే విధంగా వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. పేషెంట్ లను కలిసి వారి ఆరోగ్య వివరాలు మరియు హాస్పిటల్ సిబ్బంది వ్యవహరించే తీరును అడిగి తెలుసుకున్నారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com